


70497

# పశ్చిమ గోదావరి జిల్లాలో
# ప్రసిద్ధ దేవాలయాలు


## ఎన్.ఎస్. నాగిరెడ్డి


వెల : రు. 46/-


## బ్రిల్లియంట్ బుక్స్

గులాబీ తోట, విజయవాడ - 520 003.

ఫోన్ : 433749



1942K

ఈ పుస్తకంతో పాటే విడుదల అయ్యాయ్ !

ప్రతి వారు తమ యింట్లో తప్పక వుంచుకోవాల్సిన

ఆణిముత్యాల్లాంటి పుస్తకాలు

కృష్ణాజిల్లాలో ప్రసిద్ధ (పురాతన) దేవాలయాలు - N.S. నాగిరెడ్డి

(ఆలయాల ఫోటోలతో)

గుంటూరు జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలు N.S. నాగిరెడ్డి

(ఆలయాల ఫోటోలతో)

తూర్పు గోదావరి జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలు N.S. నాగిరెడ్డి

(ఆలయాల ఫోటోలతో)

మహారాష్ట్ర టూరిస్టు గైడ్ N.S. నాగిరెడ్డి

(జిల్లా మ్యాపులు మరియు ఫోటోలతో)

కలలు - వాటి ఫలితాలు - పి. నరసింహారావు

(మనో వైజ్ఞానిక విశ్లేషణ)

వివరాలకు :

బ్రిల్లియంట్ బుక్స్

గులాబీతోట, విజయవాడ - 520 003.

ఫోన్ : 433749

# PACHCHIMA GODAVARI ZILLA LO PRASIDDA DEVAALAYAALU

7.26.1) 954 8416

*by*

**N.S. NAGIREDDY**

*First Edition :*
March 1999
© All Rights Reserved by Author

*Price :* Rs. **46/-**

*Cover Design :*
**M. Srinivas**

*Photos :*
**P. Prasada Rao**

*DTP :*
**Praveena Graphics,**
Vijayawada. Ph : 436162

*Printed :*
**Sri Sai Offset Printers,**
Vijayawada

*Published by*
**Brilliant Books**
Gulabhi Thota,
Vijayawada - 520 003.

70,497

C: 12486

---

No Part of this book or photos may be reproduced, stored in a retrieval system or transmitted in any form or bymeans of electronic, mechanical, photo copying, recording or other wise without prior written permission from Author brief text quotations, with use of photographs are exempted for purpose of book reviews only statutory declaration under section 52 A of the India Copy right act -1957

# మీతో కొద్ది క్షణాలు....

ఎన్నో యుగాలనాటి సంస్కృతి మనది. ఈ సంస్కృతిలో దేవాలయాలు ఒక ముఖ్య భాగంగా పరిగణించబడుతున్నాయి. భారతదేశంలో దేవాలయం లేని గ్రామం అంటూ వుండకపోవచ్చునంటే కొంచెం కూడా అతిశయోక్తి కాబోదు.

మన రాష్ట్రంలో, ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో చాలా గ్రామాల్లో చూస్తే ఎంతో చరిత్ర గల ప్రాచీన ప్రసిద్ధ దేవాలయాలు మనకు దర్శనమిస్తాయి. ఏ గ్రామంలో చూసినా స్థానికులు, భక్తులు తమ శక్తి మేరకు చందాలు సేకరించి దేవాలయాలను నిర్మించి, వాటిని అపురూపంగా నిర్వహిస్తూ, వాటిని నిత్య నూతనంగా వుండేట్లు చూడటం గొప్ప విషయంగానే పరిగణించాలి. ఒక విధంగా ప్రభుత్వ పోషణలో వున్న ఆలయాలకంటే భక్తి జన సంరక్షణల్లో వున్న గుడులే ప్రాబల్యంలో వుండటం గమనార్హం.

ఈ జిల్లాలోని దేవాలయాలను వీక్షించబోయే ముందు కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకురావడం అనివార్యం. ఈ జిల్లాలో వేల సంవత్సరాల నాటి ప్రాచీన దేవాలయాలు ఎన్నో వున్నాయి. పంచారామాల్లోని క్షీరారామం (పాలకొల్లు), సోమారామం (గునుపూడి) ఈ జిల్లాలోనివే ! అందువల్లనే 'ప్రసిద్ధ' అనే మాటకు 'పురాతనం' అని అర్థం తీసుకుని ఈ ప్రాచీన ఆలయాలను, వాటి ప్రాముఖ్యతను ఈ చిన్న పుస్తకంలో పొందుపరచడం జరిగింది. ఇందులో ఇవ్వబడ్డ దేవాలయాలన్నింటిని సందర్శించిన తర్వాతే ఈ పుస్తకంలో చేర్చడం జరిగింది.

ఈ పుస్తకంలోని స్థల పురాణాలను చదివితే చాలా మందికి కొన్ని సందేహాలు కలగవచ్చు. ఉదాహరణకు ద్వారకా తిరుమలలో వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి కలియుగ దైవం. అనగా కలియుగంలోనే ఆవిర్భవించినట్లుగా అనుకోవాలి. కానీ ఆ స్వామిని శ్రీరాముని వంశజులు దర్శించినట్లు స్థల పురాణం చెబుతోంది. త్రేతాయుగంలోని వారు అప్పటికింకా రాని, కలియుగంలో వెలవాల్సిన దైవాన్ని ఎలా దర్శనం చేసుకోగలరు ?

ఇలాంటి సందేహాలు తీరాలంటే శ్రీనివాసుడు ఏ కలియుగంలో వెలిశాడనేది తెల్సుకోవాలి ? అంటే యుగముల చరిత్ర గురించి కొద్దిగా మీకు తెలిసి వుండాలి. అందుకే ఈ ప్రస్తావన ! యుగాలు నాలుగు అని అందరికి తెలుసు. అందులో కృతయుగము 17,28,000 సంవత్సరములు, త్రేతాయుగము 12,96,000 సంవత్సరములు, ద్వాపర యుగము 8,64,000 సంవత్సరములు, కలియుగము 4,32,000 సంవత్సరములుగా నిర్ణయించబడ్డాయి. ఈ నాలుగు యుగాలను కలిపితే ఒక మహాయుగము అవుతుంది. అంటే ఒక మహాయుగమునకు 43,20,000 సంవత్సరములన్నమాట.

ఈ యుగములలోని సంవత్సరాల సంఖ్యను బట్టి పరిశీలించి చూస్తే రెండు కలియుగములు ఒక ద్వాపర యుగము, మూడు కలియుగములు ఒక త్రేతాయుగము, నాలుగు కలియుగములు ఒక కృత యుగము, పది కలియుగములు ఒక మహా యుగము అని తెలుతుంది.

ఈ సృష్టిని అంతా సృష్టించేది బ్రహ్మ అయినా పాలించేది మాత్రము మనువులే! ఒక్కొక్క మనువు 71 మహాయుగములు పాలన జరుపుతారు. అలాంటి మనువులు 14 మంది పాలించేకాలం అంతా కలిపితే బ్రహ్మకు ఒక పగలు అవుతుంది. బ్రహ్మకు రాత్రి కాలం కూడా అంతే అవుతుంది. ఉదయ కల్పము, క్షయకల్పము అనబడే ఈ సమయాల్లో క్షయకల్పములో బ్రహ్మ నిద్రపోతాడు.

ఇంతవరకూ ఆరు ఉదయ కల్పములు బ్రహ్మకు జరిగాయి. ఆ ఆరు ఉదయ కల్పములను స్వయంభువ, స్వారో చిహ, ఉత్తమ, తామస, రైవత, చాక్షుష అనబడే ఆరుగురు మనువులు పరిపాలించారు. ఇప్పుడు ఏడవ మనువు అయిన వైవస్వతుడు పాలిస్తున్న 71 మహాయుగములలో 28వ మహాయుగములోని కలియుగమునడుస్తోంది.

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. అందరూ అనుకునేట్లుగా అసలు బ్రహ్మ ఒక్కడే కాదు. బ్రహ్మ అయుష్షు 100 సంవత్సరములు. ఇప్పటి వరకూ మానవ బ్రహ్మ, చాక్షుష బ్రహ్మ, వాచిక బ్రహ్మ, శ్రావణ జన్మ బ్రహ్మ, నాసిక జన్మ బ్రహ్మ, అండ జన్మ బ్రహ్మ అనబడే ఆరుగురు బ్రహ్మలు పుట్టిగతించారు.

ప్రస్తుతం పద్మ భూః-నాభీకమలములో పుట్టిన బ్రహ్మకాలములో 50 సంవత్సరములుగడిచి 51వ సంవత్సరంలో మొదటి దినం గడుస్తోంది. అంటే ఇంకా 49 సంవత్సరములు జరిగితే ఈ బ్రహ్మ కూడా గతిస్తాడు. మన పంచాంగకారుల అంచనా ప్రకారం, మహాయుగము 43,20,000 సంవత్సరాలయితే, ఒక్క మనువు కాలం 71 మహాయుగాలయితే, మన్వంతరం అనగా 30,67,20,000 సంవత్సరాలన్నమాట. ఆ లెక్కన బ్రహ్మకు ఒక పగలుగా భావించే 14 మన్వంతరములు అంటే 429,40,80,00,000 సంవత్సరములు అవుతుంది.

బ్రహ్మ సంవత్సరము, 360 రోజులు అంటే 3,091,73,76,00,00,000 సంవత్సరాలు. 100 సంవత్సరములంటే 3,09,17,376 కోట్ల సంవత్సరములయితే అలాంటి ఆరుగురు బ్రహ్మల జీవిత కాలం 18,55,04,256 కోట్ల సంవత్సరాలు అవుతుంది.

ప్రస్తుత బ్రహ్మ కాలములో 50 సంవత్సరములు అనగా 15458688 కోట్ల సంవత్సరములు గడిచిపోయాయి. 7వ బ్రహ్మకాలము 20,09,62,944,00,000 సంవత్సరములయితే, అందులో 27 మహాయుగాలు అనగా 11,66,40,000 సంవత్సరములు గడిచి పోయాయి.

51వ సంవత్సరములో మొదటి రోజులోని 27 మహాయుగములు గడిచిపోగా, ఇప్పుడు 28వ మహాయుగములో కృత, త్రేతా, ద్వాపర యుగాలు అనగా 38,88,000 సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రస్తుతం నడుస్తున్న కలియుగములో 5100 సంవత్సరములు ఇప్పటికి గడిచిపోయాయి.

కనుక పంచాంగకర్తల అంచనా ప్రకారం సృష్టి వయుస్సు 20,09,62,956 కోట్ల 5 లక్షల 33 వేల ఒక వంద సంవత్సరములంటే ఆశ్చర్యంగా వున్నా, వారి అంచనాను కాదనలేముగా !

పై వివరణ చదివాక ద్వారక తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుడ్ని దశరధుడు, అజమహరాజులు ఎలా దర్శించుకోగలిగారనే సందేహానికి తావు లేదు. ఎందుకంటే స్వామి వారు ఏ కలియుగములో వెలిశారో ఇదమిద్ధంగా ఎవరికి తెలియదు.

ఈ సందర్భంలో ఆలయ నిర్మాణం గురించి కొంత చెప్పక తప్పదు. ఏ ఆలయం అయినా ఆగమశాస్త్రం ప్రకారమే నిర్మించబడుతుందనేది జగద్విదితం.

మానవ శరీరానికి అంగములున్నట్లే ఆలయానికి కూడా అంగములు వుంటాయి. వాటినే పంచఅంగములు అంటారు. ఆలయం పైభాగములో నాభి స్థానములో ఆ గుడి యొక్క విగ్రహాలు వుంటాయి. తరువాత కంఠ భాగాన్ని 'దిక్పాల వేదిక' అంటారు. ఈ దిక్పాల వేదికలో ఎనిమిది మూలలలోనూ దిక్పాలకుల్ని ప్రతిష్టిస్తారు. ఆ తరువాత, పై స్థానాన్ని 'కపోత వేదిక' అంటారు.

శాంతికి చిహ్నంగా భావించే కపోతముల కోసం ఈ కపోత వేదికల్లో బొరియలు వుంటాయి. వాటిలో పావురములు నివాసముంటాయి. తరువాత 'రాజ వేదిక' వుంటుంది. గుడిలోకి రాలేనివారు దర్శనం చేసుకోవడానికి గర్భగుడిలో ఏ స్వామి అయితే వుంటాడో ఆ స్వామి యొక్క విగ్రహాలు గుడికి నాలుగు వైపులా రాజవేదిక మీద ప్రతిష్టిస్తారు.

ఆ పైన ప్రతీగుడి మీద 'కీర్తి ముఖం' గుడికి నాలుగు వైపులా వుంటుంది. పూర్వం దేవదానవుల యుద్ధంలో రాక్షస సంహారానికి ఒక రాక్షసుడు ఎంతో సహాయపడ్డాడు. పుట్టుకతో అసురుడైనా, అతనిలోని మంచి లక్షణాలు, నిరంతర దైవధ్యానం దేవుళ్ళను ముగ్ధుల్ని చేసింది. అతని కోరిక మేరకు కలియుగంలో ప్రతీ గుడి మీద కీర్తి ముఖం ఏర్పాటు చేసి దాని క్రిందే తాముంటామని వరం ఇవ్వడం జరిగింది. అది ఆగమశాస్త్రంలో కూడా లిఖించబడింది. కీర్తి ముఖంలేని ఆలయం దర్శనానికి శ్రేష్టంకాదని శాస్త్రం చెబుతోంది. ఆపైన విమాన వేదిక, ఆపై శిఖర వేదిక వుంటాయి.

ఇక గుడి లోపల ప్రధాన పంచఅంగములుగా పానపట్టం, విగ్రహం, గోపుర శిఖరం, ధ్వజం, అర్చకుడ్ని పరిగణిస్తారు. ధ్వజస్తంభం లేని ఆలయం జీవం లేని మానవుడితో సమానం. అందుచేత ప్రతీ ఆలయానికి ధ్వజస్తంభము ముఖ్య అంగముగా పరిగణించబడుతుంది.

ఇక దేవాలయాల్లో అర్చన నాలుగు రకాలుగా విభజించబడింది. అవి స్మార్త, శైవ, పాంచరాత్ర, వైఖానస ఆగమ అర్చక విధానాలు ! తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో వైఖానస అర్చన విధానం అమలులో వుంది.

లోపల ధృవ విగ్రహం దర్శనానికి, కాలార్చనలకీ, కౌతుకః కౌతుక విగ్రహం భక్తుల అర్చనలకు, ఉత్సవః - ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుకు, స్నపనః స్నపన విగ్రహాలు అర్చనకు వుపయోగిస్తారు. బలిదేవతలు, దేవుడికి నైవేద్యం ఇచ్చాక బలిదేవతల అనుమతి లేనిదే బయట ప్రసాదం ఇవ్వరు. ఈ పంచ విగ్రహాలు ప్రతి గుడిలో వుంటాయి.

దేవాలయాలకు సంబంధించి ఎంతో అమూల్యమైన ఎన్నో వివరాలు అందించిన మాన్యులు డా॥ చక్రవర్తుల నారాయణా చార్యులు (ఉండ్రాజవరం), శ్రీ సిహెచ్. హరనాథ్ ప్రభాకరరావు, ఎం.ఏ., బి.ఎల్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఆచంట), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (దువ్వ), శ్రీ ఎస్. శోభనాద్రి, క్లర్క్ (దువ్వ), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (పెనుగొండ), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (పట్టిసం) మరియు అర్చకులు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (నత్తారామేశ్వరం) దేవాలయ ట్రస్టీ మెంబరు హరనాథ్‌రెడ్డిగారు (నత్తారామేశ్వరం), శ్రీ కొండవీటి రామకృష్ణశర్మ శ్రీ యజ్ఞశ్రీ శ్రీనివాస శర్మ శ్రీ జానకీ హనుమత్‌శర్మ శ్రీనివాసశర్మ గార్లు ( జుత్తిగ దేవాలయం అర్చకులు), శ్రీ వత్సవాయి వెంకటరాయపరాజు గారు (ఖండవిల్లి), అర్చకులు మరియు దేవస్థాన సిబ్బంది (కొతాలపర్రు) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (నిడదవోలు), అర్చకులు (నరసాపురంలోని దేవాలయాలు), అర్చకులు లక్ష్మణేశ్వరం, మండపాక శ్రీ కేశవస్వామి ఆలయ అర్చకులు, శ్రీ కె. సోమశేఖర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీ కేశవ స్వామి ఆలయం (శనివారపుపేట, ఏలూరు) అందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

పశ్చిమ గోదావరి జిల్లాలో నా దృష్టికి రాని ప్రసిద్ధ (పురాతన) దేవాలయాలు ఇంకా చాలా వుండి వుండవచ్చు. అలాంటి దేవాలయాల వివరాలు నాకు తెలియజేస్తే ఈ పుస్తకం మలిముద్రణలో చేరుస్తాను.


నా ఈ చిన్న ప్రయత్నంలో ఏమైనా లోపాలుంటే సహృదయంతో మన్నించి, పెద్ద మనసుతో వాటిని తెలియజేస్తే వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను.

తేది : 15-2-99
విజయవాడ

భవదీయుడు
మీ
ఎన్. ఎస్. నాగిరెడ్డి

# పశ్చిమ గోదావరి జిల్లా మ్యాపు

(నాట్ టు స్కేలు)



# పశ్చిమ గోదావరి జిల్లా సంక్షిప్త సమాచారం

ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరములోని ముఖ్యమైన జిల్లాలలో పశ్చిమ గోదావరి జిల్లా ఒకటి. వాణిజ్యపరంగా రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర వహిస్తున్న ఈ జిల్లా గోదావరికి పడమర వైపుగా వున్నందువలన పశ్చిమ గోదావరి జిల్లాగా పిలువబడుతోంది. తూర్పు, పశ్చిమ గోదావరులకు సరిహద్దుగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి తూర్పు సరిహద్దు చుట్టి పోలవరంనుంచి నర్సాపురంకి 10 కిలో మీటర్ల దూరంలో అంతర్వేది దగ్గర బంగళాఖాతంలో కలుస్తుంది. అత్యంత సారవంతమైన జిల్లాల్లో ఒకటిగా పరిగణించబడే పశ్చిమ గోదావరి జిల్లా ఉత్తరాన ఖమ్మం జిల్లా, దక్షిణాన కృష్ణా జిల్లా , బంగళాఖాతం, తూర్పున తూర్పు గోదావరి జిల్లా, పడమరన కృష్ణాజిల్లా ఎల్లలుగా, 16° 15' నుండి 17° 30' ఉత్తర అక్షాంశాలు, 80° 50' నుండి 81° 55' తూర్పు రేఖాంశాల మీద వుంది.

1859 సంవత్సరంలో తూర్పు గోదావరి జిల్లాలో భాగంగా ఉండే దీనిని 1904లో విడదీసి కృష్ణా జిల్లాలో కలిపేశారు. తర్వాత కృష్ణా నుండి వేరు చేసి 7742 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏలూరు ముఖ్య పట్టణంగా 1925లో పశ్చిమ గోదావరి జిల్లాని ఏర్పాటు చేశారు

1991 జనాభా లెక్కల ప్రకారం 35,17,000 జనాభా కలిగివున్న ఈ జిల్లాలోని గ్రామాలు 895, జిల్లాలో వున్న మండలాలు 46, మున్సిపాలిటీలు 7 కాగా అవి ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, కొవ్వూరు...

జిల్లాలో జాతీయ రహదార్లు, జిల్లా పరిషత్ రహదార్లు, మండల పరిషత్ రహదారులు కలిపి మొత్తం 5095 కిలోమీటర్ల పొడవునా వ్యాపించి వున్నాయి.

ఈ జిల్లాలో వేసవి కాలం సగటు గరిష్ట ఉష్ణోగ్రత 35° సెంటీగ్రేడ్ అయితే శీతాకాలం సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 17 డిగ్రీల సెంటీగ్రేడ్ సంవత్సరం మొత్తం మీద సగటున 1075 మి.మీ. వర్షపాతం నమోదవుతుంది. వేసవిలో ఎండలు మాత్రం ఎక్కువగా ఉంటాయి.

డిసెంబరు నుండి ఫిబ్రవరి వరకూ వాతావరణం ఆహ్లాదకరంగా వున్నా బంగాళాఖాతంలో ఏర్పడే వాయుగుండాల వలన తుఫాన్‌లు, వరదలు ఎక్కువగానే వుంటాయి. తమ్మిలేరు, ఎర్రకాలువ, బైనేరు, కొవ్వాడ కాలువ, జిల్లేరు, రాళ్ళమడుగు, గుండేరు, నక్కల కాలవ, గోస్తనీ నది వంటి చిన్న నదులు జిల్లాని సస్యశ్యామలం చేయడమే కాక అప్పుడప్పుడూ పొంగి పొరలి ఇబ్బందుల పాలు చేస్తుంటాయి. ఈ జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొల్లేరు సరస్సు వుంది. 670 చదరపు కిలో మీటర్ల వైశాల్యమున్న ఈ సరస్సులో పరిసర ప్రాంతాలలోని మురికి నీరు చేరుతుంది.

ఉప్పుటేరు ద్వారా ఈ నీరు సముద్రంలోకి చేరుతుంది. ఈ సరస్సు కొల్లేటి కొంగలకు నిలయమేగాక దూర దేశాల నుండి వలస వచ్చే పక్షి సంతతికి నిలయంగా చూపరులకు ముచ్చట గొల్పుతుంది.

ఈ ప్రాంతం పూర్వం మౌర్యుల సామ్రాజ్యంలో భాగంగా వుండేది. తరువాత శాతవాహన రాజ్యంలో భాగం అయింది. క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నుంచి నాలుగు శతాబ్దాలు పైగా శాతవాహన రాజ్యంలోనే వుంది. ఆ రోజుల్లో గోదావరి ముఖద్వారం వద్ద ప్రాలూరు అనే రేవు పట్టణం ప్రసిద్ధి చెంది వుండేదని, ఆ రేవుగుండా చైనా, బర్మా దేశాలకు ఇక్కడి వస్తువులు ఎగుమతి అవుతుండేవని ప్రసిద్ధ భూగోళ శాస్త్రవేత్త టాలెమీ పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ ప్రాంతం సముద్రంలో కలిసిపోయిందని తెలుస్తోంది.

శాతావాహనుల కాలంలో వైదికమతంతో పాటు బౌద్ధ మతానికి కూడా ఆదరణ వుండటంతో ఈ ప్రాంతంలో బౌద్ధారామం కూడా వుంది. క్రీస్తు శకం నాలుగవ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని శాలంకాయనులు, వేంగీ నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఏలూరు సమీపంలో వున్న వేంగి ఈనాడు పెదవేగి, చిన వేగి అని చిన్న పల్లెలుగా మారిపోయాయి.

చారిత్రక ఆధారాలను బట్టి కృష్ణా, గోదావరి నదుల మధ్య నున్న ప్రాంతం వేంగి దేశంగా వెలిగిపోయింది. తరువాత శాలంకాయనుల చేతుల్లోంచి విష్ణుకుండినుల పాలనలోకి వెళ్ళింది ఈ ప్రాంతం. దెందులూరుని రాజధానిగా పాలించిన ఈ రాజులు శైవ భక్తులు గనుక దెందులూరులో ఇప్పటికీ అనేక శైవాలయ అవశేషాలు కానవస్తాయి.

విష్ణుకుండినుల తరువాత చాళుక్యులు పాలనలో కొచ్చింది ఈ ప్రాంతం. అప్పుడే పంచారామాల్లో ఒకటయిన పాలకొల్లులోని ప్రసిద్ధ దేవాలయం నిర్మించారు. తర్వాత వెలనాటిచోడులు రాజ్యపాలన సాగించారు. సామంత రాజుల తిరుగుబాటువల్ల తెలుగు నాయకులు కొల్లేటి కోటను రాజధానిగా చేసుకుని కొన్నాళ్ళు పాలించాక, తదనంతరం విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది.

1565లో తళ్ళికోట యుద్ధానంతరం గోల్కొండ నవాబుల పాలనలోకి 1687 తర్వాత మొగల్ పాలకుల చేతుల్లోకి, 1724 తర్వాత నిజాం నవాబు పాలనలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాచీన మహత్తర ఆలయాలు వున్న జిల్లా ఇది !


దీనితోపాటు వాణిజ్య పంటలయిన చెరకు, అరటి, వేరుశనగ, నువ్వులు, పొగాకు, మిరప, ప్రత్తి, కర్రపెండలం వంటివి విస్తారంగా పండుతాయి. సహజ వాయువు నిల్వలు వున్నాయి. గ్రాఫైట్, సున్నపురాయి, మైకా ఖనిజాలున్నాయి. కొబ్బరి, నిమ్మ, బత్తాయి తోటలు జిల్లాలో ఎక్కువ కానవస్తాయి. ఈశాన్యాన వున్న పాపి కొండల్లో ఎత్తయిన కొండ ఎత్తు 1364 మీటర్లు.

## 1) శ్రీ చెన్నకేశవస్వామి మరియు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయాలు - ఏలూరు

పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యపట్టణమైన ఏలూరు పట్టణం అతి ప్రాచీన దేవాలయాలెన్నింటితోనే అలరారుతోంది. ఒకప్పుడు హేలాపురిగానూ, ప్రస్తుతం ఏలూరు గాను పిలవబడుతున్న ఈ పట్టణంలో ఆదివారపుపేటలో కొలువై వున్నారు శ్రీ చెన్నకేశవస్వామి మరియు శ్రీరామలింగేశ్వరస్వామి.

శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయాన్ని సుమారు ఎనిమిది వందల సంవత్సరాలకు పూర్వము బ్రాహ్మణులచే నిర్మించబడినట్లు తెలుస్తోంది. తరువాత కాలంలో ఆలయం శిధిలమయిపోవడంతో దాని గురించి ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.


కొన్ని వందల సంవత్సరాల తర్వాత నూజివీడు సంస్థానం నుంచి విడిపోయి కొత్తగా ఇక్కడ సంస్థానం ఏర్పరచుకోవాలని వస్తున్న శ్రీ విజయప్పారావు, ధర్మప్పారావు గార్లకు మార్గం మధ్యలో ఓ బావిలో శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహం దొరికింది.



శ్రీ చెన్న కేశవస్వామి ఆలయ రాజగోపురం, ఏలూరు

రాజావారు ప్రస్తుతమున్న గుడిని కట్టించి, ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతర కాలంలో ఇక్కడ విపరీతమైన కరువు సంభవించి, ప్రజలకు జీవనం కష్టం కావడంతో రాజావారు ఈ దేవాలయానికి ప్రస్తుతం వున్న ఈ రాజగోపురాన్ని నిర్మింపజేసి ప్రజలకు కూలి కల్పించి ఆదుకున్నారు.

అయిదు అంతస్థులతో నిర్మాణం కావించబడ్డ ఈ రాజగోపురం ఏలూరు పట్టణానికే తలమానికంగా శోభిస్తోంది. సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ ఈ గోపురంలో ఒక అంతస్థు మీద క్షీరసాగరమదనం, మరో అంతస్థు మీద రామాయణం, మరో



శ్రీ చెన్న కేశవస్వామి ఆలయం, ఏలూరు

అంతస్థు మీద సృష్టి యొక్క రహస్యాలు, మరో అంతస్థు మీద భాగవత, భారతాలు, మరో అంతస్తు మీద దశావతారాలు చెక్కడం ప్రత్యేకత! ఈ ఆలయ ప్రాంగణాన్ని అనుకొని వున్న శ్రీరామలింగేశ్వర స్వామి వారి ఆలయం కూడా పురాతనమైదే!

పాడయిపోయిన ధ్వజ స్తంభాలను మూడింటిని ఒకేసారి పునఃప్రతిష్ఠ చేయడం జరిగింది.



శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, ఏలూరు

ఏలూరులో దక్షిణపు వీధిలో కొలువై వున్నారు శ్రీ పార్వతి సమేతంగా శ్రీ జ్వాలాపహరేశ్వరస్వామి. వెయ్యి సంవత్సరాల ప్రాచీన చరిత్రగల స్వామి వార్ని జలధీశ్వర స్వామి అని కూడా పిలుస్తారు. ఆలయగోపురంపైన గర్భ గుడి బయట శరభసాళ్వ విగ్రహాలున్న దేవాలయం ఇది. హిరణ్యకశిపుని సంహరించిన ఉగ్ర నరసింహామూర్తిని శాంతింపజేసిన శివశక్తి అయిన శరభసాళ్వం అంటే రెండు తలలుగల పక్షి. అమ్మవారికి నవరాత్రులు, స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా జరుగుతాయి. స్వామి వారి ఎదురుగా వున్న రాతి నంది విగ్రహం కాలికి ఇనుప కడియం తొడగబడి వుంటుంది.

ఏలూరులో దక్షిణ వీధి చివర శ్రీ మార్కండేశ్వర, ఓంకార విశ్వేశ్వరస్వామి వార్ల ఆలయాలున్నాయి. సుమారు వెయ్యి సంవత్సరాలకు పూర్వం నిర్మించబడ్డ ఈ దేవాలయాల్లో స్వామి వారి కళ్యాణోత్సవం, కార్తీక పౌర్ణమి, దసరా, పండుగలు వేడుకగా జరుగుతాయి.

దక్షిణపు వీధిలో వున్న మరో ప్రాచీన ఆలయం శ్రీ సీతారామస్వామి వారి కోవెల, స్వామి వారి కళ్యాణోత్సవం ప్రత్యేక వేడుక.

## 2) శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం - ఏలూరు

ఏలూరులో పడమటి వీధి అయిన అంబికా థియేటర్ ప్రాంతంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై వున్నారు. ఈ దేవాలయం వేంగి ప్రభువుల కాలంలో నిర్మించబడ్డ ప్రాచీన దేవాలయం. అప్పట్లో అతి పెద్ద గాలిగోపురం వుండేదని, కాలక్రమంగా అది శిధిలమయి పోయిందని తెలుస్తోంది. అందుకు నిదర్శనంగా గాలిగోపురానికి అటూ-ఇటూ వుండే జయ విజయుల విగ్రహాలు ఇంకా ఆలయ ప్రాంగణంలో చూడవచ్చు.

ఆలయ నిర్మాణం క్రీస్తు శకం 1104 సంవత్సరంలో జరిగినట్లుగా తెలిపే సంస్కృత శాసనాలు ఆలయ ప్రాంగణంలో వున్నాయి. మహామహిమాన్వితులైన స్వామివారి బ్రహోత్సవాలు ప్రత్యేక రీతిలో జరుగుతాయి. శ్రీ వారిని నమ్మి కొలిచే భక్తుల సంఖ్య ఎక్కువ కావడంతో ఉత్సవాలు, దేవాలయ నిర్వాహణ ఘనంగానే సాగుతున్నాయి.

ఏలూరు పడమటి వీధి చివరి భాగంలో సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించబడిన దేవాలయంలో కొలువై వున్నారు శ్రీ అలహసింగరప్ప స్వామి. ఇక్కడి స్వామి వారి కళ్యాణోత్సవం ఘనంగా జరుగుతుంది.

పవర్‌పేట స్టేషన్ సమీపంలో వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించబడిన మరో పురాతన కోవెల-శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం.


పవర్‌పేట స్టేషన్ రోడ్డు ప్రక్కన నిర్మించబడిన మరో దర్శనీయ క్షేత్రం శ్రీ వాసు దేవాలయం. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ పురాతన ఆలయంలో స్వామివారి కళ్యాణం, ధనుర్మాసం, ముక్కోటి ఉత్సవాలు గొప్పగా జరుగుతాయి.

ఏలూరు పట్టణంలో పేరయ్య కొనేరు దగ్గర శ్రీ జనార్ధనకన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం, శ్రీ అన్నపూర్ణా సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి వారి ఆలయం వున్నాయి. రెండు ఆలయాల నిర్మాణం క్రీస్తు శకం తొమ్మిదో శతాబ్దంలోనే జరిగినట్లు చారిత్రకాధారాలున్నాయి.

ఈ ఆలయాలన్నీ భక్తులు తప్పక దర్శించి తీరాల్సిన క్షేత్రాలు. ఇది జిల్లా ముఖ్య పట్టణం కావడం వలన యాత్రికులు బసచేయడానికి చిన్న లాడ్జిలతోపాటు పెద్ద, పెద్ద హోటల్స్ కూడా వున్నాయి.


పశ్చిమ గోదావరి జిల్లాలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఎక్కువగా కనిపించటం గమనార్హం. ద్వారకతిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామి తరువాత ఏలూరులోని ఈ వేంకటేశ్వరస్వామి పట్ల భక్తులు అమితంగా ఆకర్షితులై తమ మొక్కుబడులు చెల్లించటం జరుగుతుంది. శ్రీ స్వామి వారు ఏలూరు పురవాసులనే గాక తనను ఆశ్రయించి వచ్చిన భక్తులను సాదరంగా అక్కున చేర్చుకొని వారి కష్టాలను తీర్చటంతో స్వామి వారు అందరికీ ఇష్టదైవంగా వెలుగొందుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.

## 3) శ్రీ భీమేశ్వరస్వామి వారి ఆలయం - కలపర్రు



*శ్రీ భీమేశ్వరస్వామి వారి ఆలయం, కలపర్రు*

మద్రాస్, కలకత్తా గ్రాండ్ ట్రంక్ రోడ్‌లో ఏలూరు నుంచి హనుమాన్ జంక్షన్ దిశలో పన్నెండు కిలోమీటర్ల దూరంలో పెదపాడు మండలంలో వుంది కలపర్రు గ్రామం. బస్సు సౌకర్యం వుందిగానీ వసతి సౌకర్యం లేదు.




*గర్భగుడిలో శ్రీ భీమేశ్వర స్వామి*

ఇక్కడ క్రీస్తు శకం పదకొండవ శతాబ్దంలో నిర్మించబడిన అతి పురాతనమైన దేవాలయంలో కొలువైయున్నారు శ్రీ భీమేశ్వరస్వామి. వేంగిరాజుల కాలంలో ఈ నిర్మాణం చేపట్టినట్లుగా ఇక్కడ లభించిన శాసనాలనుబట్టి తెలుస్తోంది.

జీర్ణోద్ధరణ ఎప్పుడు జరిగిందో ఇదమిద్ధంగా తెలియదు గానీ ఇక్కడ స్వామి మహిమల మీద స్థానికులకే కాదు చుట్టు ప్రక్కల గ్రామస్థులకు కూడా అపారమైన నమ్మకం.

శివరాత్రికి ఉత్సవం, స్వామి




శ్రీ రాజగోపాలస్వామి ఆలయం, కలవచ్రు

కళ్యాణోత్సవం, కార్తీకమాసంలో ప్రత్యేక అకర్షణగా భావిస్తారు భక్తులు.

కలపర్రులో సుమారు 900 సం॥ల క్రితం నిర్మించబడిన మరో పురాతన ప్రాచీన దేవాలయం శ్రీ రాజగోపాలస్వామి వారి కోవెల. స్వామి వారిని ప్రతిష్టించిందెవరో నిర్దిష్టంగా తెలిపే ఆధారాలు ఇక్కడ లభ్యం కాకపోయినా అందిన సమాచారం ప్రకారం స్వామి వారు ఎంతో మహిమాన్వితులని తెలుస్తోంది. స్వామి వారి నిత్య ధూప నైవేద్యాలకు అనాటి రాజులు మాన్యాలు ఇచ్చినట్లుగా తెలుస్తున్నా ఆలయానికి సరైన పోషణ ఉన్నట్లుగా కనిపించటం లేదు. ఏది ఏమైనా ఉత్సవాలకు భక్తులు వేల సంఖ్యలో హాజరు కావటం విశేషం.


యాత్రికులకు బస చేయడానికి గ్రామంలో ఎలాంటి వసతి సౌకర్యాలు లేకపోవటం కొంచెం ఇబ్బందికర పరిణామం. దేవాదాయ శాఖ ఈ విషయంలో ఏలాంటి ఏర్పాట్లు చేయకపోయినా స్థానిక భక్తులు వారికి ఏదో విధంగా ఏర్పాట్లు చేయటానికి ప్రయత్నించటం ముదావహం.




గర్భగుడిలో శ్రీ రాజగోపాలస్వామి

## 4) శ్రీ జనార్ధన మరియు మల్లేశ్వరస్వామి వారి ఆలయాలు - చాటపర్రు

ఏలూరు పట్టణానికి అయిదు కిలోమీటర్ల దూరంలో, ఏలూరు మండలంలో వున్న గ్రామం చాటపర్రు. బస్సు సౌకర్యం వున్నా వసతి సౌకర్యం లేదు.



శ్రీ జనార్ధనస్వామి ఆలయం, చాటపర్రు



గర్భగుడిలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ జనార్ధనస్వామి

ఈ గ్రామములో మూడు పురాతన దేవాలయాలు వున్నాయి. శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి దగ్గరలోనే శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం వుంది. ఈ రెండు దేవాలయాలను సుమారు ఏడు వందల సంవత్సరాలకు పూర్వం నిర్మించినట్లు అక్కడ లభించిన ఆధారాల వల్ల తెలుస్తోంది. అయితే ఈ దేవాలయాలకు సంబంధించిన స్థల పురాణం ఏమీ లభ్యం కాలేదు. కట్టించిందెవరో కూడా తెలియడం లేదు. శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయాన్ని 1966లో తిరిగి నిర్మించారని తెలుస్తోంది.


ఇక్కడే వున్న మరో పురాతనమైన గుడి శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయం. అయిదు వందల సంవత్సరాల క్రితం ఈ కోవెలను నిర్మించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆలయం ఇప్పుడు పూర్తిగా శిథిలమయిపోయింది.


## 5) శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం - దెందులూరు

ఏలూరు పట్టణానికి సుమారు పది కిలోమీటర్ల దూరం లో వుంది దెందులూరు గ్రామం. ఈ గ్రామం ఎంతో ప్రాచీనమైనది కావడంతో ఇక్కడ వున్న దేవాలయా లకు కూడా ఎంతో చరిత్ర వుంది.

ముఖ్యమయిన దేవాలయా లుగా శ్రీ చెన్నకేశవ స్వామి వారి కోవెల, శ్రీ సోమేశ్వర స్వామి వారి కోవెలలుగా భావించ వచ్చు. ఈ రెండు దేవాలయా లను నిర్మిం చింది సుమారు ఆరు వందల సంవత్సరాలకు పూర్వమే అని అక్కడ లభించిన పురాతన శిలా శాసనాలను బట్టి తెలుస్తోంది. స్వామి వార్ల కళ్యాణోత్సవాలు ఈ దేవా లయాల్లో వైభవంగా సాగుతాయి. ఈ దేవా లయాలు స్థలపురాణంగానీ, ఎవరు నిర్మించారో తెలిపే ఆధారాలు లేక పోవడం దురదృష్టకరం!

ఏలూరు, తాడేపల్లిగూడెం రైల్వే లైన్‌లో ఈ దెందులూరుకి స్టేషన్ వున్నా ఇక్కడ యాత్రికులు బస చేయటానికి ఎలాంటి వసతి సౌకర్యాలు లేవు.






*శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, దెందులూరు (ఎగువ చిత్రం)*

*గర్భగుడిలో శ్రీ సోమేశ్వరస్వామి (దిగువ చిత్రం)*

## 6) శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయం - గుండుగొలను

ఏలూరు పట్టణానికి సుమారు పదహారు కిలోమీటర్ల దూరంలో భీమడోలు మండలంలో వున్న గుండుగొలను గ్రామానికి చాలా ప్రాచీన చరిత్ర వుంది. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం పోయే జాతీయ రహదారిలో రోడ్డుకు అనుకుని వున్న గ్రామం ఇది.



*శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, గుండుగొలను*


ఈ గ్రామంలో అతిపురాతనమైన శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం వున్నది. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం విష్ణు కుండిన రాజుల కాలంలో ఈ దేవాలయం నిర్మించినట్టుగా ఇక్కడ లభించిన చారిత్రకాధారాలను బట్టి తెలుస్తోంది.

స్వామివారిని ప్రతిష్టించిందెవరో స్పష్టమైన ఆధారాలు లేకపోయినా ఎంతో మహిమగల స్వామిగా స్థానికులు భావిస్తారు.

ఇదే గ్రామంలోవున్న మరో పుణ్య క్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం. ఇది కూడా పురాతనమైనదే ! సుమారు ఎనిమిది వందల సంవత్సరాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది.

ఈ రెండు దేవాలయాల్లోనూ స్వామి వార్ల కళ్యాణోత్సవాలు చాలా వైభవంగా జరుగుతాయి. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలంతా ఆ ఉత్సవాలకు హాజరవుతారు.

ఈ గ్రామంలోనే వున్న శ్రీ సీతారామస్వామి వారి ఆలయం గ్రామంలోని క్షత్రియభక్తుల చేత సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించబడింది. అతి సుందరంగా సంరక్షిస్తున్న ఈ చిన్న ఆలయానికి ప్రక్కనేస్వామి వారి పూలతోట వుంది.



*శ్రీ భ్రమరాంబా సహిత మల్లేశ్వరస్వామి వారి ఆలయం, గుండుగొలను*

ఇచ్చట శ్రీరాముడు చతుర్భుజుడు. ఎడమ తొడపై జానకితో వీరాసనంలో వెలసినాడు. ముఖ్య ఆలయానికి ఎదురుగా హనుమంతుని ఆలయం దాని వెనుక శ్రీ త్యాగరాజస్వామి ఆలయం వున్నాయి. శ్రీరామనవమి చాలా ఘనంగా జరుగుతుంది.

స్వామిని సువర్ణ పుష్పములతో ప్రత్యేక సందర్భాలలోనూ, పండుగలలోనూ పూజిస్తారు.

## 7) శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం - ద్వారకా తిరుమల

అఖిల చిదచి దీశ శ్రీనివాస దయాళు:
నిగమ శిఖర గమ్యా నిత్య మద్విజ బంధు:
స్వపద కమల యుగ్మ ప్రాపకస్వా శ్రితానాం
విలసతుమమచిత్తే వెంకటేశో ముకుంద :

పూర్వ ఆంధ్ర దేశంలో ద్వారకా తిరుమల అను పట్టణం సర్వసంపదలతో తులతూగుతూ అమరావతిలా వుండేది. కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వరుడు శేషాచలము మీద నుంచి సతి అయిన మంగతో అక్కడ వెలసి భక్తులను రక్షిస్తుండేవారు. అర్ధరాత్రి కూడా అక్కడ వేదపఠన శాస్త్ర చర్చలు జరుగుతుండేవి.

ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రసిద్ధ క్షేత్రాలలో ద్వారకా తిరుమల ఒకటి అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జిల్లాలో ఇది అత్యంత ప్రముఖ క్షేత్రం. చిన్న తిరుపతిగా పేరుగాంచిన ఈ ద్వారకా తిరుమల ఏలూరుకి యాభై కిలోమీటర్ల దూరంలోనూ, భీమడోలుకు 17 కిలోమీటర్ల దూరంలోనూ వుంది.

విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నర్సాపురం, జంగారెడ్డిగూడెంల నుంచి డైరెక్టుగా బస్‌లున్నాయి. యాత్రికులకు వసతి సౌకర్యాలుగా దేవస్థాన సత్రాలున్నాయి.

అనంతగిరి అని పిలువబడే క్షేత్రం ఇది ! శేషాకారంలో వున్న శేషాచలం అని పిలువబడే ఎత్తయిన గుట్ట మీద వెలసిన దేవాలయంలో వెలసిన స్వామి వారు శ్రీ వేంకటేశ్వరుడు.



*శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ద్వారకాతిరుమల*

పూర్వం ద్వారక అని ఒక గ్రామం వుండేది. దానికి దగ్గరలో తిరుమలగిరి అనే కొండ వుండటంతో రెండూ కలిసి ద్వారకా తిరుమల అనే పేరు వచ్చింది. కలియుగంలో ద్వారకుడు అనే మహాభక్తుడు ఈ క్షేత్రం గురించి తెలియజేయడంతో ద్వారకా తిరుమల అనే పేరు సార్థకమయినట్లు పురాణమున్నది.

త్రేతాయుగంలో ఈ క్షేత్రాన్ని శ్రీరామచంద్రుని పితామహుడైన అజమహారాజు, తర్వాత దశరథ మహారాజు, శ్రీరాముడు కూడా సేవించుకున్నారు.


ఇక్కడ శ్రీ వేంకటేశ్వరుడు స్వయంవ్యక్త శ్రీనివాసుడు. ఆయన పాదాలు పాతాళలోకంలో బలిచక్రవర్తి చేత పూజింపబడుచుండును. అందువల్ల పూర్వం తిరుమల తిరుపతి నుంచి సర్వాంగపూర్వమైన శిలావిగ్రహాన్ని తీసుకొచ్చి ఆగమశాస్త్ర ప్రకారం ధృవమూర్తికి వెనుక పీఠంపై ప్రతిష్ట చేశారు. అందువల్ల పీఠం ముందున్న మూర్తికి పాదములు కన్పించవు.

ఏడాదికి రెండుసార్లు ఇక్కడ బ్రహ్మోత్సవములు జరుగుతాయి. స్వామి వారితోపాటు అలమేలు మంగతాయారు, బీబీ నాంచారు అమ్మవార్లు పూజించబడతారు. ముఖాలయానికి తూర్పు ముఖంగా అమ్మవార్లు, ధ్వజ స్థంభము వద్ద స్వామికి ఎదురుగా భక్తాంజనేయ గరుడాళ్వారుల ఆలయాలు, వీనికి వాయువ్యంగా ఓ కుంకుడు చెట్టు వున్నాయి. స్వామివార్ని ద్వారకుడు బహిర్గతం చేసినప్పటి నుంచి ఈ కుంకుడు చెట్టు జీవించి వున్నదని ప్రతీతి.

శ్రీనివాసుని దేవాలయానికి వాయువ్యంగా కొండ మల్లేశ్వరస్వామి వారి దేవాలయం వుంది. ఇది కూడా పురాణ ప్రసిద్ధమైన పురాతన దేవాలయం. శివకేశవులు, ఆదిశేషునకు వరమిచ్చినందువల్ల శివుడు, ఫణాగ్రభాగమైన శిఖరం మీద భ్రమరాంబికా సమేతుడైన మల్లిఖార్జునస్వామిగా వెలిశాడు.

ఆ పట్టణంలో వున్న ద్వారకుడనే బ్రాహ్మణుడు ఎప్పుడూ అబద్ధమాడలేదు. అడిగిన వారికి లేదనలేదు. పరుల బాధను చూసి తట్టుకోలేక పోయాడు. బీదవాడైనా, ఎవరు ఏమిచ్చినా తీసుకునేవాడు కాదు. అతని భార్య పరమసాధ్వి.

సతీసమేతుడై ఎన్నో తీర్థయాత్రలు చేసినా తిరుమలను మాత్రం సందర్శించలేకపోయాడు. తన ఇంటికి వచ్చిన ఓ తైర్థికుడ్ని స్వామి గురించి చెప్పమని కోరగా అతను ఈ క్రింది విధంగా చెప్పాడు.



*శ్రీ వారి పాదాల ముద్రలు, ద్వారకా తిరుమల*

పూర్వం నాగేంద్రుడు హరిహరులను గూర్చి ఘోర తపస్సు చేస్తే కొంత కాలానికి వారు ప్రత్యక్షమయ్యారు. నాగేంద్రుడు తనొక పర్వత రూపంలో వుంటానని, ఒకరు శిరస్సు మీద, మరొకరు తోక మీద నివసించి తనని ధన్యుడ్ని చేయమని కోరాడు.

అతని ప్రార్థన మన్నించారు వారు. ఆదిశేషుడు ఓ మహాపర్వత రూపం దాల్చాడు. అదియే వెంకటాచలము. ఆ పర్వత శిరోభాగం శ్రీశైలం, చివర భాగం వెంకటాచలము ఆ పర్వతం మీదే శ్రీమన్నారాయణుడు వేంకటేశ్వరుడై వెలిశాడు.

ఆ ప్రాంతంలో నారాయణ పట్టణంలో ఆకాశరాజు రాజ్యమేలుతుండగా, సంతానం కోసం యజ్ఞం చేయడానికి ఆ ప్రదేశాన్ని దున్నుతూ వుండగా శ్రీరాముని వలన వరం పొందిన సీతాదేవి నాగటి కర్రకి తగిలింది. ఆమెని పెంచి అలమేలు మంగ అని పేరు పెట్టాడు ఆకాశరాజు.


70,497

ఒక రోజున అలమేలు మంగ వెంకటాచలం ప్రాంతంలో అడవిలో విహరించుతూ వీణాగానం చేయుచుండగా చూసి వలసి, ఆమె తండ్రి ఆకాశరాజు అనుమతితో వివాహం చేసుకొనెను

ఆ కథ విన్న ద్వారకుడు ఎన్నోసార్లు వెంకటాచలం పోయి స్వామిని దర్శించుకున్నాడు. ఓ సారి మండు వేసవిలో సతీసమేతుడై తిరుపతి పోవుచూ దాహంతో ఒక చోట పడిపోయాడు. అక్కడకు ఓ బ్రాహ్మణుడు రాగిపాత్రలో నీటిని తెచ్చి ఇచ్చాడు.

ఆ ఆపద సమయంలో తమని రక్షించుటకు దేవుడిలా వచ్చిన మీరెవరని ద్వారకుడు అడగ్గా, వారి ఎదుట శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై తానే శ్రీనివాసుడ్ని వారి భక్తికి మెచ్చి దర్శనమిచ్చానని, ఏదైనా వరం కోరుకోమని చెప్పాడు.

అప్పుడు ద్వారకుడు 'స్వామి ! మా జన్మ భూమి నుంచి కదలకుండా మీ దర్శనం మాకు కలిగేట్లు అనుగ్రహించమన్నాడు. అట్లే మీ కొండ మీదకు వస్తాను. మీ పొలంలో గరుడుడు, వైనతేయుడు ఏ చెట్టు మీద కన్పిస్తారో ఆ చెట్టు క్రింద శిలారూపంలో నేను అవతరించుతానని చెప్పి ఆయన అదృశ్యమయినాడు.



*ఆలయ ప్రాంగణంలోని శ్రీ వారి విగ్రహం*

ఆ సంగతి ద్వారకుడు తన గ్రామస్థులందరికి చెప్పాడు. అంతాస్వామి కోసం అన్వేషించినా స్వామి కన్పించలేదు. ద్వారకుడు మోసం చేశాడని ప్రజలు అతన్ని హింసించడం ప్రారంభించడంతో ద్వారకుడు దీనంగా స్వామిని ప్రార్థించాడు. అప్పుడు గరుత్మంతుడు రివ్వున వచ్చి ఓ చెట్టు మీద వాలాడు. ఆ చెట్టు క్రింద త్రవ్వగా వేంకటేశ్వరుడి విగ్రహం కన్పించింది. కానీ ఎంత త్రవ్వినా ఆ విగ్రహం పాదములు మాత్రం కన్పించలేదు.

పాదముల దర్శనం కోసం ద్వారకుడు ఎంతగానో ప్రార్థించాడు "నా పాద పూజా భాగ్యం బలికి ఇచ్చాను. నువ్వు వృథాగా శ్రమపడవద్దు ద్వారకా" అని చెప్పి స్వామి అదృశ్యుడైపోయాడు.

ద్వారకుడు ఆ ప్రాంతాన్ని త్రవ్వించగా మల్లిఖార్జునుడు కూడా ప్రత్యక్షమయ్యాడు. ద్వారకకు దగ్గరలో వేంకటేశ్వరుడు ప్రత్యక్షమయినందువల్ల ద్వారకా తిరుపతి అని పేరొచ్చింది.

ఆంధ్ర దేశములో తిరుపతి, ద్వారకా తిరుపతి, వాడపల్లి, ఉపమాకలలో తాను వెలుస్తానని శ్రీ వేంకటేశ్వరుడు చెప్పడమే కాదు అన్నట్లుగానే ఆయా ప్రదేశాల్లో స్వామి వారు అవతరించారు.

ఔరంగజేబు హిందూ దేశాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో హిందూమతాన్ని విపరీతంగా ద్వేషించడం వలన హిందూ దేవాలయాలు ఎక్కడ కన్పించినా మహమ్మదీయులు ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఔరంగజేబుకి బీబీ నాంచారి అనే కుమార్తె ఉంది. ఆమెకు ఒకనాడు ఓ విగ్రహం దొరికింది.

అతి సుందరంగా వున్న ఆ విగ్రహం ఆమెని విపరీతంగా ఆకర్షించడంతో విగ్రహాన్ని అలంకరించి ఆడుకునేది. కొంత కాలానికి బీబీ నాంచారి ఆ విగ్రహాన్ని వదిలి ఉండలేని పరిస్థితిలో కొచ్చింది.

ఆ విగ్రహామే తన ప్రాణనాధుడు అని భావించేది. అలాంటి పరిస్థితుల్లో ఒక రోజు ఆ విగ్రహం పురుష రూపంలో ఆమెకు సాక్షాత్కరించి 'నువ్వు కమలాంశలో పుట్టిన దానివి. నిన్ను నేను పరిణయమాడతాను" అని చెప్పాడు. ఆ రోజు నుండి పగలు శిలారూపం రాత్రుల్లో మానవ ఆకారంతో ఆ విగ్రహం ఆ తురుష్క యువతితో కాలం గడిపేది.

కొంత కాలానికి యాదవాచలములో శ్రీమన్నారాయణుని కోవెలలోని ఉత్సవ విగ్రహం కన్పించలేదు. శ్రీరామానుజునకు శ్రీమన్నారాయణుడు కలలో సాక్షాత్కరించి "నేను అడవిలో పూజలు లేకుండా పడి వున్నాను. నాకు పూజలు చేయించు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

అప్పుడు రామానుజులు విష్ణువర్ధనుడు అనే రాజు దగ్గరకు వెళ్ళి, ఆ రాజుతో ఈ వృత్తాంతం చెప్పి యదుగురి స్వామికి గుడి, గోపురములు కట్టించాడు. ఆ ఆలయంలో ఉత్సవానికి తగిన విగ్రహం దొరక్క రామానుజులు విచారించుచుండగా ఆయనకు స్వామి కనిపించి "నేను ఢిల్లీ పురంలోని సుల్తాను అంతఃపురంలో ఉన్నాను" అని చెప్పాడు.

వెంటనే రామానుజులు విష్ణువర్ధనరాజుతో కలిసి ఔరంగజేబు దగ్గరకు వెళ్ళాడు. సుల్తాను తన దగ్గర వున్న హిందూ దేవుల విగ్రహములలో మీకు కావలసిన విగ్రహం ఉందేమో చూసి తీసుకుపొండి' అని వాళ్ళతో చెప్పాడు.

ఆ విగ్రహములలో వెదకగా యాదవపుర ఆలయములోని విగ్రహం కనిపించలేదు. రామానుజులు విచారగ్రస్తుడై ఏం చెయ్యాలో తెలియక నిద్రలోకి జారాడు. స్వప్నంలో స్వామి వారి విగ్రహం కనిపించి తాను సుల్తాను కుమార్తె అంతఃపురంలోని హంస తూలికా తల్పము మీద ఉన్నానని చెప్పింది.

వెంటనే రామానుజులు ఔరంగజేబు వద్దకు వెళ్ళి ఈ విషయం చెబితే సుల్తాను తన కుమార్తెని పిలిచి "ఆ విగ్రహం హిందూ విగ్రహం ! మన దగ్గర ఉండకూడదు. వాళ్ళకి ఇచ్చి వెయ్యమని" చెప్పాడు. కానీ ఔరంగజేబు కుమార్తె విగ్రహం ఇవ్వడానికి ఎంత మాత్రం సమ్మతించలేదు.

ఆ సంగతి సుల్తాను రామానుజులకు చెప్పగా ఆయన పరమభక్తితో ఈశ్వరుడ్ని ప్రార్థించాడు. వెంటనే [illegible]యుదు ఏండ్ల బాలుని రూపంలో రామానుజుల ఎదుట సాక్షాత్కరించింది. ఆ బాలుడికి రామానుజులు సంపత్కుమారుడు అని పేరు పెట్టి తనతో తీసుకుపోయాడు. బీబీ నాంచారి ఆ విషయం తెలిసి విరహంతో బాధపడుతుండగా, ఆమె చెలికత్తెలు ఆమె విచారం గురించి సుల్తానుకు చెప్పారు.

ఆ రాత్రి శ్రీ మన్నారాయణుడు సుల్తానుకు కలలో కన్పించి 'నేను నారాయణుడిని. నువ్వు క్షీరసముద్రుడవు. నీ కుమార్తె శ్రీ మహాలక్ష్మి. మా ఇరువురికి వివాహం చెయ్!' అని చెప్పాడు.

సుల్తాను సంతోషించి రామానుజులు వార్ని రప్పించి వారితో కూడా తన కుమార్తెను తీసుకుని వెళ్ళి శ్రీ వేంకటేశ్వరునకు ఇచ్చి కళ్యాణం జరిపించాడు వెంటనే పెండ్లికుమార్తె శిలగా మారిపోయింది. రామానుజులు ఆమెని స్వామి సన్నిధిలో ప్రతిష్ఠ చేసి 'బీబీనాంచారి', 'యదుగిరి లక్ష్మి' అని పేర్లు పెట్టాడు.

ద్వారకా తిరుమల స్థల మహత్మ్యమును గురించి ఇంకో ఇతిహాసముంది.

తిరుమలగిరి అనుచోట మాధవుడు అనే బ్రాహ్మణుండేవాడు. అతనికి కాళ్ళు లేవు. చేతులు లేవు. వికృతరూపి. చేటలవంటి చెవులు, గాదె బుట్ట వంటి కడుపు, అరమూరెడు పొడవు ముక్కు. చూసేవారికి చాలా అసహ్యం కలిగేలా వున్న శరీరం.

ద్వారకా తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుని గురించి ఆ నోట - ఈ నోట విన్నాడతడు. ఆ స్వామిని దర్శించాలని ఎంతో ఆత్రపడ్డాడు కాని అక్కడకు వెళ్ళడం ఎలా?

ఒకరోజు తన ఇరుగుపొరుగు వాళ్ళు కొంతమంది శ్రీ వేంకటశ్వరస్వామిని దర్శించడానికి ద్వారకకు వెళుతున్నారని అతనికి తెలిసింది. వెంటనే మాధవుడు 'నేను మహాపాపిని. ఏ జన్మలో చేసిన మహాపాపమో, ఇప్పుడు ఇలా, ఈ విధంగా వున్నాను. నన్ను మీతో తీసుకుపోయి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకునే అవకాశం కల్పించండి.' అని వార్ని ప్రార్థించాడు.

వాళ్ళు అంగీకరించి ఓ బండి మీద అతన్ని పడిపోకుండా త్రాళ్ళతో కట్టి తీసుకుని బయలుదేరారు. మార్గమధ్యములో ఓ అరణ్యం వున్నది. ఆ అడవి దగ్గరకు బండ్లు వచ్చేసరికి అడవిలో పెద్దపులులు, చిరుత పులుల అరుపులు వినవచ్చాయి.

మాధవుడ్ను ఉన్న బండి ఎద్దు భయపడి త్రాళ్ళు తెంపుకుని పారిపోయాయి. బండి బోర్లా పడిపోయింది.

'అయ్యబాబో' అన్న ఆర్తనాదం విని మిగిలిన బండ్ల వాళ్ళు వచ్చి కుంటివాడ్ని చూసి అతని గాయాలకు ప్రథమ చికిత్స చేశారు. ఈ కుంటివాడి పీడ మనకు దాపురించింది అనుకుంటూ చివరకు యాత్రికులంతా సాయంత్రమయ్యేసరికి ద్వారకా తిరుమల చేరుకున్నారు.

'ఒరేయ్...! ద్వారక వచ్చేశాం....! మమ్మల్ని బాధపెట్టి నువ్వు బాధపడ్డావు. ఇంతటితో నీ కష్టాలు గట్టెక్కిపోయినట్లే!' అన్నారు కొంతమంది మాధవుడితో.

'శ్రీవేంకటేశ్వరా! దయమయా....! నీ దగ్గర కొచ్చాను. నన్ను విముక్తుడ్ని చెయ్' అని కుంటివాడు పెద్దగా అరుస్తూ స్వామిని ప్రార్థించాడు. 'ద్వారకకి రాగలిగాను. నా జన్మధన్యమయింది' ఆనందోద్రేకములతో అని ఆ క్షణంలోనే ప్రాణాలు వదిలేశాడు మాధవుడు.

పవిత్ర క్షేత్రములో - పరమేశ్వరుడ్ని ప్రార్ధిస్తూ దేహం విడిచిన మాధవుణ్ణి దేవదూతలు తీసుకెళ్ళారు. కొంతకాలం స్వర్గంలో వుండి తరువాత ఆంధ్ర దేశాధీశుడైన ప్రతాపసింహరాజుకి కుమారుడిగా జన్మించాడు.

హేలాపురము రాజధానిగా విక్రమసింహుడు అన్న పేరుతో అతడు రాజ్యపాలన చేస్తుండేవాడు. ఓ రోజున ఓ స్త్రీ ఏడుస్తూ రాజు దగ్గరకొచ్చింది. ఆమె దుఃఖానికి కారణం ఏమిటని రాజు ప్రశ్నించగా "అయ్యా! నేనొక బ్రాహ్మణ యువతిని. నా భర్తనొక రాక్షసుడు ఎత్తుకుపోయాడు. ఆయనను ఏదో విధంగా ఆ రాక్షసుని బారినుంచి రక్షించి నన్ను కాపాడండి!' అంది.

విక్రమసింహుడు ఆమెని ఓదార్చి నీ భర్తను రక్షించి తెచ్చి నీ కప్పగిస్తానని మాట ఇచ్చి సైన్యాన్ని వెంటబెట్టుకుని అడవిలోకి పోయాడు. అడవిలో ఒకచోట రాక్షసుడు బ్రాహ్మణుడ్ని బాధలు పెడుతుండగా చూసి, తన దివ్యాస్త్రములతో రాక్షసుడ్ని సంహరించి, ఆ బ్రాహ్మణుడ్ని రక్షించి తెచ్చి ఆ యువతికి అప్పగించి తిరిగిపోతున్నాడు.

దారిలో ఒక పెద్ద పులి నోటిలో ఓ పిల్లవాడ్ని పట్టుకుని పారిపోతూ విక్రమసింహుడికి కనిపించింది. రాజు పులిని తరుముకుంటూ పోగా, అది పిల్లవాడ్ని ద్వారకా తిరుమల దగ్గరున్న మహారణ్యములో పడేసి అదృశ్యమయిపోయింది.

బాలుడ్ని వెదుకుతూ విక్రమసింహుడు అడవిలో సంచరిస్తూ వుండగా ఒకచోట ఓ దేవాలయం కన్పించింది. విక్రమసింహుడు ఆ ఆలయంలోకి ప్రవేశించి చూస్తే శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనమిచ్చాడు.

స్వామిని దర్శించిన వెంటనే రాజుకి పూర్వ జ్ఞానము కలిగి, మాధవుడిగా తనుస్వామి దర్శనానికి ద్వారకకి చేరుకుని, దర్శనం చేసుకోకముందే స్వర్గస్థుడవటం... ఆ చరిత్ర అంతా స్మృతిలోకి వచ్చింది.

గత జన్మలో స్వామి వార్ని దర్శించలేక పోవడం, ఇప్పుడు ఆ దేవుడ్ని దర్శించుకోవడం తలుచుకుని విక్రమసింహుడు స్వామిని ఎన్నో విధాలుగా ప్రార్థించాడు. శ్రీవేంకటేశ్వరస్వామి అతని భక్తికి సంతోషించి ఏదైనా వరం కోరుకోమన్నాడు.

ఓ పెద్దపులి నోటితో ఓ శిశువును ఎత్తుకుని పారిపోతుండగా చూసి, ఆ శిశువుని రక్షిస్తానని ప్రతిజ్ఞ చేసి ఇక్కడ కొచ్చాను. నువ్వు ఆ శిశువుని రక్షించి కాపాడాలని విక్రమసింహుడు స్వామిని కోరుకున్నాడు.

వేంకటేశ్వరుడు నవ్వుతూ "ఆ శిశువు ఎవరనుకుంటున్నావ్....? నేనే! ఆ రాక్షసుడు ఎవరనుకున్నావ్...? నేనే! ఆ పులినీ నేనే! ఆ బ్రాహ్మణ స్త్రీని కూడా నేనే! ఆ బాలుడు నా పుత్రుడు మన్మధుడు. నిన్ను ద్వారకా తిరుమలలో నా సన్నిధికి రప్పించుకోవాలన్న సంకల్పంతో ఇలా చేశాను. నువ్వు కొంతకాలం భూలోకంలో వుండి నా సాన్నిధ్యానికి చేరుకుంటావు" అని చెప్పి అదృశ్యమయ్యాడు.

వేంకటేశ్వరునకు విక్రమసింహుడు గోపుర, మండపములు కట్టించి నిత్యోత్సవాలు ఏర్పాటు చేశాడు.

ఈ క్షేత్రము గురించి ఇంకా కొన్ని స్థలపురాణాలున్నాయి.

బ్రహ్మాది దేవతలు పూర్వము ఒకప్పుడు శ్రీమన్నారాయణుని సందర్శించి మానవులను పాపవిముక్తులుగా చేయమని ప్రార్థించాడు. వారి ప్రార్థనలను విని దేవదేవుడిలా అన్నాడు.

'ఆదిశేషుడు ఓ సమయంలో నన్ను తనపై సదా నివసించి వుండాలని కోరాడు. పర్వత రూపంలో వున్నాడు శేషుడు. అక్కడే నా భక్తుడు ద్వారకుడు కూడా నా కోసం తపస్సు చేస్తున్నాడు. అతనికి ముక్తినివ్వడానికి నేను భూలోకంలో అవతరిస్తాను. మీ కోర్కెలు అప్పుడు నెరవేరతాయి. ద్వారకా తిరుమలలో నేను వేంకటేశ్వరుడినై అవతరిస్తాను'.

కొంతకాలానికి ద్వారకుడు ఆ కొండ మీద చేస్తున్న ఘోరతపస్సుకి శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై వరం ఏదైనా కోరుకోమన్నాడు.

'నీ పాద పద్మములను నిరంతరం సేవించు భాగ్యం నా కొనగుము' అని ద్వారకుడు కోరుకోగా స్వామి మన్నించి తన పాదములను అతనికి ఇచ్చాడు. అందుకే స్వామి పాదములు ఈ నాటికీ కన్పించవు.

అజ మహారాజు స్వయంవరంలో ఇందుమతిని పరిణయమాడి, ఆమెతో తన రాజధానికి తిరిగి వస్తుండగా, స్వయంవరంలో అపజయం పాలయిన రాజులు అజ మహారాజుతో యుద్ధానికి వచ్చారు. అజ మహారాజు తన గురువైన వశిష్ఠుని గురించి ప్రార్థించాడు. ఆయన ప్రత్యక్షమై ఆ సమీపంలోని అరణ్యంలోవున్న శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించకపోవడం వల్లనే ఈ యుద్ధం, ఆపత్తు సంభవించాయని చెప్పాడు.

యుద్ధంలో జయం పొందిన వెంటనే శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించికుంటాను అని మొక్కుకుని యుద్ధంలో విజయుడయ్యాడు అజమహారాజు. అనంతరం స్వామివార్ని సేవించి తన నగరానికి వెళ్ళిపోయాడు.

రఘు మహారాజు, దశరథ మహారాజు కూడా ఈ వేంకటేశ్వరుని సేవించారు.

సుమారు అయిదు వందల సంవత్సరములకు పూర్వము ఓ మహాపురుషుడు తన తపస్సులో శ్రీ వేంకటేశ్వరుడు ఇక్కడ వున్నాడని తెలుసుకుని కొద్ది దూరంలో వున్న గొల్లగూడెంలో నివసిస్తూ ప్రతిరోజూ ఆయన ఆ గూడెం నుంచి ద్వారకకు వచ్చి స్వామిని సేవించుకుంటూ వుండేవాడు. ఆ గొల్లలు మట్టితో ఒక చిన్న ఆలయాన్ని స్వామికి కట్టించారట ! ఆ ప్రాంతమంతా ఆ కాలంలో మహారణ్యంగా వుండేది.

కొంతకాలానికి శ్రీ ధర్మ అప్పారావు అక్కడకు వేటకొచ్చాడు. అక్కడ వున్నవారిచే స్వామి వృత్తాంతం విని శ్రీ వేంకటేశ్వరునకు ఆలయాన్ని కట్టించాడు. తరువాత శ్రీ పెరుంబుదూరు నుంచి వైష్ణవులను రప్పించి ఆలయంలో ఆళ్వారుల్ని కూడా ప్రతిష్ఠించారట !

కొంత కాలం క్రితం వరకూ ఈ ఆలయంలోనికి రాత్రులు మానవులు వెళ్లడానికి శక్యం కాని విధంగా వుండేదని, రాత్రులందు స్వామిని దేవతలే స్వయంగా పూజచేసేవారని ప్రతీతి.

అందుకే ఆలయంలో రాత్రులు ఇటీవల సుమారు ఎనభై సంవత్సరాల వరకూ ఎలాంటి కార్యక్రమాలు జరిగేవి కాదని తెలుస్తోంది. ఈ స్వామి కూడా ఎంత మాత్రం సహించడు. వర్షీతో

సహా తనకు రావలసిన సొమ్మును వసూలు చేసుకుంటారు.

సుదర్శనక్షేత్రం అని పిలువబడే ఈ దేవాలయంలో అశ్వయుజ శుద్ధ దశమి నుంచి 9 రోజులు ఓ విగ్రహానికి, వైశాఖ శుద్ధనవమి నుంచి రెండో విగ్రహానికి కళ్యాణోత్సవాలు జరుగుతాయి. స్వామి వారి పాదములు పుట్టలో వుండటం వల్ల అభిషేకం చెయ్యరు. నీరు పడితే పుట్టలోంచి పురుగులు వస్తాయి. స్వయంభు అయిన స్వామివారు, గోపురం, సింహద్వారం, దక్షిణాభిముఖమై వుండటం వల్ల భక్తులు ఉత్తరాభి ముఖులై దర్శనం చేసుకుంటారు. ద్వారకా తిరుమల గ్రామ దేవత కుంకుళ్ళమ్మ. భీమడోలు నుంచి ద్వారకా తిరుమలకు పోయే రోడ్డులో వూరి మొదట్లో అమ్మవారి గుడి వుంది. అమ్మవారిని స్వామివారిదర్శన అనంతరం తప్పనిసరిగా దర్శించుకోవడం ఆనవాయితీ.

## 8) శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయం - భీమడోలు

తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు పోయే జాతీయ రహదారిని అనుకునివున్న భీమడోలు మండల కేంద్రం కూడా. ఇక్కడ రైల్వే స్టేషన్ కూడా వుంది. ఏలూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ భీమడోలు గ్రామంలో కొలువైయున్నారు శ్రీ భీమేశ్వరస్వామి.



*శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం, భీమడోలు*


అతి ప్రాచీనమైన ఈ దేవాలయం నిర్మాణం జరిగి సుమారు వెయ్యి సంవత్సరాలకు పైనే అయి వుంటుందని ఇక్కడ లభించిన ఆధారాలను బట్టి తెలుస్తోంది.

ఈ ఆలయాన్ని నిర్మించిన రాజులెవరో తెలిపే శాసనాలు ఏమీ అందుబాటులోలేవుగాని మహాశివరాత్రి వుత్సవం ఘనంగా జరుపుతారు. స్వామివారి మహిమలపట్ల భక్తులకు అచంచలమైన విశ్వాసం !

## 9. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం - భీమడోలు

ఇదే గ్రామంలో వెలసిన దివ్య మంగళమూర్తి, కలియుగ అవతారంగా యావత్‌భారత్ ప్రజల పూజలందుకుంటున్న శ్రీ వేంకటేశ్వరస్వామి పిలిస్తే పలికే దైవంగా, ఆంధ్రదేశంలోని మూడువంతుల మంది భక్తుల నోట చివర నిలిచే నామం శ్రీ వేంకటేశ్వర స్వామి.

స్వామి వార్ని ఇక్కడ ప్రతిష్ఠించిందెవరో, ఎంత కాలమయిందో స్పష్టంగా తెలిసిన వారు ఈ గ్రామంలో ఎవరూ లేరు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి వద్ద నున్న వివరాలను బట్టి చూస్తే ఈ ఆల యం ఈనాటిది కాదు.



*శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు ఆంజనేయ స్వామి వార్ల ఆలయం*

సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఇక్కడ ఆలయం నిర్మించబడింది. ఎన్నిసార్లు జీర్ణోద్ధరణ జరిగిందో తెలియదు గానీ ఈ పురాతన ఆలయం ఇప్పటికీ మంచి ప్రాభవంలో వుండటం ఆ కలియుగ దైవం శ్రీనివాసుని గొప్పతనమే అనుకోవాలి !

స్వామి వారి బ్రహోత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా, గొప్ప వేడుకగా జరుగుతాయి.

## 10) శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయం - విజయరాయి

ఏలూరు పట్టణం నుంచి చింతలపూడికి పోయే రోడ్డు మార్గంలో సుమారు పదిహేడు కిలోమీటర్ల దూరంలో, వెదవేగి మండలంలోవున్నది విజయరాయి గ్రామం.

పెదవేంగీ దుర్గాన్ని జయించిన తరువాత యీ గ్రామాన్ని తన తండ్రి విజయరాయల స్మారకంగా శ్రీ కృష్ణ దేవరాయలు బ్రాహ్మణులకు దానంగా యిచ్చినట్లు తెలుస్తోంది. ఆ కారణం వల్లనే ఈ గ్రామానికి 'విజయశిలా నగరం' అని పేరు వచ్చింది. కాలక్రమేణా విజయ శిలానగరం అనే పేరు విజయరాయిగా మారిపోయింది.

ఈ గ్రామానికి అతి సమీపంగా ప్రవహిస్తుంది తమ్మిలేరు. శ్రీ సీతారామ లక్ష్మణులు

అరణ్యవాసం చేస్తుండగా ఒకనాడు సీతాదేవి అలసిపోయి దాహం తీర్చుకోవడానికి నీరుకావాలని అడిగింది




శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, విజయరాయి

అలసివాడిపోయిన వదనంతో వున్న తన ఇష్టసఖి సీతాదేవిని చూసి శ్రీరాముడు తన సోదరుడు లక్ష్మణునికి అనుజ్ఞ ఇచ్చాడు. అన్నగారి అనుమతి పొందిన లక్ష్మణుడు ఒక దివ్యాస్త్రాన్ని ప్రయోగించి పాతాళగంగను భూమిపైకి తెచ్చాడు.


సీతాదేవి ఆ గంగా జలాన్ని ఆర్తిగా సేవించి, సేద తీరింది. శ్రీరాముని తమ్ముడు లక్ష్మణుడు ఈ ఏటిని తెచ్చినందున దానికి 'తమ్ములేరు' అని పేరు వచ్చింది.

కాలక్రమేణా అది జనుల నోట బడి 'తమ్మిలేరుగా' మారిపోయింది. ఇక్కడ శ్రీరామలింగేశ్వర స్వామి వారి అతి పురాతనమైన ఆలయం వున్నది.

శ్రీరామ లింగేశ్వరుడ్ని మాత్రం త్రేతాయుగంలో శ్రీ రామచంద్రుడు 'నటీన వేతంగా ఈ అరణ్యంలో సంచరిస్తుండగా ప్రతిష్ఠించాడని ప్రతీతి !



గర్భగుడిలో శ్రీ రామలింగేశ్వర స్వామి



*శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, విజయరాయి*


ఆలయాన్ని నిర్మించి సుమారు ఏడు వందల సంవత్సరాలకు పైనే అయివుంటుందని అక్కడ లభించిన ఆధారాలు చెబుతున్నాయి. పర్వదినాన్న భక్తులు వేలాదిగా ఇక్కడ అర్చనలు చేయించుకుంటారు. ఇదే గ్రామంలో వున్న మరో పురాతనమైన దేవాలయంలో కొలువైయున్నారు శ్రీ వేణుగోపాలస్వామి.

## 11) శ్రీ ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయం - ధర్మాజీగూడెం

ఏలూరు నుంచి చింతలపూడి పోయే రహదారిలో ఏలూరుకి ఇరవై కిలోమీటర్ల దూరంలో లింగపాలెం మండలంలో వుంది. ధర్మాజీ గూడెం గ్రామానికి చింతలపూడి, ఏలూరుల నుంచి బస్సులో చేరుకోవచ్చు. మెయిన్‌రోడ్‌కి ఆనుకుని వుంది ధర్మాజీగూడెం.

ఈ గ్రామంలో వున్న దేవాలయంలో కొలువైయున్నారు శ్రీ ధర్మలింగేశ్వరస్వామి. ఈ ఆలయ నిర్మాణం జరిగి సుమారు పన్నెండువందల సంవత్సరాలు పైనే అయివుంటుందని తెలుస్తోంది.


పాండవులు వనవాస కాలంలో ఈ ప్రాంతం అంతా అరణ్యం కావడంతో పాండవులు ఇటుగా వచ్చినట్లు, అప్పుడే ధర్మరాజు తమ పూజార్థం ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లుగానూ, అందువల్లనే స్వామివారిని ధర్మలింగేశ్వరస్వామి అని పిలుస్తున్నట్లుగానూ తెలుస్తోంది.




శ్రీ ధర్మలింగేశ్వర స్వామి ఆలయం, ధర్మాజీగూడెం

ఈ పురాతనమైన ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవం బహువేడుకగా సాగుతుంది. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి తరలివస్తారు.

## 12) శ్రీ గాంగేశ్వరస్వామి వారి ఆలయం - తడికలపూడి



శ్రీ గాంగేశ్వర స్వామి ఆలయం, తడికలపూడి



*శ్రీ గాంగేశ్వర స్వామి ఆలయ గోపురం, తడికలపూడి*

కామవరపు కోట నుంచి ఏలూరు పోయే రోడ్డులో ఏలూరుకి పదిహేడు కిలోమీటర్ల దూరంలో కామవరపు కోట మండలంలో వుంది తడికలపూడి గ్రామం.

ఒకానొకప్పుడు అత్యున్నత స్థితిలో వుండి కాల ప్రవాహంలో మరుగునపడిన మహత్తర దేవాలయాల్లో తడికలపూడిలోని ఈ దేవాలయం ఒకటి. ఈ అతి పురాతన దేవాలయంలో కొలువై వున్నారు శ్రీ గాంగేశ్వరస్వామి.

తళుక్కు-తళుక్కున మెరిసే లింగం వుంది కనుక తళుకుల పూడి అని ఈ గ్రామానికి పేరు వచ్చినట్లుగానూ, అది క్రమేణా తడికలపూడిగా నామాంతరం చెందినట్లుగానూ తెలియవస్తోంది.

స్వామివారికి అరణ్యేశ్వరుడు, అయ్యనేశ్వరుడు, అరుణేశ్వర శ్రీ మహాదేవుడు అని కూడా పేర్లున్నాయ్. సూర్యోదయమయినప్పుడు ఉదయభానుని కిరణాలుపడి లింగం తళ-తళ మెరుస్తుంది అంటారు అర్చకులు.


గాంగేయమనే ఒక విధమయిన రాతితో తయారు చేయబడింది కనుక గాంగేయేశ్వరుడు అని ప్రసిద్ధి చెందినట్లు కూడా చరిత్ర వుంది. గాంగేయేశ్వరుని ఆలయ ప్రాకారంలోనూ, కళ్యాణ మంటపంలోని స్తంభాల మీద, గ్రామంలోని కొన్ని ప్రదేశాల్లోనూ శిలాశాసనాలు చాలా వున్నాయి అవి పదకొండు, పన్నెండు శతాబ్దాలకు చెందినవి. కొన్నయితే అసలు గుర్తించడానికి వీలులేని పరిస్థితిలోకి వచ్చేశాయి. వేంగి సామ్రాజ్య కాలంలో ఈ అరుణేశ్వరునకు అనేకులు దానాలు ఇచ్చినట్లు ఇక్కడున్న శాసనాల వల్ల తెలుస్తోంది.

## 13) శ్రీ సీతారామస్వామి వారి ఆలయం - పూళ్ళ




శ్రీ సీతారామ స్వామి వారి ఆలయం, పూళ్ళ

మద్రాసు-కలకత్తా జాతీయ రహదారిలో, ఏలూరు, తాడేపల్లిగూడెం మధ్యలో తాడేపల్లిగూడేనికి ఇరవై కిలోమీటర్ల దూరంలో రోడ్డుకి అనుకునివున్న పూళ్ళ గ్రామం భీమడోలు మండలంలో వుంది. రైల్వే స్టేషన్ కూడా వున్న ఈ గ్రామంలో శ్రీ సీతారామస్వామి వారు కొలువై యున్నారు.



శ్రీ నకలేశ్వర స్వామి వారి ఆలయం, పూళ్ళ

ఎన్నో వందల సంవత్సరాలకు పూర్వం నిర్మించబడిందని చెప్పుకునే ఈ ఆలయంలో వెలసిన స్వామివార్ని భక్తులు విశేషంగా కొలుస్తారు. శ్రీరామనవమికి జరిగే కళ్యాణోత్సవం భద్రాద్రి ఉత్సవాన్ని గుర్తుకు తెస్తుంది.




శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, పూళ్ళ

ఇక్కడే వున్న మరో పురాతన ఆలయంలో కొలువై వున్నారు శ్రీ సకలేశ్వరస్వామి. ఆలయ నిర్మాణ వివరాలు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం !

కార్తీక మాసంలో విశేష అభిషేకాలు జరుగుతాయి. ఇక్కడ తప్పక దర్శించాల్సిన మరో దేవాలయం నూతనంగా కాలువగట్టున నిర్మించబడిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం.

## 14) శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయం - కైకరం




శ్రీ రామలింగేశ్వర స్వామి అలయం, కైకరం

మద్రాసు -కలకత్తా జాతీయ రహదారిలో, ఏలూరు, తాడేపల్లిగూడెం మధ్యలో, తాడేపల్లిగూడేనికి 16 కిలోమీటర్ల దూరంలో రోడ్డుకి అనుకునే వున్న గ్రామం కైకరం. ఉంగుటూరు మండలంలో వున్న ఈ గ్రామానికి రైల్వే స్టేషన్ కూడా వుంది. యాత్రికులకు మాత్రం వసతి సౌకర్యాలు ఇక్కడ లేవు

ఇక్కడ వున్న పార్వతీ సహిత శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయం అతిపురాతన మైనది. చారిత్రాకాధారాలను బట్టి పరిశీలించి చూడగా సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

స్వామివారి కళ్యాణోత్సవం చాలా వేడుకగా, ప్రత్యేక ఆకర్షణగా కొనసాగుతుంది. భక్తులు వేలకొలదీ ఈ ఉత్సవంలో పాల్గొంటారు.



గర్భగుడిలో శ్రీ రామలింగేశ్వర స్వామి, కైకరం




రుక్మిణి, సత్యభామ సహిత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, కైకరం

ఈ గ్రామం చారిత్రకంగా కూడా ముఖ్యమైన స్థానాన్ని సంపాదించిందనే చెప్పాలి. పూర్వం నూజవీడు జమీందారు శ్రీ ధర్మఅప్పారావు గారు ఈ గ్రామంలో వెయ్యిన్నొక్క శివలింగాలను ప్రతిష్టించారని ప్రతీతి. అందులో ఇప్పుడు ఒక శివాలయం మాత్రమే వుంది. శివాలయాలను కైంకర్యం చేసినందులకు కైంకర్యం అనే పేరు ఈ గ్రామానికి సార్థక నామధేయం కాగా, కాలానుగుణంగా అది కైకరంగా మారింది.

శ్రీ పార్వతీ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రక్కనే రుక్మిణి, సత్యభామా సహిత శ్రీ వేణుగోపాలస్వామి కొలువై వున్నారు. అదే ఆలయంలో వున్న శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామిని కూడా తప్పక దర్శనం చేసుకోవడం ఇక్కడ ప్రజలకు, భక్తులకు ఆనవాయితీ.




*గర్భగుడిలో రుక్మిణి, సత్యభామ సహిత శ్రీ వేణుగోపాల స్వామి*



*గర్భగుడిలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామి, కైకరం*

## 15) శ్రీ వేణుగోపాలస్వామి మరియు సీతారామస్వామి వార్ల ఆలయాలు - దువ్వ

తణుకు-తాడేపల్లి గూడెం జాతీయ రహదారిలో తణుకు నుంచి ఏడు కిలోమీటర్లు, తాడేపల్లిగూడెం నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరంలో. తణుకు మండలంలో వున్న గ్రామం దువ్వ. బస్సులో ఇక్కడకు చేరుకోవచ్చు.



శ్రీ వేణుగోపాల స్వామి మరియు సీతారామస్వామి ఆలయం, దువ్వ

ఈ గ్రామాన్ని పూర్వం దూర్వాసపురం అని పిలిచేవారు. విశ్వామిత్ర మహర్షి తణుకు దగ్గరలో వున్న రేలంగిలోనూ, ఇక్కడ కూడా తపస్సు చేశాడు. దూర్వాసుడు, విశ్వామిత్రుడు ఇక్కడ యజ్ఞం చేశారు. మొదట దూర్వాసునికి కోపమొచ్చి ఈ గ్రామానికొచ్చి శివుడు గురించి తపస్సు చేశాడు. దివి నుండి భూమికి ఒక నదిని కూడా తెచ్చి, కేశవస్వామికి ఆలయం కూడా కట్టించాడు.

దూర్వాసుడు గౌతముని అజ్ఞ లేకుండా గౌతమీనదిని తీసుకొస్తుండగా గౌతమ ముని ఆ ప్రవాహాన్ని ఆపేశాడు. దూర్వాసుడు ఆగ్రహంతో ఒక్కసారి వేయి నదులను రప్పించాడు. ఆ కొత్త నదియే 'వెయ్యేరు'

'సహస్రనదీ తీర భీమమండల పరిష్కణమ్ దుర్వాసపురీవరమ్ విజయతీ' అన్న శ్లోకాన్ని బట్టీ ఇది తెలుస్తోంది.

దువ్వలో కొలువైవున్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం క్రీస్తు శకం 1330లో నిర్మించినట్టు తెలుస్తోంది. స్వామి గరుడ వాహనా రూఢుడై వున్నాడు. ఇక్కడ పూర్వం విప్పర్తి గోపాలరెడ్డి అనే భక్తుడుండేవాడు. అతనికి గుళ్ళపాలెంలో ఆవులు వుండేవి. ప్రతీ రోజూ అక్కడ నుంచి ఆవుపాలు తెప్పించుకునేవాడు అతను.

కొన్ని దినముల తర్వాత ఆవులు పాలు ఇవ్వడం మానేశాయ్. కారణం తెలియక రెడ్డి ఒక రోజు స్వయంగా అక్కడికెళ్ళాడు. ఆ రాత్రంతా మెలకువగా వుండి ఆవులను గమనిస్తూ వుండిపోయాడు. కొంతసేపటికి మెల్లగా శ్రీ వేణుగోపాలస్వామి. ఐదేళ్ళ బాలుని రూపంలో వచ్చి ఆవుపాలు త్రాగడం మొదలుపెట్టాడు.



గర్భగుడిలో సత్యభామ, రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాలస్వామి


రెడ్డి ఆ పిల్లవాని చెయ్యి పట్టుకుని 'ఏమిటాపని?' అని ప్రశ్నించాడు. "నేనెవరనుకుంటున్నావ్! వేణు గోపాలస్వామిని. నా విగ్రహం ఒకటి ఇక్కడ భూమిలో పూడిపోయి వుంది. బయటకు తీసి గుడి కట్టించు...!' అని చెప్పి అదృశ్యమయ్యాడు బాలుడు.

రెడ్డి వెంటనే స్వామి చెప్పినట్లుగా అక్కడ తవ్వించాడు. అక్కడ దొరికిన శ్రీ వేణుగోపాలస్వామి వెనుక ముఖంలో జగన్మోహిని ఆకారం వున్న అతి సుందరమైన విగ్రహం ఇది !

ఈ ఆలయంలో కొన్ని శిలాశాసనములున్నాయి. వాటిలో శాలివాహన శకం 1770లోని శిలా శాసనాన్ని బట్టి మల్లినేడి ప్రభువు ఆలయాన్ని మరమ్మత్తు చేయించి శిఖరం ప్రతిష్ఠింపజేశాడని, భాగ మంటపంలో రాళ్ళు పరిపించాడని తెలుస్తోంది. వేణు గోపాలస్వామి వారి ఆలయానికి ఎదురుగా వున్న మరో ఆలయంలో శ్రీ కేశవస్వామి కొలువై యున్నారు. సుమారు అయిదు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో స్వామివారి కళ్యాణం వైశాఖ మాసంలో జరుగుతుంది.

ఇక్కడే వున్న మరో ఆలయం శ్రీ నాగేశ్వర స్వామి వారి దేవాలయం. ద్వాపరయుగంలో కర్కోటకునిచే యీ నాగేశ్వరస్వామి ప్రతిష్ఠించబడినట్లుగా తెలుస్తోంది. పరమేశ్వరుని ప్రక్కన పార్వతీదేవి పర్వతవర్థని అను అయిదేండ్ల బాలికగా కమలాన్ని చేత్తో ధరించి వుండటం విశేషం. మహాశివరాత్రికి స్వామివారి కళ్యాణం అద్భుతంగా జరుగుతుంది.

మూడు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడిన మరో పురాతనమైన దేవాలయంలో శ్రీ సీతారామస్వామి వారు కొలువై వున్నారు. ధనుర్మాసంలో జరిగే శ్రీరామనవమి ముఖ్య ఉత్సవం!



గర్భగుడిలో శ్రీ సీతారామస్వామి

దువ్వ గ్రామంలో ప్రసిద్ధి పొందిన గ్రామదేవత శ్రీ దానేశ్వరి అమ్మవార్ని తప్పక దర్శించుకోవాలి. మహత్తర తపశ్శక్తి సంపన్నుడైన దూర్వాస మహర్షిచే మంత్రారాశిగా ప్రతిష్ఠించబడిన శ్రీ దానేశ్వరి సర్వజనులను ఆకర్షిస్తూ, వారి కోరికలను తీరుస్తోంది. దానేశ్వరి మహిమలు ఈ ప్రాంతములోని వ్యవసాయదారులకు బాగా అనుభవమే !

ప్రాచీన కాలం నుంచి ఈ ప్రాంతమంతా శక్తిమయమని, అపరాధములు చేస్తే ప్రమాదాలు కలుగుతాయన్న విశ్వాసంతో దానేశ్వరి అమ్మవారి మాన్యానికి చెందిన భూముల్లో ధాన్యపు రాశులను ఎవరూ ముట్టుకునే వారు కారు.

1950-51 సంవత్సర ప్రాంతంలో దువ్వ-ఉరదాలపాలెం రోడ్డు వేశాక కారు డ్రయివర్లకు అమ్మవారు తన మహిమలు చూపడం ప్రారంభించింది. బరువుతోనూ, వేగంగా వచ్చే లారీలు ముందు చక్రాల టైర్లు బరస్ట్ అయినప్పుడు కూడా దేవి కరుణతో లారీలకిగానీ, డ్రయివర్లకి కానీ ఎలాంటి ప్రమాదాలూ కలిగేవి కావు.

కొంత కాలానికి అమ్మవారి పాత గుడి, అమ్మవారి విగ్రహాలు కూడా శిథిలమయిపోయాయి. నూతన దేవాలయం, అందులో ప్రతిష్ఠకి నూతన దేవతా విగ్రహం అవసరమయ్యాయి.

1976లో ఆలయ శంకుస్థాపన చేసి ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఆనాటి నుంచి అమ్మవారి భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. అమ్మవార్ని నమ్మి మొక్కుకున్న వారి కోర్కెలు ఈడేర్చడంతో దానేశ్వరి అమ్మవారు ఆ గ్రామానికే గాక చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి కూడా భక్తులను ఆకర్షిస్తున్నారు.

## 16) శ్రీ రాజేశ్వర స్వామి వారి ఆలయం - తేతలి

తణుకు నుంచి తాడేపల్లి గూడెం పోయే జాతీయ రహదారిలో తణుకుకి మూడున్నర కిలోమీటర్ల దూరంలో తణుకు మండలంలో వుంది తేతలి గ్రామం

ఈ గ్రామంలోని ఆలయాల్లో శ్రీ రాజేశ్వర స్వామి వారి ఆలయం ఒకటి ! పురాతనమైన ఈ ఆలయాన్ని రాజరాజనరేంద్రుడు కట్టించినట్లుగా తెలుస్తోంది.

పూర్వం రాజరాజ నరేంద్రుడు ఈ ప్రాంతానికి ఒకసారి వేటకి వచ్చాడు. వేటాడుతుండగా రాజ రాజనరేంద్రునికి శిధిలమై వున్న శ్రీ రాజేశ్వరస్వామి వారి ఆలయం కనిపించింది.




శ్రీ రాజేశ్వర స్వామి ఆలయం, తేతలి

ఆ ఆలయం వద్దనే ఒక పెద్ద త్రాచుపాము కూడా కన్పించడంతో అది అతి పవిత్రమైన ప్రదేశంగా భావించి అక్కడ ఒక ఆలయం నిర్మించాలన్న నిర్ణయాని కొచ్చాడు. ఆలయ పరిసరా లలో పునాదుల కోసం త్రవ్వుతుండగా దొరికినవే నాగుపాము, నంది విగ్రహము.

ఆలయ నిర్మాణనంతరం ప్రతిష్ఠచేశాక, గుడి ముందు పెద్ద బావిని రాజరాజనరేంద్రుడే త్రవ్వించినట్లుగా ఇక్కడ వున్న పాళీభాషలోని శాసనాలను బట్టి తెలుస్తోంది.

రాజరాజనరేంద్రుడి చేత నిర్మింపబడిన ఆలయం కనుక శ్రీ రాజేశ్వరస్వామి ఆలయం అని పేరొచ్చిందని ప్రతీతి. దేవీ నవరాత్రులు, స్వామి వారి కళ్యాణం, కార్తీకమాసంలో పూజలు ముఖ్య ఉత్సవాలు. చాలా మహిమగల స్వామి. కోరికలను నెరవేర్చే సాంబశివుడ్ని తప్పక దర్శించాలి.

ఇక్కడే వున్న మరో పురాతన దేవస్థానం శ్రీ సీతారామస్వామి వారి ఆలయం. పూర్వం తేతలి గ్రామంలోని ఒక భక్తుడు కాశీయాత్రకు బయలుదేరి వూరి బయట ఓ చెట్టు క్రింద పడుకుని




శ్రీరామచంద్రుల వారి ఆలయ గోపురం, తేతలి

నిద్రపోయాడు. ఆ నిద్రలో అతనికో స్వప్నం వచ్చింది ఆ కలలో ఆయనకు శ్రీ సీతా రామ లక్ష్మణులు ప్రత్యక్ష మయి "నువ్వు నిద్రపోతున్న ప్రదేశానికి ఎదురుగా వున్న పొదల్లో వెదుకు అక్కడ మా విగ్రహాలున్నాయి. వాటికి ఆలయం కట్టించి పూజించు. కాశీ యాత్ర కంటే అధిక ఫలం దక్కుతుంది''అని చెప్పి అదృశ్యమయ్యారు.

ఆ భక్తుడు ఉలిక్కి పాటుతో నిద్రలేచి ఎదురుగా వున్న పొదలలో గాలించగా దొరికిన శ్రీ సీతారామ లక్ష్మణులకు ఆలయం నిర్మిం చాడు. సుమారు వెయ్యి సంవత్సరాలకు పూర్వం ఈ దేవాలయాన్ని నిర్మించినట్లుగా తెలుస్తోంది

పూర్వం ఈ ప్రాంతమంతా శ్రీరాముడి పాలనలోనే వుండేది. ఈ గ్రామాన్ని ఆనుకుని ప్రవహిస్తున్న అత్తిలి కాలువ పేరు గోస్తనీ నది. అనగా 'గోవు యొక్క స్థనం నుండి కారునది' అని అర్థం. గోవు స్థనం నుండి కారేదేమిటి ? పాలు... ఈ గోస్తనీ నది కొవ్వూరు నుండి ప్రారంభమయి ఈ తేతలి ప్రక్కనుంచి ప్రవహిస్తుంది.

శ్రీరాముడు ఇక్కడకువచ్చి, గోస్తనీ నది తీరంలోని ఆశ్రమంలో వుండగా భక్తులు ఆయనని కొలవడానికి వస్తున్నారు. పార్వతీదేవి సీతాదేవి రూపంలో పాలు, ఫలాలు, పుష్పాలు తీసుకుని




గర్భగుడిలో శ్రీ రాజేశ్వర స్వామి

భక్తులందరితో పాటే వరుసలో నిలబడి వస్తోంది.

ఆ సంగతి గ్రహించిన శ్రీరాముడు 'తే తల్లీ! ఒక్కదానివే వచ్చావేం? స్వామివారు ఏరి ?" అని ప్రశ్నించాడు.

'తే, తల్లీ' అనే పేరు కాలక్రమేణా తేతలిగా మారింది. అందుకు గుర్తుగా వెలసినదే శ్రీ సీతారామస్వామి ఆలయం. స్వామి వారి కళ్యాణం అతి వైభోగంగా జరుగుతుంది.



*గర్భగుడిలో అమ్మవారు, తేతలి*

## 17) శ్రీ కేశవస్వామి మరియు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, తణుకు

తణుకు పట్టణం మండల కేంద్రమే కాదు. నిడదవోలు, నర్సాపురం రైలు మార్గంలో ఓ ముఖ్యమైన స్టేషన్‌కూడా. ఇక్కడ నుంచి చుట్టు ప్రక్కల గ్రామాలకు, పట్టణాలకు బస్ సౌకర్యం వుంది.

గోస్తనీ నది ఒడ్డున వున్న ఈ పట్టణం పూర్వం 'తారకాపురం' అనే పేరుతో పిలవబడేది. పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు శివుడి కోసం ఘోర తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమయి వరం కోరుకోమంటే "శివపార్వతుల పుత్రునిచేత' తప్ప మరెవ్వరి చేతుల్లోనూ తనకు మరణం సంభవించకుండా' వరం అడిగాడు.

మహేశ్వరుడు ఆ వరాన్ని ప్రసాదించాడు. దక్ష యజ్ఞంలో ఆత్మార్పణ చేసుకున్న పార్వతి తిరిగి హిమవంతుని కుమార్తెగా జన్మించి, శివుని పరిణయమాడటానికి తపస్సు చేసింది. మహావిష్ణువు తన కుమారుడైన మన్మధుడ్ని పంపి శివతపోభంగం కలిగించాడు. శివుని ఆగ్రహానికిలోనయిన మన్మధుడు భస్మమయ్యాడు.


తర్వాత శివపార్వతుల కళ్యాణం జరిగింది. కుమారస్వామి జన్మించాడు. ఇంద్రుని కుమార్తె దేవ సేనతో కుమారస్వామికి వివాహం జరిగాక తారకాసురుడ్ని సంహరించాడు కుమారస్వామి.

మహా తపస్సంపన్నుడైన తారకాసురుడ్ని చంపినందుకు ప్రాప్తించిన పాప పరిహారం కొరకు

కుమారస్వామి కపర్థీశ్వర లింగాన్ని ప్రతిష్టించాడు. శ్రీ కపర్థీశ్వర స్వామి వారి ఆలయ ఉత్తర భాగంలోనే శ్రీ కేశవస్వామి వారి ఆలయం వుంది.

పూర్వం ఈ ప్రాంతంలో ఓ రైతు దగ్గర ఓ గోవు వుండేది. అది చాలా పవిత్రమైనది. ఒక రోజున ఆ ఆవు తన లేగ దూడతో మేతకి ఊరి బయటకు మందలో కలసి వెళ్ళింది. ఓ డేగ ఆ ఆవు దూడను ఎత్తుకుని పైకి ఎగిరిపోయింది. దూడ కోసం అరుస్తూ ఆవు డేగ ఎగిరిపోయిన దారిలోనే పరిగెత్తింది.

దూడ కోసం పరితపిస్తూ పరుగెట్టిన గోవు పాలుకారి ఏరుగా ప్రవహించాయి. అందుకే 'గోస్తనీ' అని ఆ ఏరుకి పేరొచ్చిందని ఇతి హాసం. ఈ గోస్తనీ తీరంలో వుంది శ్రీ కేశవస్వామి ఆలయం !




శ్రీ కేశవస్వామి మరియు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, తణుకు

"చాల పురాతనమైన ఈ ఆలయంలో స్వామి వార్ని నారద మహర్షి ప్రతిష్టించాడు. పంచ కేశవాలయాలను. వాకతిప్ప, ర్యాలి, కొతాలపర్రు, తణుకు, మండపాకల్లో నారదుడు ప్రతిష్టించినట్లుగా పురాణాల్లో వుంది.

ఇక్కడ స్వామివారు ఉపాసనామూర్తి. గోస్తనీ నది గురించి వాయు పురాణంలో మరొక కథ వుంది.

పూర్వము పృధు చక్రవర్తి గోరూపం ధరించి భూమి నుంచి శ్రేష్ట వస్తువులను, మహత్తర ఓషధులను పితికాడు. ధేనువు నుండి పితకబడిన పాల నుంచి ప్రసిద్ధ నదులు బయలు దేరాయి. ఆ విధంగా బయటుదేరిన నదుల్లో ఒకటి గోస్తనీ నది ! క్షీరధారల నుండి ధేను పర్వతం ఏర్పడి, దాన్నుండి ప్రవహిస్తూ వచ్చి ముప్పది ఆమడల మేరలో దక్షిణ సముద్రంలో కలిసింది. ఇందులో ఒక శాఖ బస్తరు నుంచి దక్షిణంగా ప్రవహిస్తూ వచ్చి గౌతమి గోదావరిని దాటి ఇవతలి ఒడ్డుకు వచ్చి కొవ్వూరు, తణుకు, భీమవరం, నర్సాపురం మండలాలలోని గ్రామాల ప్రక్కగా ప్రవహించి



*శ్రీ కపర్దీశ్వర స్వామివారి ఆలయం, తణుకు*

అంతర్వేదికి సమీపంలో కాశీ పట్టణం అనేచోట సముద్రంలో కలుస్తోంది.

గోస్తనీ నది గౌతమిలో కలిసి వున్నట్లూ, గోస్తనీ మధ్య నుంచి గౌతమి ప్రవహించినట్లూ, గోస్తని కొన్నిచోట్ల అంతర్వాహిని అనీ, గోస్తనీ, గౌతమీ సంగమ స్థలం పరమ పవిత్రం అని పురాణాలు చెబుతున్నాయి.

ముక్తిని కోరేవారికి స్నానం విశేష ఫలదాయకమవుతుంది. కాశీ క్షేత్రములో సంవత్సరం వుండి స్నానం చేస్తే ఎంతోపుణ్యం. నీలగిరి మీద అనగా జగన్నాధపురంలో ఏడు రాత్రులుండుట పుణ్యప్రదం! సింహాచలంలో ఐదు రోజులు, అంతర్వేదిలో ఒక రాత్రి పగలు, పట్టిసంలోనూ, శ్రీ శైలంలోనూ శివరాత్రి రోజు వుండి స్నానం చేయడం భక్తి, ముక్తి, ప్రదాయకం! మధ్యాహ్న సమయంలో, సిద్ధులు చిరకాలం ఇక్కడ తపస్సు చేసి, శివుణ్ని ప్రతిష్టించాలనే సంకల్పంతో గోస్తనీ నది తీరంలో ఇక్కడ ప్రతిష్టించారు. కపిలాది సిద్ధులచే ప్రతిష్టింపబడినందున సిద్ధేశ్వర లింగమని పేరొచ్చింది.

కుమారస్వామి తారకుణ్ని సంహరించిన స్థలం 'కుమారవరం' అనే గ్రామం వెలిసింది. తణుకుకి ఆగ్నేయ దిశలో ఒకటిన్నర కిలో మీటరు దూరంలో వుందీ గ్రామం.


కుమారస్వామికి సహాయం చేయడానికి వచ్చిన దేవతలు తణుకుకి సమీపంలో విడిది ఏర్పాటు చేసుకున్నారు. అదే వేల్పుటూరుగా ఏర్పడి తర్వాత వేల్పూరు అయింది.

కుమారస్వామి వీరవిక్రమ పరాక్రమాన్ని చూసి ఇంద్రుడు దివి నుంచి భువికి వచ్చాడు. ఆ ప్రదేశమే (ఇలన్-ఇంద్రుని-పురం) ఇల్లింద్ర పర్రుగ్రామం. కుమార వరానికి దగ్గరలో వుంది.

ఆ పోరాటాన్ని చూడటానికి శ్రీ వీరభద్రస్వామి స్వయంగా వచ్చాడు. ఆ ప్రదేశమే ఈ నాటికీ 'వీరభద్రపురం' అనే పేరుతో వున్న గ్రామం.

ఒంటరిగా పోరాడుతున్న కుమారస్వామికి సహాయ పడటానికి ఉరగరాజు స్వయంగా వచ్చి విజృంభించిన ప్రదేశమే' ఉరగరాజవరం - నేడు ఉండ్రాజవరంగా పిలవబడుతోంది.

తారక సంహారంతో పరిసమాప్తి అయిన ప్రదేశం ఈనాటికీ 'దేవదానవపుంత' గా పిలవబడుతోంది. యుద్ధంలో రాక్షసులు మరణించడంతో తపోధనులకు ప్రశాంత వాతావరణం కల్పించడానికి కుమారస్వామి ఏర్పరచిన విశాల సరోవరమే 'కుమార సరస్సు' అంటారు.



శ్రీ సీతారామస్వామి ఆలయం, తణుకు

తారాకాసురుని మరణానంతరం అతని భార్యలు ఈ ప్రాంతంలో వున్న ఓ సరస్సు దగ్గర తమ మంగళ సూత్రాలను వదిలెయ్యడంతో ఆ సరస్సుని 'ముండమోపి చెరువుగా' ఇప్పుడు కూడా పిలుస్తున్నారు.

శ్రీ కేశవస్వామి వారి ఆలయంలో ధ్వజ స్తంభము మీద పురాతన శిలా శాసనాలున్నాయి. శ్రీ కృష్ణాష్టమి, దేవీ నవరాత్రులు, ముక్కోటి ఏకాదశి, మాఘశుద్ధ ఏకాదశి నాడు జరిగే స్వామి వారి కళ్యాణం ఇక్కడ ప్రధానంగా జరిగే ఉత్సవాలు !

గోస్తనీ నది ఒడ్డున రుద్రభూమిలో సుమారు వెయ్యేళ్ళక్రితం నిర్మించబడిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం. అయిదు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం. సీతారామస్వామి ఆలయం. ఇటీవలనే నిర్మించబడిన శ్రీ సూర్యనారాయణమూర్తి ఆలయం, గ్రామదేవతలు పల్లాలమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ దేవాలయాలు దర్శింపదగ్గవి.

## 18) శ్రీ రాజరాజనరేంద్రస్వామి వారి ఆలయం - తీపర్రు

నిడదవోలు - నరసాపురం బస్‌రూట్‌లో పెరవలి నుంచి నిడదవోలు వైపుకి అరున్నర కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే, మెయిన్ రోడ్‌కి అనుకుని వున్న గ్రామమే తీపర్రు. తణుకు నుంచి పన్నెండు కిలోమీటర్లు, నిడదవోలు నుంచి పద్దెనిమిది కిలోమీటర్లు దూరంలో వున్న తీపర్రుకి బస్సులో చేరుకోవచ్చు.



*శ్రీ రాజరాజనరేంద్ర స్వామి, తీపర్రు*

సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడిన పురాతన దేవాలయంలో కొలువైయున్నారు శ్రీ రాజరాజనరేంద్రస్వామి. ఇక్కడ స్వామి వారిని రాజమహేంద్రవరం రాజధానిగా చేసుకుని పరిపాలించిన శ్రీరాజ-రాజనరేంద్రుడు ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది. అందుకే స్వామి వారికి రాజ-రాజనరేంద్రస్వామి అని పేరొచ్చింది.

ప్రతిష్ఠా కాలం తెలిపే వివరాలనిబట్టియే గాక స్వామి వారి మహిమపట్ల భక్తులకు అచంచలమైన భక్తి విశ్వాసాలు వున్నందువల్లనే ఇక్కడ మహాశివరాత్రి ఘనాతిఘనంగా జరుపుతారు.


ఇదే గ్రామంలో వున్న మరో పురాతన దేవాలయం వశిష్ట గోదావరి నది ఒడ్డున వుంది. ఈ ఆలయాన్ని కట్టించి సుమారు అయిదు వందల సంవత్సరాలకంటే ఎక్కువే అయినట్లు తెలుస్తోంది.

ఇక్కడ ముఖ్య ఉత్సవం ధనుర్మాసము. కృష్ణాష్టమి, కళ్యాణం చైత్రశుద్ధ ఏకాదశి నాడు జరుగుతుంది.

గ్రామంలో శ్రీ భ్రమరాంబా మల్లిఖార్జునస్వామి దేవాలయం, శ్రీరామాలయం, శ్రీ అంజనేయస్వామి వారి ఆలయం, గ్రామదేవత చింతాలమ్మ ఆలయం కూడా దర్శించదగ్గవే. పంచముఖ, సప్తముఖ, ఏకాధ ముఖ అంజనేయ విగ్రహములున్నాయి. కోటి పత్రి పూజలు, హనుమద్వ్రతములు జరుగుతాయి.

## 19) శ్రీ ఉమా పార్వతీదేవి సహిత సోమేశ్వర స్వామి వారి దేవాలయం - ముక్కామల

తణుకు నుంచి రావులపాలెం పోయే రహదారిలో పెరవలి దాటక అయిదు కిలోమీటర్లు ప్రయాణిస్తే పెరవలి మండలములో ఉన్న గ్రామము ముక్కామల ఎదురవుతుంది.



*శ్రీ ఉమాపార్వతీదేవి సహిత సోమేశ్వర స్వామి ఆలయం, ముక్కామల*

పూర్వం కణ్వ మహర్షి ఈ ప్రాంతాని కొచ్చినప్పుడు ఇక్కడ ముక్తిదామల అనే స్త్రీ ఆయనని తనకి ముక్తి ప్రసాదించమని కోరగా ఆయన అక్కడే అగ్ని గుండాన్ని ఏర్పాటుచేసి, అగ్ని ప్రవేశం చేస్తే ముక్తి లభిస్తుందని చెప్పాడు. ఆయన ఆజ్ఞ మేరకు ముక్తిధామల అగ్నిగుండంలో ప్రవేశించి, ముక్తి పొందింది. అందుకే ఈ గ్రామానికి ముక్కామల అనే పేరు వచ్చింది. ఒకే కమలానికి మూడు కమలాలు రావడం వల్ల కూడా ముక్కామల అని పేరొచ్చిందని మరో కథ వుంది.



*గర్భగుడిలో సోమేశ్వరస్వామి*

ఇక్కడ వున్న పురాతన ఆలయంలో శ్రీ సోమేశ్వరస్వామి శ్రీ ఉమా పార్వతీదేవి సహితంగా కొలువై వున్నారు. ఇక్కడ స్వామి మూర్తిగా స్పటికలింగం.... తెల్లగా ధగ-ధగ మెరిసిపోయే ఈ స్వామి వారి ఆలయ నిర్మాణం జరిగి సుమారు అయిదు వందలసంవత్సరాలపైనే అయివుంటుంది.



గర్భగుడిలో ఉమాపార్వతి దేవి

ఇక్కడస్వామి వారు స్వయంభువు కావడమే కాదు స్వామివారు పడమర దిశగా కొలువై వుంటారు. ఈ ఆలయాన్ని మొగల్తూరు రాజావారు నిర్మించినట్లు తెలుస్తోంది.


ఇక్కడ దేవీ నవరాత్రులు శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. స్వామివారు మహా మహిమాన్వితులు కావడంతో వేలాది ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొంటారు.

గుడికి ఎదురుగా తూర్పు ముఖంగా వున్న మరో పురాతన ఆలయంలో కేశవస్వామి శ్రీదేవి భూదేవి సహితంగా కొలువై వున్నారు. ఈ దేవాలయాన్ని కూడా అయిదు వందల సంవత్సరాల క్రితం మొగల్తూరు రాజావారే నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఆంజనేయస్వామి కూడా వెలసినందు వల్ల హనుమత్ జయంతి, ముక్కోటి ఉత్సవం కూడా జరుగుతుంది.

## 20) శ్రీ ఉమా మార్కండేయ, మృకుండేశ్వరస్వామి వారి ఆలయాలు - ఖండవిల్లి

ముక్కామల గ్రామం నుంచి ఖండవిల్లి మూడు కిలోమీటర్ల దూరంలో వుంది. పెరవలి మండలం లోని ఈ గ్రామమును ప్రాచీన కాలములో ఉత్తరే శ్వరపురమని పిలిచేవారు. తర్వాత కాలంలో 'ఖండ విల్లి'గా మారినా ఈ పేరు ఎవరి కాలంలో, ఎలా వచ్చిందో మాత్రం స్పష్టంగా ఎవరికీ తెలియదు.

ఈ గ్రామంలో 'పంచలింగ క్షేత్రం' వుండటం విశేషం! సాధారణంగా ఒకే గ్రామంలో పంచలింగ క్షేత్రం వుండటం అరుదు.




శ్రీ ఉమామార్కండేయ, మృకుండేశ్వరస్వామి దేవాలయం, ఖండవిల్లి

అందువల్లనే ఈ క్షేత్రం పురాణాల్లోనే గాక, చారిత్రకంగా కూడా మంచి ప్రాముఖ్యత నొందింది.

పూర్వము వింధ్యకు దక్షిణ భాగమంతా కీకారణ్యములతోనిండి 'దండకారణ్యం' అని పిలవబడేది. ఆ ప్రాంతాన్ని ఇక్ష్వాక కుమారుడు దండుడు పరిపాలించడంతో అదిసార్థక నామ దేయమైంది. ఈ ప్రాంతం లో భార్గవుడు, అగస్త్యుడు, అత్రి, గౌతముడు, మాండవ్యుడు, కపిలుడు, పలాముని, వశిష్టాది మునులు ఆశ్రమాలు నిర్మించుకుని తపస్సు చేసుకునేవారు.

ఒక రోజు దండుడు ఆశ్రమాల్లో వున్న ఒక్కో మహర్షిని సందర్శిస్తూ, మార్గం మధ్యలో భార్గవుని కుమార్తె 'అరజ'ను చూసి మోహించి, ఆమెను బలాత్కారంగా పొందాడు. ఆ సంగతి విన్న భార్గవుడు కోపంతో దండుని రాజ్యంలో ఏడురోజులు మృత్యు వర్షం కురిసి రాజ్యం మొత్తం నాశనమై పోతుందని శపించాడు.



*గర్భగుడిలో శ్రీ ఉమామార్కండేయ, మృకండేశ్వరస్వాములు, ఖండవిల్లి*

ఆ శాపాన్ని విన్న అరజ తండ్రిని ప్రార్థించి తాను తపస్సు చేసుకునే ప్రాంతం చుట్టూ పదియోజనాల మేర ఆ మృత్యువర్షం వల్ల ఎలాంటి ప్రమాదం కలగకుండా, అదినివాసయోగ్యంగా వుండేట్లు అనుమతిని పొందింది.

అంతవరకూ దండుని రాజ్యపాలనలో సుఖశాంతులతో వున్న ఆ ప్రదేశం శాప కారణంగా దండకారణ్యం అయింది. ఈ అరణ్యం మధ్యలో ఆశ్రమమేర్పరచుకున్న గౌతమముని మహాశక్తి సంపన్నుడు.


ఒకానొక సమయంలో ఆ ఆశ్రమానికి దగ్గరలోని ప్రాంతంలో పన్నెండు సంవత్సరాలు విపరీతంగా కరువు ఏర్పడటంతో జనం అంతా విల-విల్లాడిపోయారు. వారికి గౌతముడు తన ఆశ్రమంలో వసతి కల్పించి, తన తపో మహిమతో ఏ పూటకాపూట విత్తనాలు జల్లి పంటలు పండించి వారికి భోజనాలు పెట్టి వార్ని కాపాడుతున్నాడు.

పార్వతీ దేవి శివుడు తనని అర్థ శరీరంలో నిల్పుకుని కూడా గంగను నెత్తికి ఎక్కించుకోవడంతో ఈర్ష్యాప్రదురాలై గంగకుస్థానభ్రంశం కలిగించడం ఎలా అని ఆలోచిస్తూ తన చెలికత్తెలయిన జయ, విజయలను సలహా అడిగింది. వారు సమయం కోసం ఎదురు చూస్తున్నారు.

గౌతమముని ప్రజల క్షుద్బాధని తీర్చడం గమనించిన జయ, విజయలు బక్కచిక్కిన గోవుల్లామారి ఆ మునీశ్వరుడి ఆశ్రమంలోని పంటనంతా నాశనం చేశారు. అది చూసిన గౌతముడు ఓ దర్భ నొకదాన్ని వాటిపై ప్రయోగించాడు. అది బ్రహ్మాస్త్రమై ఆ గోవులను తాకింది. ఓ గోవు అక్కడికక్కడే నేల కూలి ప్రాణాలు వదిలింది. రెండవది గౌతమ ముని ఆశ్రమానికి అయిదు యోజనముల దూరములో వున్న పలాముని ఆశ్రమములో మరణించింది.

గౌతముడు జరిగిందంతా దివ్యదృష్టితో గ్రహించి, పాపవిముక్తికై, ఈశ్వరుడ్ని తపస్సుతో మెప్పించాడు. ఈశ్వరుడు తన జటాజూటము నుండి గంగపాయ నొక దాన్ని వదిలాడు. గంగ భూలోకమునకు దిగి 'గోయూరు' అనే నేటి కొవ్వూరు చేరి, అక్కడ వున్న గోకళేబరాల పై నుంచి ప్రవహించి సాగరసంగమం చేసింది.

గంగా భవాని వియోగాన్ని సహించలేని పరమశివుడు ఆ నదీతీరంలో స్వయంభువునిగానో, స్వయం వ్యక్తునిగానో వెలసి, ఆలయ నిర్మాణములు చేయించుకున్నాడని ప్రతీతి. విశ్వేశ్వరం, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, కడిమి, సిద్ధాంతంలో వున్న ఆలయాలు అలాంటి వేనంటారు.



ముఖ మండపంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి, ఖండవిల్లి

క్రీస్తుపూర్వం 3101వ సంవత్సరంలో కురుక్షేత్రంలో పద్దెనిమిది రోజుల పాటు కురుపాండవ సంగ్రామం జరిగింది! భారత దేశంలోని రాజులంతా ఆ యుద్ధంలో ఏదో ఒక పక్షం వహించి పోరాడారు. అప్పటికే దక్షిణాదిలో మంచి పేరు ప్రఖ్యాతులు కలిగిన ఆంధ్రులు, కాళింగులు కౌరవ పక్షాన యుద్ధంలో పాల్గొన్నారు. చనిపోయిన రాజుల వంశీకులు తిరిగి తమ రాజ్యాలు చేరి పరిపాలన ప్రారంభించారు.

క్రీస్తు పూర్వం 3137వ సంవత్సరంలో శ్రీకృష్ణుడు నిర్యాణం చెందడంతో ధర్మరాజు వైరాగ్యం చెంది, రాజ్య త్యాగం చేసి అభిమన్యుని కొడుకు పరీక్షిత్తుకి పట్టాభిషేకం చేసి, భార్య, సోదరులు వెంటరాగా స్వర్గం చేరుకున్నాడు. అప్పటితో పురాణయుగం పూర్తయి, కలియుగ రాజవంశముల పాలన ప్రారంభమయింది.

దక్షిణ భారతాన మహాభారత యుద్ధకాలానికీ వెలుగులో వున్న ఆంధ్రులు, కాళింగులకు సమకాలీనులుగా కొన్ని రాజ్యాలు వచ్చాయి. ఆంధ్రలో శాతవాహనుల పాలన తర్వాత ఇక్ష్వాకులు అధికారంలోకి వచ్చారు. వారి వెనుక బృహత్పలాయనులు, తరువాత శాలంకాయనులు, అనంతరం ఆనంద గోత్రికులు, వారిని జయించి విష్ణుకుండినులు, వారిని నిర్జించి చాళుక్య రాజులు పాలించారు.

వీరు వేంగీ దేశాన్ని పాలిస్తుండగా పల్లవులు, చోళులు, కదంబులు, రాష్ట్ర కూటులు, యాదవులు ప్రత్యర్థులుగా నిలిచి, దక్షిణాదిలో చాలా ప్రాంతాలను ఆక్రమించి పాలించసాగారు.

క్రీస్తుశకం 614వ సంవత్సరంలో పీఠికాపురం రాజధానిగా వేంగీమండలాన్ని పరిపాలిస్తున్న పశ్చిమ చాళుక్య రాజశేఖరుడు పులకేశి వల్లభుని సోదరుడు కుబ్జ విష్ణువర్ధనుడు, అతని వంశస్థులు చాలా శివాలయాల్ని నిర్మించినట్టు తెలుస్తోంది.

ఈ పూర్వ చాళుక్యుల కాలంలోనే చోడులు, కోన హైహయులు, పల్లవులు వంటి రాజవంశములు వెలుగులోకి వచ్చాయి. వారి శాఖలు నిడదవోలు, జననాథపురం, తడికలపూడి వంటి ప్రదేశాల్లో చిన్న చిన్న రాజ్యాలు స్థాపించుకున్నాయి. పూర్వం చాళుక్య సామంతులుగా వ్యవహరించిన కోన హైహయులు పాలకొల్లు పరిసర ప్రాంతాల వరకూ తమ రాజ్యాలను విస్తరింపజేసి, నిడదవోలు చాళుక్యులతో వియ్యం పొందారు.



ముఖమండపంలో శ్రీ మల్లిఖార్జునస్వామి

జననాథపుర చాళుక్యులు శ్రీకూర్మం వరకూ రాజ్య విస్తరణ చేశారు. క్రీస్తుశకం 1050లో కాకతీయులు అనుమకొండ, ఓరుగల్లు రాజధానులుగా చేసుకుని యావదాంధ్ర రాజ్యభాగాన్ని జయించారు.

ఈ కాకతీయుల పాలనలో ఆంధ్రదేశం త్రిలింగదేశమని పేరు పొందింది. ఈ త్రిలింగ దేశం మధ్యలో ప్రవహించే పుణ్య గౌతమీ నదీతీరాన, రాజమండ్రి సమీపంలో కోటిలింగ క్షేత్రం వుంది. మన రాష్ట్రంలో ఇలాంటి పవిత్ర క్షేత్రం మరెక్కడా లేదు. పంచారామములలో దక్షారామం, కుమారా రామములలోని శివలింగములు రెండంతస్థుల్లో వున్నా, లింగమొకటే వుంది. సాధారణంగా ఏకలింగ ప్రతిష్ఠలే ఎక్కువ!

70,497


కానీ ఈ ఖండవిల్లిలో అయిదు శివలింగములు వున్నాయి. లోగడ ఇక్కడ శ్రీ మార్కండేశ్వర, శ్రీ ఉత్తరేశ్వర, శ్రీ జనార్ధన స్వాములుండేవారు. అయితే ఆ ఆలయాలిప్పుడు లేవు. ఒక్క మార్కండేశ్వరస్వామి ఆలయమే వుంది. ఉత్తరేశ్వర మహాదేవుడు లేడు. ఆయనే మృకండేశ్వరునిగా శ్రీ మార్కండేయుని సన్నిధిలో వున్నట్లు తెలుస్తోంది. శ్రీ మార్కండేశ్వరున్ని ప్రతిష్టించింది మార్కండేయ మహర్షి. ఆయన మృకండ మహర్షి కుమారుడు. ఆలయంలోనే వున్న మరొక స్వామి సగరేశ్వరుడు. ఆలయముఖ మంటపంలో వున్న మరో లింగరూపుడు మూలస్థాన శ్రీ మహాదేవుడు. అయిదో లింగం ఆలయ ప్రాంగణంలో వున్న పురాతన బావిలో వుంది. బావిలో వున్న శివలింగాన్ని పైకి తీయాలని ప్రయత్నించిన వారికి ఏదొక అవరోధం కలగడమేకాక, దృష్టిపోవడం కూడా జరిగింది. అప్పటి నుంచి ఆ ప్రయత్నం మానేశారంటే స్వామివారి మహిమ ఎలాంటిదో అర్ధమవుతుంది.

శ్రీ మార్కండేశ్వరస్వామికి పరివార దేవతలుగా శ్రీ విఘ్నేశ్వర, శ్రీ కుమార, శ్రీ సుబ్రహ్మణ్యస్వాములు వెలసి వున్నారు. మూలవిరాట్ అయిన శ్రీ మార్కండేశ్వరస్వామికి పానపట్టం లేదు. ఎడమ భాగంలో ఉమాదేవి, కుడివైపు మృకండేశ్వరస్వామి వున్నారు. కార్తీక మాసం, దేవీ నవరాత్రులు, మహాశివరాత్రికి స్వామి వారికి కళ్యాణం ప్రత్యేక ఉత్సవాలు.

ఖండవిల్లిలో ఒకే ఆవరణలో మూడు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలున్నాయి. గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర చూడచక్కగా వుంటుంది.

## 21) శ్రీ కేదారేశ్వర స్వామి వారి ఆలయం - సిద్ధాంతం


పెనుగొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వడలి మీదుగా ప్రయాణిస్తే ఎదురవుతుంది



శ్రీ బాలత్రిపుర సుందరి సమేత కేదారేశ్వర స్వామి ఆలయం, సిద్ధాంతం

సిద్ధాంతం గ్రామం. వశిష్ఠ గోదావరికి ఈ గ్రామం దగ్గరే వంతెన నిర్మించారు. దీన్నే సిద్ధాంతం బ్రిడ్జి అంటారు. పెనుగొండ మండలంలో వున్న ఈ గ్రామంలోని అతి ప్రాచీనమైన దేవాలయాల్లో శ్రీ కేదారేశ్వరస్వామి వెలసిన ఆలయం ఒకటి.

పూర్వం ఇక్కడ మునులు నివసించి తపస్సు చేసి సిద్ధిని పొందడంతో ఈ గ్రామానికి సిద్ధాంతం అని పేరొచ్చింది. అప్పటి మునులను అప్పటి ప్రజలు తమ అరాధన కోసం ఓ శక్తివంతమైన దేవుడ్ని ప్రతిష్ఠించమని కోరడంతో శ్రీ కేదారేశ్వరస్వామిని ప్రతిష్ఠించడం జరిగినట్లుగా తెలుస్తోంది.



*శ్రీ నందీశ్వర స్వామి ఆలయం, సిద్ధాంతం*


గోదావరి నది ఒడ్డున, ఏటిగట్టు దిగువన వున్నది ఈ ఆలయం. అక్కడ నిలబడి చూస్తే వశిష్ఠ గోదావరి మనకు కన్పిస్తుంది. స్వామి వారి కళ్యాణం మహాశివరాత్రి నాడు ఘనంగా జరుగుతుంది. ఇక్కడ పితృ దేవులకు కర్మలు నిర్వహించడం కూడా జరుగుతుంది.

ఇదే గ్రామములో శ్రీ విజయగోపాలస్వామి, శ్రీ నందేశ్వరస్వామి, శ్రీ సీత లింగేశ్వరస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి వార్ల ఆలయాలున్నాయి. ఈ దేవాలయాలు కూడా సుమారు అయిదు వందల సంవత్సరాల క్రితమే నిర్మించినట్లుగా ఆధారాలున్నాయి. ఇక్కడ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. వేలాదిమంది భక్తులు హాజరయి, తమ మొక్కులు తీర్చుకుంటుంటారు.

## 22) శ్రీ కపిల మల్లేశ్వరస్వామి వారి ఆలయం - మల్లేశ్వరం

పెరవలి మండలంలోనే వున్న మల్లేశ్వరము వశిష్ఠ గోదావరీ నదితీరంలో వుంది. నేషనల్ హైవేకి కిలోమీటర్ దూరంలోనూ, తణుకుకి దాదాపు పద్నాలుగు కిలోమీటర్లు దూరంలోనూ వుందీ గ్రామం. తణుకు నుంచి పెరవలి మీదుగా ఖండవిల్లి వచ్చి అక్కడ నుంచి అన్నవరప్పాడు మీదుగా మల్లేశ్వరం చేరుకోవచ్చు. అలాగే పెనుగొండ మీదుగా వడలి వచ్చి అక్కడ నుంచి పిట్టల వేమవరం, అన్నవరప్పాడు మీదుగా కూడా మల్లేశ్వరం చేరుకోవచ్చు.

ఇక్కడ శ్రీ కపిల మల్లేశ్వరస్వామి కొలువై వున్నారు. స్వామివారి ప్రతిష్ఠ బహు పురాతనమైనదని తెలుస్తోంది. ఇక్కడ కొన్ని శాసనాలు ఈ నాటికీ వున్నాయి. పూర్వం మహారణ్యంగా వున్న ఈ ప్రాంతాన్ని రెడ్డి రాజులు కొంతకాలం పరిపాలించారు. పశువులను గొల్లవాళ్ళు మేతకు తోలుకొని వచ్చేవారిక్కడకు. అనవేమారెడ్డి అనే రెడ్డిరాజు ఆవులు కూడా ప్రతీదినం మేతకు ఈ అడవిలోకే వచ్చేవి. ఆ ఆవుల మందలో ఓ కపిల ఆవు రోజూ పాలు ఇవ్వడం మానేసింది. ఎవరో పాలు పిండినట్లుగా కనిపించేది ఆవు.



*శ్రీ కపిల మల్లేశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరం*

అనవేమారెడ్డి మందలించడంతో పశువుల కాపరి కారణం తెల్సుకోవాలని అనుసరించాడు ఒకరోజు. ఆవు ఒక పొదలో వున్న పుట్టని సమీపించి పుట్టమీద పడుకుంది. కొంతసేపటికి అది తిరిగి మందలో కలిసింది. దాని పొదుగు చూస్తే ఎవరో పాలుపిండినట్టు కన్పించింది.


పశువుల కాపరి ఆ సంగతి అనవేమారెడ్డికి తెలియజేశాడు. ఆయన పరివారంతో అక్కడ కొచ్చి పుట్టను త్రవ్వించాడు. ఒక్క కలుగుతప్ప మరేమీ కన్పించలేదు. మరికొంత త్రవ్వగా గునపం చివర మెత్తగా గుచ్చుకున్నట్లనిపించింది. గడ్డపలుగు బయటకు తీస్తే పలుగు మొన రక్తంతో తడిసి వుంది. పనోళ్ళు మూర్ఛపోయారు.

సంగతి తెలిసి పెద్దలంతా అపరాధం మన్నించమని దేవుడ్ని ప్రార్థించి, నెమ్మదిగా మట్టి తొలగించి చూస్తే మహాలింగం కనిపించింది. పైభాగము గునపపు దెబ్బకు గాయపడి రక్తం కన్పించింది. పుట్టలో వుండి కపిల గోవుపాలు ఆరగించిన స్వామికి కపిల మల్లేశ్వరస్వామి అని పేరుపెట్టి ఆలయం కట్టించారు.

నేటికీ స్వామికి తగిలిన దెబ్బ కనిపిస్తుంది. ఈ స్వామికి నేడు వున్న భూవసతి అనవేమారెడ్డి ఇచ్చినట్లు ఇక్కడున్న శాసనాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి వైభవంగా జరుగుతుంది.

గోదావరి పొంగినప్పుడు శ్రీస్వామి వారి గర్భాలయంలో పాతాళగంగ పైకి తన్నినట్లు నీరు వస్తుంది. గోదావరి ఎక్కువగా పొంగితే స్వామి సుమారు తొమ్మిది అడుగుల లోతు నీటిలోనే వుంటాడు. ఆ సమయంలో అర్చన, నైవేద్యములు బయట నుండే జరుపుతారు. గోదావరి తగ్గగానే ఆలయంలోని నీరు తోడనవసరం లేకుండానే గర్భాలయంలో శ్రీస్వామి వారి సన్నిధిలోనే అంతరించిపోతుంది. తప్పక దర్శించవలసిన క్షేత్రం!

## 23) శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయం - వడలి



*శ్రీ పార్వతీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం, వడలి*

పెనుగొండ నుంచి సిద్ధాంతం పోయే రోడ్డులో పెనుగొండకి నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంది వడలి గ్రామం. ఈ గ్రామం పెనుకొండ మండలంలోనే వుంది. బస్ సౌకర్యం వుంది.

ఇక్కడ కొలువై వున్నారు శ్రీ అగస్త్యేశ్వర స్వామి. ఈ గ్రామంలోని ఆలయ నిర్మాణం జరిగి సుమారు వెయ్యి సంవత్సరా లకు పైనే అయినట్లు ఇక్కడ లభించిన చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

గోదావరి మండలంలో శ్రీ అగస్త్య




*గర్భగుడిలో శ్రీ అగస్త్యేశ్వరస్వామి*

ముని ఎన్నో శివలింగాలను ప్రతిష్ఠించి నట్లుగా ఆధారాలున్నాయి. అలాంటి బాణాల్లో ఇదొక లింగము. అగస్త్య మహాముని ప్రతిష్టించడంతో అగస్త్యేశ్వరస్వామి వారు అని పేరొచ్చింది.

ఇక్కడ స్వామివారికి వైశాఖ మాసములో కళ్యాణం వైభవంగా జరుగుతుంది. దేవీనవరాత్రులు, కార్తీక మాసంలో కూడా ఉత్సవాలు జరుగుతాయి. ఈ గ్రామంలో వున్న గ్రామదేవత శ్రీమంటాలమ్మ ఆలయాన్ని సుమారు మూడు వందల సంవత్సరాల క్రితం నిర్మించారు. జాతర ప్రత్యేక ఆకర్షణ.

## 24) శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం - పిట్టల వేమవరం

పెరవలికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో - పెరవలి, రావులపాలెం జాతీయ రహదారిపై ప్రయాణించి అన్నవరప్పాడు సెంటర్ నుంచి వెళితే పిట్టలవేమవరం వస్తుంది. అలాగే వడలి నుంచి రెండు కిలోమీటర్లు ప్రయాణించి నా ఈ గ్రామం చేరుకోవచ్చు.



*శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం , పిట్టలవేమవరం*

ఈ గ్రామంలో వున్న దేవాలయాల్లో శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధమైనది, పురాతనమైనది కూడా. శ్రీ సోమేశ్వరస్వామిని ఎవరు ప్రతిష్టించారో, ఎప్పుడు ప్రతిష్ఠించారో తెలియవచ్చే ఆధారాలు ఇక్కడ లభ్యంకాక పోవడం దురదృష్టకరం!

కాలగతిలో ఆ ఆధారాలు నశించివుండవచ్చు. కానీ దేవాలయ నిర్మాణరీతులను బట్టి సుమారు మూడు వందల సంవత్సరాలకు పూర్వమే నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది. మహాశివరాత్రికి, అనగా మాఘ బహుళ చతుర్థశినాడు జరిగే స్వామివారి కళ్యాణం ముఖ్య ఉత్సవం!


ఈ గ్రామంలోనే వున్న మరో ఆలయం శ్రీ సీతారామస్వామి కోవెల. సుమారు మూడు వందల సంవత్సరాల క్రితమే నిర్మించబడినట్లు తెలుస్తోంది. చైత్రశుద్ధ నవమినాడు జరిగే కళ్యాణం, జాతర ముఖ్య ఉత్సవాలు.

గ్రామదేవత శ్రీ వనుమలమ్మ వారి గుడి కూడా రెండు వందల యాభై సంవత్సరాల క్రితమే నిర్మించబడింది. అమ్మవారి జాతర చూసి తీరాల్సిందే.

ఈ గ్రామంలో వున్న మరో పురాతన ఆలయం నిర్మించి ఎనిమిది వందల సంవత్సరాలు పైనే అవుతున్నట్లు రికార్డులను బట్టి తెలుస్తోంది. ఇందులో కొలువైవున్న శ్రీ జనార్ధనస్వామి భక్తుల కోరికలను తప్పక తీర్చే మహిమాన్వితుడు. వైశాఖ శుద్ధ ఏకాదశినాడు స్వామి కళ్యాణం వైభవంగా జరుగుతుంది. ఇక్కడ వసతి సౌకర్యం లేదు.

## 25) శ్రీ కేశవస్వామివారి ఆలయం - కొఠాలపర్రు

పెనుగొండకు ఏడు కిలోమీటర్ల దూరంలో పెనుగొండ మండలంలో వున్న గ్రామం కొఠాలపర్రు. ఇక్కడ అతిపురాతనమైన శ్రీ కేశవస్వామి వారి దేవాలయం వుంది. పంచకేశవుల్లో ఒకరయిన ఈ స్వామి వశిష్ఠ గోదావరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో కొలువైయున్నారు.


శ్రీ కేశవస్వామి, కొఠాలపర్రు

దీన్ని కేశవపురి అని కూడా పిలుస్తారు. శ్రీ కేశవస్వామి స్వయం వ్యక్తుడని బ్రహ్మాండ పురాణంలో బ్రహ్మనారద సంవాద రూపంలో వర్ణించబడింది. వివరాలకు పోతే, పూర్వం పరాశర మహర్షి అఖండ గౌతమీ నదికి పశ్చిమ ప్రాంతానికి ఒకసారి వచ్చాడు. అక్కడ ప్రజల జీవన పరిస్థితులను, అధ్యాత్మిక పతనాన్ని గమనించి చాలా బాధపడి, వారు తరించే మార్గాన్ని బోధించతలిచాడు.

ఆయన పూజించే శ్రీలక్ష్మి నరసింహస్వామి విగ్రహాన్ని అక్కడ ప్రతిష్ఠించి, దానిని పూజించమని ప్రజలకు చెప్పి, తన

పూజకి మరో విగ్రహాన్ని అన్వేషిస్తూసాగాడు పరాశరుడు. ఒకచోట జగన్మోహనాకారముతో వున్న శ్రీ కేశవస్వామి విగ్రహం దొరికింది.

పరాశరుడు ఆనందంతో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి సరి అయిన ప్రదేశం కోసం గాలిస్తుండగా ఓ గ్రామం కన్పించింది. అది అన్నివిధాల అనువైన ప్రదేశంగా భావించి, మంత్రపూర్వకంగా అక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు పరాశర మహర్షి. అప్పుడు దేవతలు పుష్పవర్షము కురిపించారు.

పరాశరుడు కొంతకాలానికి ఆ విగ్రహాన్ని వదిలేసి వెళ్ళడం ఇష్టం లేక తనతో తీసుకెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. ఆ విగ్రహాన్ని పెకలించాలని ఎంత ప్రయత్నించినా అది అక్కడ నుంచి కదలలేదు. అందుకు కారణం ఏమిటో అంతుపట్టక పరాశరుడు భక్తితో శ్రీ కేశవస్వామిని పూజించాడు.

అతని ప్రార్థనని మన్నించి కొంతకాలానికి ప్రత్యక్షమయిన శ్రీ కేశవస్వామి "పరాశరా! నేనీ గ్రామ ప్రజలకు నిత్యం దర్శనం ఇవ్వడానికి ఇక్కడే శాశ్వతంగా ఉండి పోదలచుకున్నాను. నువ్వు వేరొక చోటుకి వెళ్ళిపో!" అన్నాడు.

అప్పుడు పరాశర మహర్షి స్వామికి ఆలయాన్ని కట్టించి, పూజించి, అక్కడ నిత్యారాధన చేయడానికి విష్ణుశర్మ అనే బ్రాహ్మణుడ్ని నియమించి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. ఆనాటి నుంచీ ఈ కేశవక్షేత్రం మహా పుణ్యక్షేత్రమయిపోయింది.

కలియుగం వచ్చేసరికి ఈ కేశవాలయం మరుగున పడిపోయింది. ఆ ప్రాంతమంతా అడవిగా తయారయింది. మరి కొంతకాలానికి అక్కడికి వచ్చిన ప్రజలు ఈ గ్రామాన్ని ఆలయాన్ని కనుగొన్నారు. అరణ్యమును ఛేదించి ఆలయం బయటపడింది కనుక, కొఠార ధారలు ఛేదించబడి నిర్మించబడింది కనుక కొఠారపురి అని పేరొచ్చింది.

పూర్వం విద్యాపతి అనే బ్రాహ్మణుడు సద్వంశములో జన్మించిన విద్యావంతుడు. అతనికి శలుడు, శల్యుడు అని ఇద్దరు కొడుకులు వున్నారు. శలుడు సత్పురుషుడు. తల్లిదండ్రులను భక్తితో పూజిస్తూ, తన భార్యతో సుఖంగా కాపురం చేస్తున్నాడు.

రెండోవాడు దుర్వ్యసనముల పాలయి, వ్యభిచారిగా మారి సజ్జనులను బాధపెడుతుండేవాడు. అతన్ని భరించలేని గ్రామ ప్రజలు గ్రామాన్నుండి తరిమేశారు. ఓ నీచ స్త్రీని అతను పెళ్ళాడాడు. కొంతకాలానికి అతని భార్యాబిడ్డలు కూడా అతన్ని ఏవగించుకుని ఇంటినుంచి గెంటేశారు.

శల్యుడు ఏకాకిగా దేశదేశాలు భిక్షాటన చేసుకుని తిరుగుతూ బ్రతుకుతున్నాడు. దొరికిన చోట తింటూ, దొరకనిచోట దొంగతనాలు చేస్తూ తన్నులు తింటూ, పారిపోతూ, ఎన్నో బాధలు పడుతూ చివరకు గోదావరి ఒడ్డుకి వచ్చి ఆ నీరు త్రాగి పొట్ట నింపుకుంటున్నాడు.

అప్పుడు కొఠారి పురిలో శ్రీకేశవస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. వాటిని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల్లో కలసి శల్యుడు యాత్రికుల ధనాన్ని దొంగిలించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

చివరికి ఎలాగో కొఠారపురిచేరి స్వామివారి ఆలయ ప్రాంగణంలోకి వచ్చి స్పృహతప్పిపడిపోయాడు. అక్కడ యాత్రికులు అతనికి సపర్యలు చేయగా లేచిన శల్యుడు ఆకలిబాధతో అటు-ఇటు చూశాడు. దేవాలయం ముందు బలి అన్నము కన్పించింది. దాన్ని తిందామన్న ఆశతో బలిపీఠం దగ్గరకి దేకుతూ పోయాడు.

అంతలో యాత్రికుల తొక్కిసలాటలో పడి నలిగిపోయి శల్యుడు ప్రాణాలు వదిలేశాడు. ఎన్ని పాపాలు చేసినా తుది క్షణాల్లో గోదావరి జలం త్రాగి శ్రీకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మరణించాడు. వెంటనే యమభటులు, విష్ణుభటులు వచ్చి అతన్ని తమ తమ లోకాలకు తీసుకెళ్ళడానికి ప్రయత్నించారు.

"పాపములు ఎన్ని చేసినా ఇతడు చివరి క్షణంలో కేశవక్షేత్రమున స్వామి ఆలయాన్ని దర్శించి ఆలయం దగ్గర మరణించాడు కనుక అతనికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంద"ని విష్ణుభటులు వాదించి, తమ వెంట రథంలో శల్యుని ప్రాణాన్ని తీసుకెళ్ళబోయారు.

"ఇతను మహాదుష్టుడు. ఇతను చెయ్యని పాపం లేదు. ఇతనికి స్వర్గం ఎలా లభిస్తుంది?' ' అని యమభటులు వాదించారు. వాదన అనంతరం యమభటులు యముని దగ్గరకు పోయి విషయమంతా చెప్పారు. యముడు హుటాహుటిన కొఠారపురి కొచ్చాడు. శల్యుని విడిచిపెట్టమని విష్ణుభటులను అజ్ఞాపించాడు. విష్ణుభటులు "జీవితమంతా ఎన్ని పాపాలు చేసినా పుణ్యక్షేత్రము దర్శించాడు. కేశవస్వామి ఆలయాన్ని చేరుకుని స్వామి ప్రసాదం తిన్నాడు. అతని పాపాలన్నీ అప్పుడే నశించి, విష్ణులోక ప్రాప్తికి అర్హత కలిగింది కనుక మేమే తీసుకెళతాం" అని చెప్పి శల్యుని తీసుకుపోయారు.

యముడు చేసేదేమి లేక తిరిగి యమలోకానికి వెళ్ళిపోయాడు. కేశవస్వామి ప్రసాదం తింటే చాలు స్వర్గలోకప్రాప్తి కలుగుతుందట!

ఈ కొఠారపురి రాను రాను 'కొతాలపర్రు'గా మారి దివ్యక్షేత్రమయింది. క్రీస్తుశకం 1323లో కాకతీయ రాజ్యం పతనం అయ్యాక మహమ్మదీయులు భారతదేశంలో విజృంభించి హిందువులను అనేక బాధలు పెట్టి గుడులు, గోపురాలు నాశనం చేశారు.

రెడ్డి రాజుల పరిపాలన తర్వాత ఇతర రాజులు కూడా కేశవస్వామి ఆలయానికి ఎంతో సేవ చేశారు. క్రీస్తు శకం 1766వ సంవత్సరములో శ్రీ మొగల్తూరు జమీందారు స్వామికి కొంతభూమిని నిత్యార్చనలకి ఏర్పాటు చేసి దేవాలయాన్ని అభివృద్ధి చేశాడు.

కొంతకాలానికి ఆలయ ధర్మకర్త అయిన శ్రీ వంగల వెంకటరాఘవాచార్యుల వారి ధర్మపత్నికి కలలో స్వామి కనిపించి "పుట్టలో వున్న తనని బయటకు తీసి జీర్ణోద్ధరణ చేయ"మని అజ్ఞాపించాడు. సౌమ్యనామ సంవత్సర జ్యేష్ఠ బహుళ పంచమినాడు క్రీస్తుశకం 1789వ సంవత్సరంలో శ్రీస్వామివారికి పునఃప్రతిష్ఠ జరిగింది.

అప్పటినుంచి శ్రీస్వామివారికి నిత్యపూజలు, భోగములు సక్రమంగా జరుగుతున్నాయి. కాలక్రమేణా స్వామివారి ఆలయం, ప్రాకారం, గోపురం, ఆళ్వారుల ఆలయాలు, దివ్యస్థాన మంటపము, యాగశాల, వాహనశాల, ముఖమంటపం నిర్మించడం జరిగింది.

క్రీస్తుశకం 1812లో శ్రీ భూదేవి విగ్రహాన్ని ప్రతిష్టించారు. శ్రీ వెంకటలక్ష్మి కుమారుడు శ్రీ సీతారామాచార్యులు ఆలయాన్ని ఇంకా అభివృద్ధి చేశారు. తన ఆస్తినంతా స్వామివారికి వ్రాసేశారు. క్రీ.శ. 1870లో శ్రీమాన్‌నల్లాని చక్రవర్తుల తాతాచార్యులు అను నృసింహాచార్యులు వారు ఎంబెరుమన్నారు లను ప్రతిష్టించి రామానుజాచార్య, శఠకోప ఆండాళుల విగ్రహాలు కూడా ప్రతిష్ఠ చేశారు.

స్వామివారికి బ్రహ్మోత్సవాలే గాక, తిరునక్షత్రములు, ధనుర్మాసం, కృష్ణాష్టమి, వైకుంఠ ఏకాదశి కూడా ఘనంగా జరుగుతాయి. తప్పక దర్శించాల్సిన పుణ్యక్షేత్రం కొరాలపర్రు. గ్రామం కావడంతో వసతి సౌకర్యం లేదు.

## 26) శ్రీనగరేశ్వర శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవి వారి ఆలయం - పెనుగొండ

నిడదవోలు నుంచి నరసాపురం పోవు రహదారిలో పెరవలికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో వుంది పెనుగొండ గ్రామం. అతిపురాతనమైన పెనుగొండ మండల కేంద్రం కూడా. రాజ-రాజ నరేంద్రుని కాలంలో ఈ పట్టణం 'నగరి పెనుగొండ' అని పిలువబడేది. దేవశిల్పి విశ్వకర్మయే ఈ పట్టణాన్ని నిర్మించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి.

ఇక్కడ వున్న దేవాలయంలో శ్రీనగరేశ్వరస్వామికి దక్షిణాన శ్రీ కన్యకాపరమేశ్వరి, ఉత్తరాన శ్రీపార్వతీదేవి కొలువై వున్నారు. నగరేశ్వరాలయం ఎదుట నున్న రాజగోపురం అతి సుందరంగా, చూడమనోహరంగా నిర్మించబడింది.

'వరాభయాక్ష వలయ విద్యా పుస్తక ధారిణేం
నవ వర్ణాంభ జే బాలాం కన్యకాపరమేశ్వరీ'
నగరేశ్వర స్వామి నే నమః

పూర్వం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య ఋషులంతా బ్రహ్మ దగ్గర కెళ్ళి తపస్సు చేయడానికి అనువైన నిర్మల ప్రదేశం ఏదో చెప్పమని అడిగారు. అప్పుడు బ్రహ్మవాళ్ళకో రథం ఇచ్చి "మీరీ రథంలో వెళ్ళండి. అది ఎక్కడ విరిగి పడిపోతుందో అదే పవిత్రమైన స్థలం" అని చెప్పాడు.

తర్వాత కొంత కాలానికి బ్రహ్మ సభ జేసి దేవతలను, ఋషులను రమ్మనగా అంతా సభకు హాజరయ్యారు. అప్పుడు బ్రహ్మ ఎవరు ఎంతమంది గోత్రజులు వచ్చారో చెప్పమన్నాడు. అందరికంటే ఎక్కువగా వైశ్య ఋషులు తాము 714 గోత్రజులము వచ్చామని చెప్పేసరికి బ్రహ్మ వాళ్ళని సన్మానించాడు. అప్పటి నుండి ఆ వైశ్య ఋషులకు గర్వం ఎక్కువై మిగతా ఋషులను హేళన చెయ్యడం ప్రారంభించారు.

అప్పుడా బ్రహ్మర్షులు "మీరు భూలోకంలో క్రయ, విక్రయాలు చేసుకుంటూ జీవించండి" అని శపించారు. దానితో వైశ్య ఋషులు బ్రహ్మ దగ్గరకెళ్ళి శాపవిమోచనం చెప్పమని కోరారు. బ్రహ్మ వారికి శివపంచాక్షరిని ఉపదేశించి, శివుని ఆరాధిస్తూ సుఖంగా వుండమని చెప్పాడు.

ఆవిధంగా వారు తపస్సు చేసుకుంటుండగా శివుడు ప్రత్యక్షమై ఆ వైశ్య ఋషులు కుటుంబాలతో కైలాసానికి వచ్చి నివసించడానికి అనుమతించాడు. వారు కైలాసంలో మకాం పెట్టారు.



శ్రీ నగరేశ్వర వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ గోపురం, పెనుగొండ

కొంత కాలానికి కీర్తి అనే వైశ్య కన్యని చిత్ర కంతుడు అనే గంధర్వుడు చూసి మోహించి ఆ కన్యను తనకిచ్చి వివాహం చెయ్యమని కోరాడు. అందుకు వైశ్యులు తిరస్కరించి ఆమెకు మేనరికమే చేసేశారు. అప్పుడు చిత్రకంతుడు వాళ్ళను తన మాయలతో బాధలు పెడుతూ ఓ నదిలో ముంచేశాడు. వారంతా గౌరీ దేవిని ప్రార్థించగా ఆమె కరుణ వల్ల రెండు నావలు అక్కడికొచ్చి వాళ్ళని రక్షించాయి. చిత్రకంతుడు వార్ని వెంటాడుతూ కైలాసానికొస్తే శివసేన తరిమి కొట్టిందతన్ని.

చిత్రకంతుడు ఆగ్రహంతో నన్ను మీరు పరాభవించారు గనుక ఈ కన్యకారణంగానే మీరు భూలోకంలో అగ్నిలో పడి మరణిస్తారని శపించాడు. అప్పుడు వైశ్య ఋషులు కూడా మా అగ్ని ప్రవేశం గురించి విన్న మరుక్షణం నీ తల ముక్కలయి చస్తావు అని ప్రతి శాపం ఇచ్చారు. తర్వాత ఈశ్వర సన్నిధానంలోనే కాలక్షేపం చేస్తున్నారు.

కొంతకాలం తరువాత లోకకళ్యాణార్థం ఈశ్వర కళ్యాణం జరిగినప్పుడు అన్ని లోకాల నుంచి కానుకలొచ్చాయి గానీ భూలోకం నుంచి మాత్రం రాలేదు. కారణం ఏమిటా అని యోచిస్తుండగా నారద మహర్షి వచ్చి 'ఈశ్వరా ! భూలోకంలో వైశ్యులు ఎవరూ లేరు. అంతా మీ సాన్నిధ్యంలోనే వుండటంతో క్రయ విక్రయాదులు, ధనం లేకుండా పోయాయి. అందువల్లే కానుకలు రాలేదు' అని చెప్పాడు.

ఈశ్వరుడు వైశ్యులందర్నీ భూలోకానికి వెళ్ళిపొమని ఆజ్ఞాపించాడు. అందుకు వారు ఇష్టపడక ఈశ్వరుడ్ని ప్రార్థించారు

"ఓ వైశ్యులారా ! మీకు భూలోకంలో విశ్వకర్మ పద్దెనిమిది పట్టణాల్ని నిర్మించాడు. నేను నగరేశ్వరుడనే పేరుతోనూ, పార్వతి మహిషాసురమర్ధని గాను, విష్ణుమూర్తి జనార్ధనుడిగానూ, లక్ష్మి కొనకమలగానూ, బ్రహ్మ భాస్కరాచార్యుడుగాను, భూలోకంలో మీకు ఇష్ట దైవాలుగా వెలసి మీ క్షేమాలు చూస్తుంటాం. మీరు మమ్మల్ని పూజిస్తూ సర్వభోగ భాగ్యములు పొంది తర్వాత నా సాన్నిధ్యాన్ని చేరుకుంటారు" అని చెప్పాడు శివుడు. అప్పుడు వైశ్యులంతా భూలోకానికి వచ్చేశారు. గంధర్వుడైన చిత్రకంఠుడు కూడా విష్ణువర్ధనుడనే మహారాజుగా జన్మించి రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకుని రాజ్యపాలన చేస్తున్నాడు.



*శ్రీ నగరేశ్వర వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, పెనుగొండ*

వైశ్యులలో కుసుమ గుప్తుడు ఈశ్వర దత్తమయిన పద్దెనిమిది పట్టణాలకు అధిపతిగా పెనుగొండలో వుండి పాలన చేస్తున్నాడు. ఇతని భార్య పేరు కుసుమాంబ. వీరికి సంతానం లేకపోవడంతో భాస్కరాచార్యుల ఆజ్ఞ ప్రకారం పుత్రకామేష్టి యాగం చేశారు. ఈశ్వరానుగ్రహంతో, పార్వతి అంశతో కూడిన ఓ కన్య, ఓ కుమారుడు పుట్టారు.

ఆ సమయంలో ఆకాశవాణి ఆ శిశువులకు వాసవి అనీ, విరుపాక్షుడని పేర్లు పెట్టమని చెప్పగా, కుసుమగుప్తుడు అలాగే పేర్లు పెట్టాడు. ఆ పిల్లలిద్దరూ దిన దినాభివృద్ధి చెందుతూ, సూర్యచంద్రుల్లా ప్రకాశిస్తున్నారు.

కొంతకాలానికి విష్ణువర్ధన మహారాజు దేశ పర్యాటన చేస్తూ పెనుగొండ క్షేత్రానికి రాగా కుసుమగుప్తునితో సహవైశ్యులంతా అతనికి మర్యాదలు చేసి, ఆనందింపజేశారు.

ఆ సమయంలో విష్ణువర్ధనుడు వాసవిని చూసి మోహించి, ఆమెను వివాహం చేసుకోవడానికి సామదాన భేద దండోపాయాలన్నీ ఉపయోగించాడు. అయినా ఆ ఏడు వందల పద్నాలుగు గోత్రజాలలోనూ కుసుమగుప్తునితో సహా 102 మంది గోత్రీకులు అంగీకరించలేదు. మిగతా 612 గోత్రీకులు పారిపోయారు.

అప్పుడు కుసుమగుప్తుడు రాజుకి భయపడి సభ చేసి కుమార్తె అయిన వాసవిని తన ఉద్దేశ్యమేమిటో చెప్పమని అడిగాడు ఆదిశక్తి అంశతో కూడిన వాసవి "తండ్రీ! మీరు భయపడనక్కర్లేదు. పూర్వ జన్మలో మీరు పొందిన వరము వల్ల పార్వతి అంశతో మీ కుమార్తెగా జన్మించాను. పూర్వం ఆ మహారాజుకి, మనకూ ఉన్న శాపములవల్లే ఆ రాజుకి ఈ బుద్ధి కలిగింది. కాబట్టి మీరంతా నాతో అగ్ని ప్రవేశానికి సిద్ధమవ్వండి ! ఈ సంగతి వినగానే ఆ మహారాజు తల బ్రద్ధలయిపోతుంది." అని చెప్పింది.

ఆమె ఆజ్ఞ మేరకు 102 గోత్రముల వైశ్యులు అగ్ని ప్రవేశం చేశారు. ఆ అగ్ని ప్రవేశ సమయంలో ఆ వాసవి ఈ 102 గోత్రజులకు విశ్వరూపం చూపించి సంప్రదాయ సిద్ధమయిన కొన్ని నియమాలు చెప్పింది.

ఆ విషయం విన్న విష్ణు వర్ధనుడు తల ముక్కలయి మరణించాడు. అప్పుడు వైశ్యులంతా కైలాస ప్రాప్తిని పొందారు. ఈ భూలోకమునన్నున్న బాలవైశ్యులందరితోపాటు విష్ణువర్ధన మహారాజు కుమారుడు, పితృ దేవతలు తరించటానికి, ఈశ్వర ప్రీత్యర్థం కాశీ నుంచి 102 శివలింగములు తెచ్చి శ్రీ జనార్థనస్వామి ఆలయానికి ఎదురుగా ప్రతిష్ఠించారు.

అందుకే ఆ వీధిని ఈనాటికి 'లింగాల వీధి' అని పిలుస్తుంటారు. అయితే ఆ 102 శివలింగములు మాత్రం ఇప్పుడు కన్పించవు. అక్కడక్కడ కొన్ని లింగములు మాత్రమే కన్పిస్తాయి.

అప్పటి నుండి ఈ పెనుగొండ దివ్యక్షేత్రములో వెలసిన శ్రీ నగరేశ్వరస్వామి వాసవి కన్యకాపరమేశ్వరితో కలసి సుమారు కలియుగంలో గత 2600 సంవత్సరముల నుంచి భక్తులతో ఇష్ట దైవముగా అరాధించబడుతున్నాడు.

## 27) శ్రీ జనార్థన స్వామి వారి ఆలయం - పెనుగొండ

పెనుగొండలోనే శ్రీ నగరేశ్వర వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయానికి కొద్ది దూరంలో వున్న



శ్రీ జనార్థనస్వామి ఆలయం, పెనుగొండ

లింగాల వీధిలో కొలువైయున్నారు శ్రీ జనార్ధనస్వామి. ఇప్పుడు వున్న ఆలయం నిర్మించి సుమారు వెయ్యి సంవత్సరాలయి వుంటుందని మాత్రం తెలుస్తోంది! ఈ వెయ్యి సంవత్సరాల కాలంలో ఎన్నిమార్లు జీర్ణోద్ధరణ జరిగిందో. పునః ప్రతిష్ఠలేమయినా జరిగాయో తెలియజేసే వివరాలు మాత్రం ఇక్కడ అందుబాటులో లేవు.

అయితే శ్రీ జనార్ధనస్వామి ఈనాడు వెలసినవారు కాదని, శ్రీ నగరేశ్వరస్వామితోపాటే ఇక్కడ వెలసినట్లుగా భావించవచ్చు. ఎందుకంటే శివకేశవులు ఎక్కడ వెలసినా కలసి వుంటారే తప్ప ఒంటరిగా మాత్రం వుండరని పురాణాలు చెబుతున్నాయి.


పెనుగొండ వచ్చినవారు అమ్మవారితోపాటు శ్రీ జనార్ధన స్వామిని దర్శించుకోవడం కూడా ఆనవాయితీగా వస్తోంది. చరిత్ర ప్రసిద్ధమయిన ఈ దివ్య క్షేత్రాన్ని తప్పక దర్శించాలి భక్తులు. వసతి సౌకర్యం వుంది.

## 28) శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం - పాలకొల్లు

పాలకొల్లు పట్టణమేకాదు, రైల్వే స్టేషన్ వున్న ఒక వాణిజ్య కేంద్రం. లోగడ ఈ పాలకొల్లుని క్షీరారామం అనిపిలిచేవారు. బస్‌స్టాండు ప్రక్కనే అంబరాన్ని అంటుతున్నట్లుగా కన్పిస్తుంది శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి వారి ఆలయ గోపురం. అదే పాలకొల్లు గోపురంగా ప్రసిద్ధి చెందింది.

ఈ క్షీరారామ క్షేత్ర మహిమను మొట్టమొదట పార్వతీదేవి కుమారస్వామికి వివరించింది. తరువాత అగస్త్యుడి ద్వారా సూతుడు అనే మహా ఋషి విని నైమిశారణ్యంలో మిగిలిన మునులందరికీ చెప్పాడు.

పూర్వం పాలసముద్రంలో పుట్టిన అమృత మహాలింగాన్ని తారకాసురుడు గొప్ప భక్తి శ్రద్ధలతో పూజిస్తూ, అందువల్ల వచ్చిన శక్తిసామర్థ్యాలతో దేవతల్ని పీడిస్తుండేవాడు. అప్పుడు దేవతలు, మునులు కోరికపై కుమారస్వామి తారకాసురుని సంహరించి, అతన్ని రక్షిస్తున్న అవర తారకమైన లింగమును ముక్కలుగా చేశాడు. అది 5 ముక్కలై ఇంద్రవనంలో చాలా కాలం వుండి పోయాయి.




శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ గోపురం, పాలకొల్లు

ఒకనాడు దేవేంద్రుడు ఐరావతం మీద ఆ దారిలో వస్తుండగా అప్పుడు అక్కడ వున్న మఱ్ఱిచెట్టుని చూసి ఐరావతం దానికి ప్రదక్షిణం చేసింది. అందుకు కారణం ఏమిటని ఆ గజమును అడిగాడు ఇంద్రుడు.

పూర్వం తారకునిచే పూజించబడిన శివలింగము పంచఖండములుగా ఇక్కడ పడివుండటంతో, పరమపూజ్యమైన ఈ భూమికి మొక్కానని చెప్పింది ఐరావతం. దేవేంద్రుని ఆజ్ఞమేరకు ఐరావతం ఆ వట వృక్షాన్ని పెల్లగించగా అందులో అమృతలింగం యొక్క నాలుగు ముక్కలే కన్పించాయి.

దేవేంద్రుడు ఆ మఱ్ఱి చెట్టుని గయలో పితృముక్తికరముగా నాటి దానికి, 'అక్షయవటం' అని పేరు పెట్టాడు. ఈ నాటికీ గయలో అక్కడ పింద ప్రధానం చేస్తే పితృదేవతలు ముక్తిని పొందుతారన్న విశ్వాసం హిందువులకుంది. ఐదవ ఖండం అద్భుతలింగం కావడంతో అదికనబడలేదు.



శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం, పాలకొల్లు

అభవ్య లింగము యొక్క ఖండముల్లో ఒక దాన్ని ఇంద్రుడు కృష్ణా నదీ తీరంలో గల ధరణాలకోట (అమరావతి)లో ప్రతిష్టించి ఒక సంవత్సరంపాటు అక్కడ తపస్సు చేసి తను అహల్యతో కూడిన పాపాన్ని పొగొట్టుకున్నాడు. పంచారామాల్లో ఒకటి అయిన అమరావతిలో స్వామి పేరు అమరేశ్వరుడు. ఆయనని పూజించిన వారికి కామ దోషములు నశించి సకల శుభాలు సమకూరుతాయని చెబుతారు. అది "అమరారామము".

మరొక లింగ ఖండమును కుమారస్వామి తుల్యభాగ నదీ తీరములో గల చాళుక్య వంశ రాజధాని అయిన చాళుక్య భీమవర గ్రామములో ప్రతిష్ఠించి తను శివలింగాన్ని ఛేదించిన దోషాన్ని పొగొట్టుకున్నాడు. ఆ శివుని పేరు కుమార భీమేశ్వరుడు. ఆయనని కొలిచిన వారికి బ్రహ్మహత్య ఘోరపాతకములు అంటవు. అదియే కుమార రామము (సామర్లకోట).

మరో ఖండమును సూర్యభగవానుడు శంకరుని మొదటి మామ దక్షునికి నిలయమై దక్షారామమని పేరు గాంచిన పుణ్యస్థలములో ప్రతిష్ఠించి దానికి భీమలింగమని పేరు పెట్టి వివిధ

నదీ జలాలు తెచ్చి అభిషేకం చేశాడు. ఆ ద్రాక్షారామ భీమేశ్వరుని దర్శించి అర్చన చేసిన వారికి సకల పాపాలు సమసిపోతాయి. అక్కడకు సప్తమునులు తీసుకొచ్చిన సప్తగోదావరిలో మునిగిస్నానం చేసిన వాళ్ళకు అష్టసిద్ధులు లభిస్తాయి. ఆయన చరిత్రని చదివినవారికి సత్వరం విజయం కలుగుతుంది. అదే నేటి ద్రాక్షారామము.

నాలుగో ఖండాన్ని చంద్రుడు గునుపూడి గ్రామంలో ప్రతిష్టించి, అక్కడ తపస్సు చేసి పూర్వం తన గురుపత్నిని కూడిన పాపాన్ని బాపుకున్నాడు. ఆ శివునికి సోమనాధుడు అనిపేరు. అదే సోమారామం (భీమవరంలోగల గునుపూడి).

కొంతకాలం తర్వాత నారదుడు శ్రీహరి దగ్గరకెళ్ళి అద్భుత లింగములోని అయిదు ఖండములలో శిఖరంగల మహాలింగం మిగిలి వుంది. తామే పూజించతగింది అని చెప్పాడు. శ్రీహరి సకలసురగణ సమేతుడై గరుత్మంతునిపై ఎక్కి వచ్చి ఆ అమృతలింగాన్ని తీసుకుని వశిష్ఠ గోదావరికి పశ్చిమంలో వున్న ఓ గొప్ప తోటలో దానిని ప్రతిష్టించి, అక్కడ పాలుగల చెట్లు అధికంగా వుండటంతో 'దుగ్ధోపవనము' అని పేరెట్టాడు. ఆ శివుడే శ్రీరామ లింగేశ్వరుడు.

క్షీరారామములో చరించుట శివునికి ప్రదక్షిణం చేసినట్లుగానూ, పలికెడి పలుకులు 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షర మంత్రజపాన్ని చేసినట్లుగానూ, నిద్ర సమాధిగానూ, తిన్న పదార్థాలు అమృతమనీ, విషయ సుఖాలు ఈశ్వర సపర్యలుగా భావించబడును.

"శ్రీశైలములో నూరు పక్షములు, గయలో ఎనభై ఘడియలు, కేదారనాథ్‌లో నూరు సంవత్సరాలు, రామేశ్వరములో వెయ్యేళ్ళు, కంచిలో ఐదు సంవత్సరాలు, కుంభకోణంలో పదేళ్ళు, హరిద్వారములో ఎనిమిది సంవత్సరాలు, కాళహస్తిలో ఆరు వందల ఏళ్ళు, పట్టి సీమలో ఐదేళ్ళు, శివునిపట్ల నిండు భక్తితో ఉండే భక్తునికి కలిగే ఫలము అంతా అదే భక్తితో ఈ క్షీరారామములో ఒక్క నిద్ర సలిపితే కలుగుతుందని" చెప్పి శ్రీహరి తన సుదర్శన చక్రంతో రామేశ్వరగుండాన్ని ఏర్పరచి "ఇందులోని నీరు ఆకాశగంగే! గోవధ, బ్రహ్మహత్య, శిశుహత్య, అబద్ధాలు ఆడటంవల్ల వచ్చే దోషాలన్నీ ఇందులో స్నానం చేసి, రామలింగేశ్వర దర్శనం చేసుకుంటేపోతాయి" అని చెప్పాడు.

దేవతల కోరికపై శ్రీహరి ఇక్కడ జనార్ధనుడుగా వెలిచాడు. ఈ గ్రామానికి పాలకొల్లు అని పేరు రావడానికి కారణం సూతుడిలా చెప్పాడు.

గౌతముడు మహా తపస్సు చేసి విష్ణు పాదము నుంచి జన్మించిన గోదావరిని భూమ్మీదకు తీసుకొచ్చాడు. దాని తీరములో సప్తఋషులు తపస్సు చేశారు. వారిలో వశిష్టుడు తన మహిమతో క్షీరారామములో భీమేశ్వరుడ్ని ప్రతిష్టించాడు. ఆ దేవాలయానికి దగ్గరలో కౌశికుడు అనే బ్రాహ్మణుడుండేవాడు.

అతనికి సంపదలు ఎన్ని వున్నా కుమారుడు లేకపోవడం కొరతగా నిలిచిపోయింది. కొడుకు లేకపోతే పితృఋణం ఎవరు తీరుస్తారు? అని బాధపడుతూ, శ్రీ భీమేశ్వరుడ్ని మనసులో నిలిపి గాఢ తపస్సు చేశాడు. భీమేశ్వర కటాక్షంతో ఆయనకు కొడుకు పుట్టాడు. అప్పటి నుంచి బ్రాహ్మణుడి సంపద క్షీణించడం ప్రారంభించింది. అయినా కౌశిక దంపతులు ఆ బాలుడ్ని గారాబంగానే పెంచారు. ఓ రోజున ఆ బాలుడు తల్లి దగ్గరకొచ్చి 'అమ్మా! ఈ రోజు మన గ్రామంలో కుర్రాళ్ళంతా పాలు పోసుకుని అన్నం తిని వచ్చారు. నాకు కూడా అన్నంలో పాలు పోసి పెట్టమని' అడిగాడు.

ఆ పేదరాలి సలహా మేరకు ఆ బాలుడు భీమేశ్వరుని దగ్గరకెళ్ళి 'శంకరా! దయచేసి నాకు పాలుకావాలి! అంతవరకూ నీ దగ్గరే పడి వుంటాను' అన్నాడు. శివుడు సంతోషించి తన శూలముతో ఒక పుష్కరిణి సృష్టించాడు. అందులో పాలు పుట్టాయి. పాలసముద్రంతో సమానమైన ఆ పాల కొలను భక్తుడైన ఉపమన్యునికి ఇచ్చాడు.

అప్పటినుంచి ఈ పురాన్ని 'పాలకొలను' అని, 'ఉపమన్యపురం' అని పిలిచేవారు. కాలక్రమేణా పాలకొల్లు అయింది.

ఇక్కడ స్వామిని శ్రీరామచంద్రుడు ప్రతిష్టించాడని శ్రీనాథ మహాకవి తన భీమేశ్వర పురాణంలో వివరించాడు. ఆలయంలోని చాలా శిలాశాసనాల్లో స్వామిని 'క్షీరా రామేశ్వరుడు'గా పేర్కొని వుంది.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీ జగన్నాథస్వామి, పార్వతీదేవి, విఘ్నేశ్వరుడు, వీరభద్రుడు, కుమారస్వామి,కాలభైరవుడు, దత్తాత్రేయుడు విగ్రహాలున్నాయి.

ఈ ఆలయ రాజగోపురం 120 అడుగులు ఎత్తుతో, అపురూపం అయిన శిల్పకళను స్వంతం చేసుకుంది. శివలీలలు, నృత్య భంగిమలు, ఎన్నో విగ్రహములు దీనిపై వున్నాయి. క్రీస్తుశకం 1415లో శ్రీ అల్లాడురెడ్డి భూపాలుడు ఈ ఆలయగోపురాన్ని నిర్మించినట్లు శిలాశాసనము వుండేది. క్రీస్తుశకం 1157లో వెలనాటి చోళరాజు భార్యగుండాంబిక అఖండ దీపానికి దానమిచ్చింది. శాలివాహన శక సంవత్సరం 1198లో కోనగణపతి దేవ మహారాజు నాట్యమంటపానికి కంచు తలుపులు పెట్టించాడు., చెళ్ళ పిన్నమనేని నరహరినేని కళ్యాణ మంటపాన్నికట్టించాడు. క్రీస్తుశకం 1777లో బచ్చు అమ్మయ్య గోపురాన్ని పూర్తి చేయించాడు.

సర్వలోకాశ్రయ విష్ణువర్థన మహారాజు ఉపేంద్ర చక్రవర్తి కుమారులు నారాయణ చక్రవర్తి శాసనం వ్రాయించాడు. క్షీరా రామేశ్వరుడు కొప్పేశ్వరుడని కూడా ఓ శాసనములో వుంది. నన్నయ్య, తిక్కన, శ్రీనాధుడు వంటి మహాకవులు ఎందరో ఈ ఆలయాన్ని దర్శించుకుని పునీతులయ్యారు.

పాలకొల్లులో వున్న మరో పురాతన దేవాలయంలో శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారు కొలువై వున్నాడు. ఇది క్రీస్తుశకం 1773లో నిర్మించబడింది. ఎనిమిది చేతులు కలిగిన ఈ లక్ష్మీనారాయణ విగ్రహం అతిసుందరమైనది.

ఇంకా శ్రీపాండు రంగస్వామి ఆలయం, శ్రీ సీతారామస్వామి ఆలయం, శ్రీ మామిళ్ళమ్మ గుడి చూడాల్సిన క్షేత్రాలు! వసతి సౌకర్యాలు వున్నాయి.

## 29) శ్రీ ఉమారామేశ్వరస్వామి వారి ఆలయం - ఆచంట

భీమవరం, పాలకొల్లు, మార్టేరుల నుంచి ఆచంట గ్రామం చేరుకోవచ్చు. ఆచంట మండల కేంద్రం కూడా. మార్టేరుకి పది కిలోమీటర్లు, పాలకొల్లుకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న ఆచంటలో శ్రీ ఉమారామేశ్వరస్వామి కొలువై వున్నారు.

ఆచంటకు అయిదు కిలోమీటర్లు దూరంలో కోడేరు దగ్గర వశిష్ట గోదావరి వుంది. పూర్వం శృంగవరపు కోట దానశాసన గ్రహీత మాతృవర్మ ఈ ఆచంట గ్రామానికి చెందినవాడే! ఇతడు

క్రీస్తుశకము 465-85 ప్రాంతములవాడు. క్రీ.శ. 481లో కూడా ఆచంట ప్రసిద్ధిలోనే వుంది. క్రీ.శ. 1256లో ఆచంట సూరపరాజునకు అప్పటి ప్రభువు మైలారదేవిని ఇచ్చి పెళ్ళి చేస్తూ, ఆచంట శ్రీరామేశ్వరునికి ఫోక తోటల్ని సమర్పించినట్లు శాసనాలున్నాయి. బమ్మెరపోతన వంశీయుడగు అజ్జరపు పేరయ కవి క్రీ.శ. 1890 లో రచించిన 'ఒడయనంబి విలాసము' అనే ప్రబంధము శ్రీ ఆచంటేశ్వరుని క్షేత్ర మహాత్యానికి మూల గ్రంథము.




శ్రీ ఉమారామేశ్వర స్వామి ఆలయ గోపురం, ఆచంట

ఆచంటను లోగడ మార్తాండపురము అని పిలిచేవారు. పూర్వము అచ్యుత ముని దంపతులు పార్వతీ పరమేశ్వరులను దర్శించి, వారిని ప్రార్థించి తాము పరమేశ్వరునిలో లీనమవ్వడానికి అనుగ్రహించమని అడిగారు. 'ఈ జన్మలో మీకు ఆ ప్రాప్తిలేదు. మరుజన్మలో మీ కోరిక తీరుతుంది !' అని శెలవిచ్చారు పరమేశ్వరుడు.

తర్వాత ఒకరోజు పార్వతీ పరమేశ్వరులు ఏకాంతంగా ఓ మండపంలో ఉన్నారు. ఇదే సమయమనుకొని ఆ దంపతులు వారి దగ్గర కొచ్చి, తమ ముఖాలను ఓ అద్దములో చూసుకుంటున్నారు. మహేశ్వరుడు వాళ్ళని చూసి జాలిపడి వాళ్ళకి సుందర రూపం ప్రసాదించి, పుష్పసుందరుడు, పుష్పసుందరి అని పేర్లు పెట్టాడు. తన పూజకి ప్రతీ దినము పుష్పాలు సేకరించి తెమ్మని వాళ్ళను ఆజ్ఞాపించాడు.

కొంతకాలముపాటు దంపతులు ఆ పనిని శ్రద్ధగా నెరవేర్చారు. ఒకరోజున వాళ్ళు పుష్పాలు తెచ్చి ఈశ్వరుని సన్నిధిలో ఉంచి శృంగార క్రీడలో మునిగిపోయారు. అదిచూసిన శివుడు ఆగ్రహించి వారిని భూలోకంలో పుట్టమని శపించాడు.

ఆ ఇద్దరూ స్వామివారి పాదాల మీద పడి క్షమించమని ప్రార్థించగా శివుడు జాలిపడి "కామమోహములను గెలవనిదే శివ సాన్నిధ్యం చేరలేరు. అందుకు నీవు విప్రుడిగానూ, ఆమె వేశ్యకాంతగానూ జన్మించక తప్పదు. అయితే ఒక్క జన్మలోనే మీరు సాన్నిధ్యాన్ని పొందుతారు' అని చెప్పాడు.



పాలంకృత రామలింగేశ్వరస్వామి ఆలయం, అవంతి


శివ శాపం వల్ల పుష్పవంతుడు తిరువళ్ళూరు పురములోని 'జడయనారు, పుణ్యశీల దంపతులకు' ఒడయనంబి'గా జన్మించాడు. అదే తిరువళ్ళూరుపురములో కలహవల్లి అనే వేశ్యకు 'పరమనాచి'గా పుష్పసుందరి జన్మించింది. ఒడయనంబి మహా భక్తుడు. ఒడయనంబికి ఉపనయనము వయస్సు వచ్చింది. ఈశ్వరుడు వాల్మీకి అనే బ్రాహ్మణ వేషంలో అక్కడికొచ్చాడు. జడయనారు ఆయనకు సేవలు చేశాడు. తర్వాత ఈశ్వరుడు ఒడయనంబి తన బిడ్డదని, కాంచీపురంలో జడయనారు తనకు అమ్మివేశాడని అక్కడి వారందరికి రుజువులు చూపించి తన వెంట తీసుకుపోతాడు.

అక్కడ ఉపనయనము చేసి, ఆత్మలింగము ఇచ్చి పరమనాచి, ఒడయనంబిల మధ్య ప్రేమానురాగాలు కల్పించి వారి భోగాలకు ధనం ఇచ్చాడు. ఒడయనంబి ప్రతీరోజు శివార్చన చేస్తే పిల్లలు లేనివారికి శివుడు సంతానాన్నిస్తాడని చెప్పేవాడు.

ఒక రోజు ఓ బాలుడు నదిలో స్నానం చేస్తుండగా, అతన్ని మొసలి పట్టుకుంది. నంబి ఆ బాలుడ్ని రక్షించి అతని తల్లిదండ్రులకు అప్పగించాడు. మరోరోజు అతను పాదరక్షలతో శివాలయంలోకి వెళ్ళగా అక్కడ అర్చకులు కోప్పడ్డారు. 'చిత్తము శివుని మీదా, భక్తి చెప్పుల మీదా ఎందుకు ? చిత్తశుద్ధిలేని శివపూజ ఎందుకు ?' అని వారికి జ్ఞానోపదేశం చేశాడు ఒడయనంబి.

వారికి ఈశ్వర సాక్షాత్కారం కలిగించి, మిరిమండి నయనార్ అనే వాడికి శివ సాయుజ్యం కలిగించాడు.

తర్వాత కొంతకాలానికి పరమనాచి తల్లి కలహవల్లి చనిపోయింది. పరమనాచి, ఒడయనంబి కలిసి దివ్యక్షేత్రాలు ఎన్నో సందర్శించి, ఓ ప్రదేశంలో ఓ మందిరం నిర్మించుకొని కొంతకాలం గడిపారు. భౌతిక సుఖాలననుభవిస్తూ కొంతకాలం గడిపారు.



గర్భగుడిలో సాలంకృత రామలింగేశ్వరుడు, ఆచంట

ఒకనాడు శివపూజా సమయం సమీపించినా నంబి నిద్రనుంచి లేవ లేదు. అంతలో తెల్లవారి పోయింది. పూజా సమయం సమీపించాక నంబి కి మెలకువ వచ్చింది. కానీ అక్కడ పూజించడానికి శివలింగము లేదు.

గాఢనిద్రలో ఉన్న భార్య కుచమే అతనికి శివలింగములా అన్పించింది. నంబి ఆమె కుచమునే ఈశ్వర లింగముగా భావించి పూజ చేశాడు. అంతలో పరమనాచి నిద్రలేచింది. భర్త చేస్తున్న పనికి ఖిన్నురాలై, హేళన చేసింది.

కానీ అదేమీ పట్టించుకోకుండా నిశ్చల భక్తితో ఒడయనంబి శివుడ్ని ప్రార్థించగా శివుడు ప్రత్యక్షమయ్యాడు. ఆచంటిని ఈశ్వరుడు సాక్షాత్కరించడంతో ఇక్కడ ఈశ్వరుడు ఆచంటేశ్వరుడు అయ్యాడు.

ఈ క్షేత్రమహాత్మ్యం గురించి ఇంకో పురాణం కూడా ఉంది. ఇరువురు మిత్రులు శ్రీశైలంలో శివరాత్రికి మల్లిఖార్జునుడ్ని దర్శించి ఆరాధించాలనుకున్నారు. కానీ వారిలో ఒక్కడే శ్రీశైలం చేరుకోగలిగాడు. రెండో మిత్రుడు తన ఇంటిలోనే వున్నాడు. శివరాత్రి వచ్చేసింది.

ఆ రాత్రి శ్రీ శైలంలో స్వామి సన్నిధిలో ఓ మిత్రుడు, స్వగృహంలో భార్యాబిడ్డల దగ్గర ఇంకో

మిత్రుడు ఉన్నారు. శ్రీశైలంలోని మిత్రుడు, 'ఆహా! నా మిత్రుడు ఇంటి దగ్గర భార్యాబిడ్డలతో హాయిగా కాలం గడుపుతున్నాడు. నేనేమో అడవుల్లో తిరిగి తిరిగి ఇక్కడకు చేరుకున్నాను. ఇంటి దగ్గర ఉన్న నా మిత్రుని భాగ్యమే భాగ్యము" అని అనుకుంటున్న అతను ఈశ్వర సన్నిధానములోనే ఉన్నా మనసు మాత్రం అక్కడ లేదు.

శ్రీశైల యాత్ర చెయ్యలేకపోయిన మిత్రుడు "అదృష్టమంటే నా మిత్రుడిదే! నాకు ఆ భాగ్యం లేదు. శ్రీశైల మల్లిఖార్జునుని దర్శించి ఆయన్ని సేవిస్తూ ఉన్నాడిప్పుడు!" అనుకుంటున్న అతని మనసు మల్లిఖార్జునుడి మీదే నిలిచి ఉంది.

శ్రీశైలము వెళ్ళిన తన స్నేహితుని గురించి తలపోసి తుదకు తన ప్రక్కనే నిద్రిస్తున్న భార్య స్తనమును ఈశ్వర భావనతో పూజించాడు. అతనికి ఈశ్వరానుగ్రహం కలిగింది. ఈశ్వరుడు ఆ స్థనములోనే ఆవిర్భించాడు. ఆనాటినుంచి ఆయన అచంటేశ్వరుడయ్యాడు.

ఈ క్షేత్రములో ఒక సంవత్సరముపాటు తెల్లవారుజామున స్నానం చేస్తే కుష్టురోగము కూడా నశించిందని చెబుతారు. శ్రీస్వామి పేరున ఆచంట నివాసి శ్రీ మేకా బాపన్న పంతులు క్రీ.శ. 1850లో 108 పద్యముల శతకం రచించాడు. సుమారు 200 సంవత్సరాలకు పూర్వము మేకానాగయ్య అనే వ్యక్తి ఈ స్వామికి అభిషేకము చేయగా అతని పొలములో మాత్రమే వర్షము కురిసిందట!

శ్రీ రామేశ్వరస్వామి ఆలయ ముఖద్వారంలో అతి సుందరమైన రాజగోపురం వుంది. లోపల సరస్వతీదేవి, సూర్యభగవానుడు, చిత్ర గణపతి, సప్తమాతృకలు, బ్రహ్మ వీరభద్రుడు, విశ్వేశ్వరుడు, కమతేశ్వరుడు, లక్ష్మణేశ్వరుడు, కనకదుర్గ, క్షేత్రపతి మార్తాండేశ్వరుడు, భృంగి, చండి పరివార దేవతలు దర్శనమిస్తారు. ఈశాన్య భాగములో శ్రీరమాసహిత శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం వుంది.


ఆలయముఖ మంటపంలో ఒక పెద్ద నంది, మంటపంలో దక్షిణాభిముఖంగా శ్రీ ఉమాదేవి, లోపలస్తనాకృతిగా ప్రాఙ్ముఖముగా ఆచంటేశ్వరుడు ఉన్నారు. పరశురాముడు, శ్రీరామచంద్రుడు ఈ క్షేత్రాన్ని దర్శించినట్లు స్థలపురాణం చెబుతోంది.

ఇక్కడ ప్రతిరోజు ఉమాదేవికి సహస్రకుంకుమార్చన జరుగుతుంది. ఆలయగోపురాన్ని ఆచంట గ్రామ కాపురస్తులు కొచ్చర్ల కోటరాజుగారు కట్టించినట్లు తెలుస్తోంది. ఇక్కడ కార్తీకమాసంలో అఖండ జగజ్యోతి (కర్పూర హారతి) ఆవునేతితో వెలిగిస్తారు. ఈ జ్యోతి సుమారు నెలరోజులు అఖండంగా వెలుగుతుంది. స్వామివారి కళ్యాణం మాఘమాసంలో జరుగుతుంది. అన్నదానం చేస్తారు. ఆలయ అభివృద్ధి చూస్తుంటే ఇక్కడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ సి.హెచ్. హరనాధ్ ప్రభాకరరావు, ఎమ్.ఎ., బి.ఎల్., ఎంతగా కృషి చేస్తున్నారో తెలుస్తోంది.

ఈ గ్రామంలో వున్న శ్రీమదనగోపాలస్వామివారి ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం కూడా పురాతనమైనవే గాక తప్పక దర్శించతగ్గ ఆలయాలు!

## 30) శ్రీ పార్వతీ సహిత శ్రీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం - రుస్తుంబాద

నరసాపురం పట్టణాన్ని ఆనుకుని ఆ పట్టణంలో ఒక భాగంగా కలిసి పోయినట్లుండే గ్రామం రుస్తుంబాద! నర్సాపురానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రుస్తుంబాదలో కొలువై వున్నారు శ్రీ పార్వతీ సహిత శ్రీ విశ్వేశ్వరస్వామివారు. సుమారుగా 1800 సంవత్సరముల ప్రాంతంలో ఈ శివాలయాన్ని శ్రీ శరభయ్యగారు నిర్మించారు. 1910వ సంవత్సరములో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు స్వాధీనం చేసుకుని శ్రీ అయ్యగారు సుబ్బారావు గారుతో ట్రస్టీ బోర్డ్ ఏర్పాటు చేశారు.



*శ్రీ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయం, రుస్తుంబాద*

దేవస్థానం మీద వచ్చే ఆదాయాన్ని జాగ్రత్త చేసి, దేవస్థాన ఆస్తులను కంట్రోలు చేసి పార్వతీదేవికి ఆలయం కట్టించి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ప్రహారీగోడతో పాటు ధ్వజస్తంభం, ముఖమంటపం కూడా నిర్మాణం చేశారు. భక్తుల సహకారంతో బావిని త్రవ్వించడం, అమ్మవారికి, శివుడికి మకరతోరణాలు ఏర్పాటు చేయడం జరిగింది.

స్వామివారికి జ్యేష్ఠ శుద్ధ శుక్ల పక్షములో కళ్యాణం జరుగుతుంది.

## 31) శ్రీ జగన్నాధస్వామి వారి ఆలయం - రుస్తుంబాద

ఇదే గ్రామములో సుమారు రెండు మూడు వందల సంవత్సరాలకు పూర్వం నిర్మించబడిన వైష్ణవ ఆలయంలో శ్రీ జగన్నాధ స్వామి బలభద్రుడు, సుభద్రలు కొలువై వున్నారు. ఈ మూలవిరాట్‌లు పూరిలోని జగన్నాధుడు మాదిరిగా వుంటాయి.

పురాతనమైన ఈ ఆలయంలోని స్వామి మహిమాన్వితుడు కావడంతో ఈ దేవాలయానికి పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా భక్తులు తమ భక్తి మేరకు స్వామివారి వేడుకలు జరిపిస్తుంటారు.




శ్రీ జగన్నాథస్వామి వారి ఆలయం, రుస్తుంబాద

మూడు వందల సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం పాడయిపోయి, కూలిపోవడం వలన ప్రస్తుతం ఆలయ నిర్వాహకులు ధ్వజస్తంభం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆషాఢమాసంలో స్వామివారి కళ్యాణోత్సవం బహు వైభవంగా జరుగుతుంది.

## 32) శ్రీ రాజగోపాలస్వామి వారి ఆలయం - నరసాపురం



శ్రీ రాజగోపాలస్వామి వారి ఆలయం, నరసాపురం

నరసాపురం పట్టణంలో శ్రీలక్ష్మీరాధా, రుక్మిణీ, సత్యభామా సమేతులై, చతుర్భుజులై, శంఖ చక్రధారియై వేణువు, మత్స్య, కూర్మాది శుభలక్షణయుతులైన శ్రీరాజగోపాలస్వామి కొలువై వున్నారు.

ధృవ, కీతుక, ఉత్సవ, స్వపన, బలిచేర పంచమూర్త్యాత్మకంగా, శ్రీ వైఖాన సాగమోక్త అర్చా స్వరూపులుగా విలసిల్లుతూ, భక్తజనుల అభీష్ట ప్రదాయకులైన శ్రీ రాజగోపాలస్వామి స్థల పురాణాన్ని బట్టి ఈ దేవాలయం చాలా పురాతనమైనదని తెలుస్తోంది.

పూర్వం 14వ శతాబ్దంలో ప్రస్తుత అర్చక కుటుంబంలోని ఒకరు రాజోలు వెళ్ళివస్తూ గోదావరి తీరంలో ఎట్టి పూజాధికాలు లేకుండా పడివున్న మూలవిరాట్‌ని చూసి ఆ విగ్రహాన్ని తెచ్చి అప్పటి జమీందారులైన బేటి వీరన్నగార్ని ఆశ్రయించి వశిష్టా నదితీరంలో (ప్రస్తుత రేవు) పార్వతీ సమేతులైన అమరేశ్వరస్వామి వార్ని వైష్ణవ క్షేత్రంలో భక్తజనులైన ఆళ్వారాదులతో ప్రతిష్టించి సేవించి తరించారు. తర్వాత 1700 సంవత్సర ప్రాంతంలో గోదావరి ప్రవాహదిశ మారి శ్రీ రాజగోపాలస్వామి ఆలయం, శ్రీ అమరేశ్వరస్వామివారి ధ్వజ స్తంభం నదీపాతం అయ్యాయి. తర్వాత ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు.

స్వామివారి మహత్యం గురించి చాలా గొప్పగా చెబుతారు. రాజగోపాలన్ అనే సాతానికి చిన్నవయసులో స్వామి ప్రత్యక్షమై నాలుకపై భీజాక్షరాలు వ్రాసి జ్ఞానోపదేశం చేశారట. గ్రామ మునసబుకి కన్పించి తన కైంకర్య లోపాలు చెప్పి సవరణ చేసిన ఉదంతాలు. మరియు ఆంధ్రదేశంలో హరికథా పితామహులుగా పేరొందిన కీ.శే. శ్రీ దీక్షిత్‌దాసుగారికి గురువు లేడు. శ్రీ రాజగోపాలస్వామి వారినే గురువుగా ఎంచుకుని తన వ్యాసంగాలలో శ్రీ స్వామివారి మహత్తుని దేశానికి చాటి చెప్పిన మొదటి వ్యక్తి.


స్వామివారి కళ్యాణం సప్తాహ్నికంగా ఫాల్గుణ మాసంలో దశమికి కళ్యాణం, రథోత్సవం పొన్న ఉత్సవం, గజ, హంస, సింహవాహనోత్సవాదులతో జరిపిస్తారు. కృష్ణాష్టమి, విజయదశమి, ధనుర్మాశం ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇక్కడ కనకదుర్గ అమ్మవారి ఆలయం కూడా వుంది.

## 33) శ్రీ ఆదికేశవ ఎంబెరు మన్నార్ స్వామి వారి ఆలయం - నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లాలో ముఖ్యమైన వైష్ణవ క్షేత్రములలో శ్రీ ఆదికేశవ ఎంబెరుమన్నారు ఆలయం ఒకటి. ఇప్పటికి సుమారు 980 సంత్సరాల క్రితం ఆదిశేషాంశజులు, వైష్ణవ సిద్ధాంత ప్రవక్త అయిన శ్రీరామానుజాచార్యుల వారు శ్రీ పెరంబుదూరులో జన్మించారు. 120 సంవత్సరాలు శ్రీరామానుజులు ఈ లోకంలో నివసించి, ఆసేతు హిమాచలం రెండు పర్యాయాలు సంచరించారు.

శ్రీరామానుజాచార్యులు జీవించి వున్నప్పుడు ఈ దేవాలయం నిర్మించబడి, విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. శ్రీ జగద్గురుపాద పద్మ చిహ్నములు వున్న శ్రీ యతిరాజస్వామివారి శఠారిని పెరంబూరు నుంచి తీసుకొచ్చారు. అది ఇప్పుడు కూడా ఉపయోగిస్తూనే వున్నారు.

ఇక్కడ వున్న రామానుజాచార్యులు ఉత్సవమూర్తులు, శ్రీరామానుజస్వామి వారి జీవితకాలంలోనే తయారు చెయ్యబడ్డాయి.



*శ్రీ ఆదికేశవ ఎంబెరు మన్నార్ స్వామి దేవాలయం, నరసాపురం*

ఇప్పటికి సుమారు 250 సంవత్సరముల క్రితం నరసాపురంలోని శ్రీ పుప్పాల రమణప్పనాయుడు పాదచారియై పెరంబూరు వెళ్ళి శ్రీ బాష్యకార్ల స్వామివారి మూర్తులను తెచ్చి ప్రతిష్టించారు. ఆలయానికి దగ్గరలో కొందరు భక్తులతో దానం చెయ్యబడ్డ యతిరాజాశ్రమము ఇప్పుడు కూడా వుంది.


ఆవరణలో ఆళ్వార్లలకు శ్రీమనవాళ్ళ మహామునికి, ఆండాళ్ళమ్మకు శ్రీయుత రాజువల్లి తాయారమ్మకు, శ్రీ ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక ఆలయాలున్నాయి.

## 34) శ్రీ మదన గోపాలస్వామి వారి ఆలయం - నరసాపురం

నరసాపురం పట్టణంలో వేంచేసివున్న శ్రీ మదనగోపాలస్వామివారి దేవాలయం ఒక విశిష్టత సంతరించుకున్న ఆలయం. దీని నిర్మాణం వెయ్యి సంవత్సరాలకు పూర్వమే జరిగినట్లుగా తెలుస్తోంది.

ఆ విషయాన్ని నిర్ధారించే కొన్ని ఆధారాలు మాత్రం గుడిలో ఈనాటికి కనిపిస్తుంటాయి. అందులో ముఖ్యంగా రెండు మూలవిరాట్ విగ్రహములు వుండటం గమనార్హం. అంతేకాక గుడి ఆవరణలోని స్తంభాలపై వున్న లిపి కూడా మనకు ఆ సంగతినే ధృవపరుస్తుంది. ఆదిమూర్తిగా వున్న గోపాలుని మూలవిరాట్‌కి 'నాసాగ్రము' భిన్నము అవడంతో సుమారు 186 సంవత్సరాలకు పూర్వం నరసాపురం వాస్తవ్యులయిన సరిపల్లివారు రెండవ మూలవిరాట్‌ని రుక్మిణి, సత్యభామా సహితంగానూ, ఇప్పుడున్న ఉత్సవమూర్తులను కూడా ప్రతిష్టించారు. ఆనాటి నుండి వైశాఖశుద్ధ ఏకాదశి నుండి జరుగు శ్రీవారి కళ్యాణోత్సవం ఆ వంశస్తులే జరిపిస్తున్నారు.

పూర్వం నరసాపురం ప్రధానంగా మదనగోపాలస్వామి ఆలయం దగ్గర చిన్న ఓడరేవు వుండేదని స్థానికులు చెబుతున్నారు. అంతేకాదు 1985లో దేవాలయ విమానము బాగు జేయడానికి విమానము మీద వున్న 230 బొమ్మలను తొలగించి బాగు చేసినప్పుడు బొమ్మల లోపల సర్వీపుల్లలుపై పేడ, బంక మన్నుపూసి దానిపై సున్నం వేసి వుండటం చూసి ఆశ్చర్యపోయారు.



*శ్రీ మదన గోపాలస్వామి వారి దేవాలయం, నరసాపురం*

వాటిని బ్రద్ధలు గొట్టడానికి పనివారు పడ్డ శ్రమ చాలా అధికము. ఆలయం లోపల వున్న లిపి అర్థంగాకపోవడంతో సరైన కాలనిర్ణయం చెయ్యలేకపోతున్నారు.

వైశాఖశుద్ధ దశమి నుంచి పౌర్ణమి వరకు స్వామివారి వర్షకళ్యాణం జరుగుతుంది. ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి ఉత్సవం, శ్రావణమాసంలో కృష్ణాష్టమి జయంతి ఉత్సవం, దసరా ఉత్సవాలు బాగా జరుగుతాయి.


ఎవరు ఏ కోరికతో కళ్యాణం జరిపించినా, చూసినా సకల మనోభీష్టాలు నెరవేరతాయి.

## 35) శ్రీ కపిల మల్లేశ్వరస్వామి వారి ఆలయం - నరసాపురం

ఇదే పట్టణంలో వున్న మరో దేవస్థానంలో శ్రీ కపిల మల్లేశ్వరస్వామి కొలువైయున్నారు. ఈ కపిల మల్లేశ్వరలింగము అతిపురాతనమైనది. కపిల మహామునిచే ప్రతిష్టించబడినందువల్ల స్వామివారికి కపిల మల్లేశ్వరుడని పేరు వచ్చింది.

అయితే ఆ ప్రతిష్ఠా సమయం, ఆలయ నిర్మాణ సమయం తెలియవచ్చే సూచనలు, ఆధారాలు ఏవీ ఇక్కడ అందుబాటులో లేవు. క్రమంగా ఆలయం పూర్తిగా జీర్ణమయి, లింగము ఎక్కడో పడిపోయినది.

కొంతకాలం క్రితం మొగల్తూరు జమీందారు ఒకసారి లక్ష్మణేశ్వరం వెళుతూ, దారిలో ఒకచోట ఈ మహాలింగాన్ని చూసి తిరిగి ఆలయాన్ని కట్టించి పునఃప్రతిష్ఠ జేయించారు.



*శ్రీ కపిల మల్లేశ్వర స్వామి ఆలయం, నర్సాపురం*

ఈ ఆలయంలోనే పార్వతీదేవి, లక్ష్మీగణపతి, శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి, మహేశ్వరస్వామి వార్ల ఆలయాలు కూడా వున్నాయి నరసాపురంలో పై ఆలయాలతోపాటు తప్పక దర్శించాల్సిన ఆలయం ఇది!

## 36) శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయం - లక్ష్మణేశ్వరం

నరసాపురానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో, నరసాపురం మండలంలో వున్న పుణ్యక్షేత్రము లక్ష్మణేశ్వరం. బస్సు సౌకర్యం వుంది. ఇక్కడ శ్రీరాముని సోదరుడు లక్ష్మణుడి చేత ప్రతిష్ఠించబడిన శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం వుంది.

వశిష్ఠ నదికి కిలోమీటరు దూరములో ఈ ఆలయం నిర్మించబడింది. ఇక్కడికి బంగళాఖాతము (సముద్రము) సుమారు ఆరున్నర కిలోమీటర్ల దూరంలో వుంది.

పశ్చిమగోదావరి జిల్లాలోని అతిప్రాచీన పుణ్యక్షేత్రములలో ఈ లక్ష్మణేశ్వరం ఒకటి. లక్ష్మణుడు ఇక్కడ ఈశ్వర ప్రతిష్ఠ చేశాడు గనుక ఈ స్థలమునకు లక్ష్మణేశ్వరం అని పేరొచ్చింది.

ఇక్కడి స్వామివారికి కొప్పు వున్నది. గనుక ఆయనని కొప్పు లింగేశ్వరుడు అని కూడా పిలుస్తారు. శ్రీ స్వామివారికి రోకలిపోటు, కోడికూత వినబడకూడదని అంటారు. అందువల్లనే ఈ దేవాలయానికి సమీపంలో ఇళ్ళు లేవు అనడం కంటే దేవాలయం వూరికి దూరంగా నిర్మించారు అని చెప్పడం యథార్థానికి దగ్గరగా వుంటుంది.


త్రేతా యుగములో రావణాసురుని సంహరించిన తరువాత బ్రహ్మహత్యా దోష నివారణకై కోటిలింగములను దేశములోని అనేక చోట్ల శ్రీరామ లక్ష్మణులు ప్రతిష్ఠించారు.

ఈ ప్రాంతములో వశిష్టనదికి తూర్పున ఒక ఈశ్వరుడ్ని ప్రతిష్ఠించారు. గుడి మూలలోని


(గుడి మూలరామేశ్వరము) రామేశ్వరుడు అయన. పడమటి తీరంలో లక్ష్మణుడు ఇంకొక శివలింగాన్ని శ్రీరాముని అజ్ఞతో ప్రతిష్టించాడు.

లక్ష్మణుడిచేత ప్రతిష్ఠించబడిన శివలింగము దేశంలో ఇది ఒక్కటే అన్న శాసనము ఈ దేవాలయం గోడ మీద వుంది.


ఈ ఆలయ నిర్మాణం ఏ కాలములో జరిగిందో తెలియజేసే నిర్ధుష్టమైన ఆధారాలు మాత్రము లేవు. ఆలయం ఎప్పుడు జీర్ణం అయిందో తెలియదు.


శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరం స్వామి ఆలయగోపురం, లక్ష్మణేశ్వరం

ఆలయం మాత్రం తిరిగి కట్టబడింది. ప్రాకారంలో కుడివైపున శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామి వారి ఆలయం. ఎడమవైపున శ్రీ దుర్గా అమ్మవారి ఆలయం వున్నాయి. అయిదు అంతస్థుల రాజగోపురం చాలా అద్భుతమైన నిర్మాణం.


శ్రీ దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయం, లక్ష్మణేశ్వరం


ఇక్కడ దేవీ నవరాత్రులు, ధనుర్మాసము, ఏకాదశి, మహాశివ రాత్రికి శ్రీ స్వామివారి కళ్యాణము వైభవంగా జరుగుతాయి. ఆ ఉత్సవాల్లో జరుగు రథోత్సవములో వేలాది జనం పాల్గొంటారు. వసతి సౌకర్యం లేదు.



గర్భగుడిలో శ్రీ దుర్గాలక్ష్మణేశ్వర స్వామి

## 37) శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం - నరసింహపురం

భీమవరం-కైకలూరు రోడ్డులో ఉండి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, మెయిన్‌రోడ్‌కి ఆనుకుని వుంది నరసింహపురం గ్రామం. మెయిన్‌రోడ్ మీదే శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం. బస్‌లో సులభంగా చేరుకోవచ్చు.



శ్రీ వెంకటేశ్వర ఆలయం, నరసింహపురం


స్వామి వారి ఆలయం నిర్మించి ముప్పయ్యేళ్ళే అయినా స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువ! పెళ్ళిళ్ళ సీజనులో ఇక్కడ వివాహాలు వందల సంఖ్యలో జరుగుతాయి.

ఆలయ ప్రాంగణం అంతా పాలరాయి పరచి వుండటమే కాదు. ఆలయ ప్రాంగణంలో శ్రీహరి శ్రీనివాసుని అవతారం ఎత్తిన గాధను శిల్పాల రూపంలో చిత్రించి. గ్లాస్‌బాక్స్‌ల్లో ఏర్పాటు చేసి క్రింద ఆ ఘట్టాలను వివరించారు. చూడచక్కగా, అద్భుతంగా వుంటాయి ఆ బొమ్మలు. (ఈ పుస్తకంలో ముఖచిత్రంపై ప్రచురించిన శ్రీనివాసఘట్టాలు ఆ గుడిలోనివే) అక్కడ వున్న శ్రీహరి విశ్వరూపం అద్భుతం!

భక్తులు తప్పక దర్శించాల్సిన ఆలయం ఇది!

## 38) శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం - భీమవరం

భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌కి, భీమవరం ఆర్టీసి బస్‌స్టాండ్‌కి దగ్గరగా నిర్మించబడిన దేవాలయం ఇది! ఇక్కడ శ్రీ పద్మావతి వేంకటేశ్వరస్వామి కొలువై యున్నారు.



*శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, భీమవరం*


ఇది నూతన నిర్మాణం. శ్రీ బి.వి. రాజుగారు ఈ దేవాలయాన్ని ఓ పాతిక సంవత్సరాల క్రితం నిర్మాణం చేశారు. భీమవరం పట్టణంలో వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఇదొక్కటే గనుక. ఇక్కడకు భక్తులు పెద్దసంఖ్యలోనే వస్తుంటారు. వసతి సౌకర్యాలు కూడా వున్నాయి.

ఇక్కడ స్వామి వారికి చెందిన అన్ని ఉత్సవాలు అతివైభవంగా జరుగుతాయి. ఉత్సవ సందర్భాలలో వేలాది భక్తులు పాల్గొంటారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలో వున్నదీ ఆలయం.

## 39) శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి వారి ఆలయం - గునుపూడి (భీమవరం)

గుడివాడ - నర్సాపురం రైల్వే మార్గంలో భీమవరం ఒక ముఖ్యమైన జంక్షన్. జిల్లాలోని అన్ని ప్రదేశాలనుంచి ఇక్కడకు బస్సు సౌకర్యం వుంది.

పంచారామ క్షేత్రములలో గునుపూడి ఒకటి. గునుపూడి భీమవరం రైల్వే (జంక్షన్) స్టేషన్‌కి అరకిలోమీటరు దూరంలో, భీమవరం పట్టణంలో కలిసే వుంది. ప్రసిద్ధి చెందిన శ్రీ సోమేశ్వర, జనార్ధనస్వామివార్ల ఆలయాలు ఇక్కడున్నాయి.



*శ్రీ ఉమా సోమేశ్వ జనార్ధనస్వామి ఆలయం, గునుపూడి*

గోస్తనీ నది ఈ క్షేత్రానికి సమీపంలోనే వుంది. సోమునిచే లింగము ప్రతిష్ఠించబడినది. కనుక ఈ క్షేత్రానికి సోమారామము అని పేరొచ్చింది. ఈ గ్రామము పేరు గుణపూడి అని కొన్ని శాసనాల్లో వుంది. మరి కొన్ని ప్రాచీన శాసనాల్లో ఈ ప్రాంతానిక పాగునార, పావునార్, పానారసీమ అని పేర్లున్నాయి.


తారకాసురుని సంహారం అనంతరం ఆదైత్యుని కంఠంలో వున్న అమృతలింగం పంచఖండాలుగా ఖండింపబడ్డాయి. దానిలో ఒక భాగం గునుపూడి దగ్గర పడింది. క్రీస్తు శకము 11వ శతాబ్దంలో చాళుక్య ప్రభువైన భీమరాజు ఈ ఆలయానికి వచ్చి శ్రీ స్వామికి పూజ చేసి ఆలయం ముందుభాగంలో ఓ చిన్న గోపురం నిర్మించాడు. ఈ గ్రామానికి దగ్గర ఇంకొక శివలింగంను కూడా అతను ప్రతిష్ఠించాడు.

అదే భీమవరంలోని భీమేశ్వర లింగము. భీమవరమును గునుపూడి భీమ వరము అని పిలిచేవారు. సోమేశ్వరుడు అమావాస్యకు గోధుమ, నలుపు రంగులు, పౌర్ణమికి తెలుపురంగు

కలిగి వుంటాడని అంటారు. ఈ ఆలయానికి ఎదురుగా 'చంద్ర పుష్కరిణి' లేక 'సోమగుండం' అని ఒక కోనేరు వుంది.

ఈ క్షేత్రమునకు ఒక ప్రత్యేకత వుంది. ఈశ్వరుడు తన శిరస్సున గంగను ధరించాడని తెల్పడానికి సోమేశ్వరుని ఆలయానికి పైభాగములో శ్రీ అన్నపూర్ణాదేవి ఆలయము వున్నది. అన్నపూర్ణా దేవి విగ్రహం చాలా తేజోవంతమయినది, ఆకర్షణీయమైనది.

స్కాందపురాణాన్ని బట్టి పూర్వము తారకాసురుడు లోకుల్ని అనేక విధములుగా బాధలు పెట్టాడు. సాంబశివుని పుత్రుడు కుమారస్వామి ఆరాక్షసుడ్ని సంహరించాడు. తారకుని కంఠములో వ్రేలాడుతున్న అమృతలింగము భిన్నమై పడ్డ అయిదు ప్రదేశాలు పంచారామములుగా ఖ్యాతి పొందాయి. అందులో ఈ సోమారామం భాగం అదృశ్యమై పోగా, జనార్ధనుడు తన మహిమచే చంద్రునితో తిరిగి ప్రతిష్ఠ చేయించాడు.



*శ్రీ సూర్యనారాయణమూర్తి వారి గునుపూడి ఆలయం, భీమవరం*

పంచారామాల్లో ద్రాక్షారామము, అమరావతి, కుమారా రామలింగములు తెల్లగా, ఎత్తుగా వుంటాయి. పాలకొల్లులో క్షీరా రామేశ్వరుడు, గునుపూడిలోని సోమారామేశ్వరుడు అంత ఎత్తుగా వుండరు. రెండు అడుగుల ఎత్తేవుంటారు.

ఇక్కడ ఆలయంలోని మంటపము, పంచారామములన్నిటిలోను గొప్పది. సోమారామంలోని పార్వతీ దేవి యొక్క యంత్రము మహిమాన్వితమైనది.

శిలా శాసనములలో ద్రాచ్యారామ లేక దచ్యారామపురి, గునుపూడికి మారుగా పేర్కొన్నారు. ఈ ఆలయ ప్రాకారం, గోపురములు క్రీ.శ. 11వ శతాబ్దములో నిర్మించబడ్డాయి.

శ్రీసోమేశ్వరలింగము స్వయంభువు, స్ఫటికారం గలది ! స్వామి వారి కళ్యాణము మాఘ బహుళ ఏకాదశి మొదలు అయిదు రోజులు జరుగుతాయి. శ్రీకృష్ణాష్టమి, వినాయక చవితి, దేవీ

నవరాత్రులు, కార్తీక ధనుర్మాసములు, ముక్కోటి ఏకాదశి, మహా శివరాత్రులు కూడా జరుపుతారు. శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ కుమారస్వామి, శ్రీ సూర్యనారాయణ, సుబ్రమణ్యేశ్వర ఆలయాలు కూడా సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో వున్నాయి. స్వామి వారి ఆలయం ప్రస్తుతం జీర్ణోద్ధరణ జరుగుతోంది.

## 40) శ్రీ ఉమాభీమేశ్వర స్వామివారి ఆలయం - భీమవరం

క్రీస్తు శకము 9వ శతాబ్దములో తూర్పు చాళుక్యుల పరిపాలనలో ఉండేది భీమవరము. దీని పూర్తిపేరు చాళుక్య భీమవరం. క్రీస్తు శకము 890 - 918 కాలములో చాళుక్య భీముడు భీమవరమును పరిపాలించాడు.



*శ్రీ ఉమాభీమేశ్వర స్వామి ఆలయం, భీమవరం*

ఇతను చాలా ఆలయాలు కట్టించాడు. మొగలు చక్రవర్తుల కాలములో భీమవరము మృత్యుంజయ నగరము అని పిలువబడేది. ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయి.


శ్రీ భీమేశ్వర లింగము అయిదు అడుగుల ఎత్తు ఉంటుంది. ఆలయములో పాళీ భాషలో శాసనములు ఉన్నాయి. దేవీ నవరాత్రులకి మహిషాసురమర్ధని అమ్మవారికి తొమ్మిది విశేష అలంకారములు చేస్తారు.

కార్తీక మాసం నెలరోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొంటారు. ఇక్కడ దగ్గరలో గల వీరమ్మ చెరువులో తెప్పోత్సవం జరుగుతుంది.

## 41) శ్రీ మావుళ్ళమ్మ వారి ఆలయం - భీమవరం

భీమవరంలో వున్న మరో పురాతనమైన ఆలయం శ్రీ మావుళ్ళమ్మ వారి ఆలయం ! క్రీస్తు శకము 1200 సం॥ర ప్రాంతములో శ్రీ మావుళ్ళమ్మ వారు ఇక్కడ వెలసినట్లుగా స్థానికులు చెబుతుంటారు.

మోపల్లివారి వీధి ప్రాంతంలో వేప. రావి కలిసి వున్న చెట్టు చుట్టూ ఉన్న మట్టిదిబ్బ మీద శిలా రూపంలో శ్రీ మావుళ్ళమ్మ వారు వెలిశారని శ్రీ మారెళ్ళ మాచిరాజు. శ్రీ గ్రంధి అప్పన్నలకు వచ్చిన కల ఫలితంగా తెలిసింది. శ్రీ అమ్మవారి విగ్రహం ఆదివారం బజారు ప్రాంతంలో 1880 సం ము వైశాఖ మాసములో దొరికింది.



శ్రీ మావుళ్ళమ్మ వారి ఆలయం, భీమవరం

తరువాత శ్రీ అమ్మవారి విగ్రహాన్ని తాతవోలు నాగభూషణాచార్యులుగారు తయారు చేశారు. 1934 సంవత్సర ప్రాంతములో శ్రీశ్రీ పాదనరసింహం మహాదములో యంత్ర ప్రతిష్ట చేశారు.

ప్రతి సంవత్సరము సంక్రాంతికి ఇరవై రోజులు ప్రజల సహకారముతో మహా వైభవంగా వార్షిక ఉత్సవాలు జరుగుతాయి. శ్రీ అమ్మవారి విగ్రహం 8 అడుగులు ఎత్తు కలిగి అత్యంత ఆకర్షణీయంగా వుంటుంది. భక్తులు కోర్కెలు తీర్చే తల్లిగా అమ్మవారికి ఎంతో పేరు వుంది. నిత్యం భక్తులతో కళ కళలాడుతుంటుంది అమ్మవారి ఆలయం ! అమ్మవారిని దర్శించి తరించండి!

## 42) శ్రీ శివదేవస్వామి వారి ఆలయం - శివదేవుని చిక్కాల

పాలకొల్లు మండలములోని శివదేవుని చిక్కాలకు చేరుకోవడానికి బస్సు సౌకర్యమే కాదు, రైలు మార్గం కూడా వుంది. భీమవరం - పాలకొల్లు మధ్యన వచ్చే చిన్న స్టేషన్ శివదేవుని చిక్కాల. పాలకొల్లుకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న గ్రామం ఇది.

శ్రీ శివదేవస్వామి కొలువై వున్న ఈ దేవాలయానికి చాలా ప్రాచీన చరిత్ర వుంది. అభయంకరుడైన శంకరుని వర ప్రభావంతో తేజో ప్రభావితమైన గ్రామం శివదేవుని చిక్కాల.

క్రీస్తు శకం 44వ సంవత్సరానికి చెందినవాడుగా చెప్పబడే కవి కుల గురువు కాళిదాసు రచించిన 'కుమార సంభవం' కావ్యంలో ఈ గ్రామ అందచందాల్ని వర్ణించినట్టు తెలుస్తోంది


ఆంగ్లేయుల పాలనలో నర్సాపురాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకుని రాయప్పదొర పనిచేస్తూ, ఆయన అనేక గ్రామాలు పర్యటించి పెద్దలు, జమీందారుల్ని కల్సుకుంటూ అయా గ్రామాల చరిత్ర వ్రాశాడు.

ఆయన రచించిన గ్రంధంలో పేర్కొన్న ఆధారాల ప్రకారం పవిత్రమైన పాలకొల్లులోని శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి పాలనురుగు లాంటి తన అందచందాలతో ప్రతీ తెల్లవారుజామున భీమారామం వరకూ జీవయాత్ర చేసేవాడు. ఒక రోజు రాత్రి తెల్లని వెన్నెల కాంతితో స్వామి వారి దేహం వెలిగిపోయింది. అప్పుడు అప్సరసలు, దేవతా స్త్రీలు ఆయన అందానికి సమ్మోహితులై ఆ శివదేవుని చెక్కిలిని ముద్దాడి నాట్యంచేస్తూ ఆనందించారు. అలా శివదేవుని చెక్కిలిని ముద్దాడిన ప్రదేశం గనుక 'శివ దేవుని చెక్కిలి' అన్నారు. కాలక్రమేణా శివదేవుని చిక్కాలగా మారింది.

రావణ సంహారం తరువాత శ్రీరాముడు దక్షిణ రామేశ్వర సాగర సంగమస్థానంలో ఈశ్వర ప్రతిష్ఠ చేయడానికి తగిన శివలింగాన్ని వారణాసి నుంచి తీసుకురమ్మని ఆంజనేయుడికి చెప్పాడు. బాణాన్నిభూమిపై పెట్టకుండా భుజం మీద పెట్టుకుని తీసుకురమ్మంటే ఆంజనేయుడు తెస్తూ లింగమును ఇక్కడ వదిలేశాడు.

చాలా కాలం తర్వాత మొగల్తూరు రాజా వ్యవసాయం నిమిత్తం భూమి బాగుచేయిస్తుండగా ఆ లింగం కనిపించింది. ఆయన పండితులతో చర్చించి ఆగమశాస్త్రానుగుణంగా ఆలయాన్ని నిర్మించాడు అప్పటి నుంచిప్రతీ ఏటా మహాశివరాత్రినాడు ఐదురోజులపాటు శ్రీ స్వామివారికి ఉత్సవాలు జరుగుతున్నాయి. యాత్రికులకు వసతి సౌకర్యాలు లేవు.

## 43) శ్రీ సిద్దేశ్వరస్వామి వారి ఆలయం - అత్తిలి



శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి వారి ఆలయం, అత్తిలి

నిడదవోలు నుంచి భీమవరం పోయే రైలు మార్గంలో తణుకు తరువాత తగిలే ఓ ముఖ్యమైన స్టేషన్ అయిన అత్తిలి మండల కేంద్రం కూడా 'ఇక్కడనుంచి అన్నిచోట్లకూ పోవడానికి బస్సు సౌకర్యం వుంది


ఈ గ్రామంలో పురాతనమైన దేవాలయాల్లో శ్రీ సిద్దేశ్వరస్వామి వారి ఆలయం ఒకటి! సుమారు 1200 సంవత్సరముల క్రితం నిర్మించబడినట్లుగా చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. మాఘ బహుళ చతుర్ధశికి కళ్యాణం, దేవీ నవరాత్రులకి పూజలు జరుగుతాయి

ఇక్కడ వున్న మరో పురాతన దేవాలయంలో శ్రీ వేణుగోపాలస్వామి కొలువై యున్నారు. ఇది కూడా నిర్మించి సుమారు పన్నెండు వందల సంవత్సరాలు దాటినట్లు తెలుస్తోంది ఈ గ్రామంలోనే వున్న మరో పురాతనమైన ఆలయం శ్రీ ఆంజనేయ స్వామి వారి గుడి. సుమారు ఎనిమిది వందల సంవత్సరాల క్రితం నిర్మించారు.

అత్తిలిలో వున్న మరో ప్రసిద్ధ ఆలయం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి ఇక్కడ జరిగే సుబ్బారాయుడి షష్టి ఉత్సవానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి పాల్గొంటారు.

## 44) శ్రీ విశ్వేశ్వరస్వామిమరియు శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల ఆలయాలు - ఆలమూరు

అత్తిలి నుంచి మార్టేరు పోయే రహదారి మార్గంలో, పెనుమంట్ర మండలంలోని గ్రామం ఆలమూరు. మార్టేరుకి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న ఆలమూరు గ్రామంలో రెండు వందల యాభై సంవత్సరాల క్రితం నిర్మించబడిన దేవాలయం శ్రీ విశ్వేశ్వరస్వామి గుడి !



శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయం, ఆలమూరు

ఇక్కడకు కాశీ నుంచి శివలింగాన్నితెచ్చి ప్రతిష్టించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అందువల్లనే స్వామి వారు మహా మహిమాన్వితులుగా పేరుపొందారు

ఇదే ఆలయం ఆవరణలో వున్న మరో దేవాలయం శ్రీ సీతారామచంద్ర స్వామివారి గుడి ! ఈ దేవాలయం కూడా రమారమిగా అదే కాలములో నిర్మించినట్లుగా తెలుస్తుంది.

ఈ ఆలయాల్లో కార్తీక మాసం, నవరాత్రులు, శివరాత్రికి స్వామి వారి కళ్యాణం, చైత్ర శుద్ధ నవమికి సీతారామచంద్ర స్వామి వారికి కళ్యాణం జరుగుతుంది

చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి కూడా ఇక్కడకు భక్తులు విరివిగా వస్తుంటారు. యాత్రీకులకు వసతి సౌకర్యాలు మాత్రమే లేవు.

## 45) శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వర స్వామి వారి ఆలయం - జుత్తిగ

పెనుమంట్ర మండలంలోని ఈ జుత్తిగ గ్రామము తణుకు పట్టణానికి పదకొండు కిలోమీటర్ల దూరంలో వుంది. మంచిలి రైల్వే స్టేషన్‌కి అరున్నర కిలోమీటర్ల దూరంలో వున్న ఈ జుత్తిగ ఇతిహాస ప్రాధాన్యత కలిగిన గ్రామము. నత్తా రామేశ్వరం ఇక్కడకు మూడు కిలోమీటర్లు.

ఈ శివలింగాన్ని ఘుశ్మేశ్వర జ్యోతిర్లంగ మహాక్షేత్రమని కూడా పిలుస్తారు. ద్వాదశ జ్యోతిర్లింగములలో ఇక్కడ వున్న శ్రీ సోమేశ్వర లింగము కూడా ఒకటి అని కొంతమంది అంటారు.

ఈ జుత్తిగను పూర్వము దూతిక, దుత్తిక అని కూడా పిలిచేవారు. ఆనందసాగరము, గూఢస్తనీ తీరము, వాసుకీ రవి సోమేశ్వరము అనికూడా పేర్లున్నాయి. శివ దూత శక్తి చేత పాలింపబడుతున్న పురము కనుక దూతి కాపురమని కూడా పేరుంది.

ఇక్కడ గోస్తనీనది ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది. స్వామి పశ్చిమాభిముఖంగా ప్రతిష్టించబడ్డారు. త్రేతాయుగంలో వాసుకి, రవి, సోములు రావణాసురుడు పెడుతున్న బాధలు భరించలేక బ్రహ్మదేవుడి దగ్గర కెళ్ళి మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు గోస్తనీ నది ఉత్తర వాహినియై ప్రవహిస్తున్న ప్రదేశంలో శివలింగాన్ని ప్రతిష్టించి పూజలు జరిపితే మీ బాధలు తొలగుతాయి, కష్టాల నుంచి విముక్తులవుతారని చెప్పాడు.

అప్పుడు వాసుకి రవిసోములు ఇక్కడకు వచ్చి శివలింగాన్ని పశ్చిమాభిముఖంగా ప్రతిష్టించి పూజలు జరిపారు. తరువాత శ్రీహరి శ్రీరాముడిగా జన్మించి రావణాసురుడ్ని సంహరించడంతో వారి బాధలు ఈడేరాయి. ఈ లింగానికి 'రుణ రోగ శత్రు నాశనలింగం' అని పేరు.

వాసుకి రవి సోములు పూజలు జరిపాక స్వామి వారికి కన్పించి త్వరలో మీ బాధలు తీరతాయని చెప్పారు అలాగే జరిగింది తాము ప్రతిష్టించి పూజించిన లింగం గనుక తమ పేరుతో వుండమని కోరారు.

వాసుకి అంటే పరమశివుని మెడలోని సర్పరాజు, రవి అంటే సూర్యుడు, సోముడు అంటే చంద్రుడు, ఉమ అంటే శక్తిభీజం గనుక ఆనాటి నుండి శ్రీ ఉమా వాసుకీ రవి సోమేశ్వరలింగం' గా పిలువబడుతోంది

ఇది త్రేతాయుగం నాటి లింగం ! ఏ త్రేతా యుగం నాటిదో చెప్పలేమని అక్కడి అర్చకులు అంటున్నారు ఇక్కడ పార్వతీదేవి దక్షిణాభిముఖం. అక్కడ నుంచి దక్షిణ ముఖంగా బయటకొస్తే అక్కడ భద్రకాళీ వీరభద్రస్వామి, అక్కడ నుంచి నైరుతి మూల శ్రీ దుర్గాదేవి, అక్కడ నుంచి ముఖమంటపంలోకి వస్తే అవి సిరమ్మ శారదాదేవి దర్శనమిస్తారు. శృంగేరీ పీఠంలో వున్న శారదాదేవిని ముమ్మూర్తులా పోలివుండటం విశేషం. అవిశ్రమ్మ వారిని పూజిస్తే పిల్లలు లేని వారికి పిల్లలు పుడతారు. ఆ పూజా విధానం అక్కడ అర్చకుల్ని అడిగితే వారు చెబుతారు. ఆ విధంగా ఆచరించాలి.



*గర్భగుడిలో శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వరాలయం, జుత్తిగ*

అక్కడ నుంచి పడమటి ప్రాకారంలోకి వస్తే శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి దర్శనమిస్తారు. ఆ గుడి ధర్మకర్తకు శ్రీ ఉమా వాసుకీ రవి సోమేశ్వర స్వామి కలలో కనిపించి తనకి ఇంత దూరంలో త్రవ్వితే శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి దొరుకుతాడని చెప్పారు. ఆ విధంగా అక్కడ త్రవ్వితే స్వామి బయటపడ్డారు.

శ్రీ ఉమావాసుకీ రవి సోమేశ్వర ప్రేరణా విద్యోత శ్రీ బాలవెంకట సుబ్రమణ్యేశ్వరస్వామి ప్రక్కన వల్లీదేవి కొలువై వుంటారు. సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆగ్నేయ మూలలో చంద్రపుష్కరిణి వుంది. దీనికి అవతల గోస్తనీ నది.

ఇక్కడే వాయువ్య మూలన శ్రీ లక్ష్మీ జనార్ధనుడు, ఆ ప్రక్కనే ఆంజనేయ స్వామి వున్నారు. ఇక్కడ నవగ్రహాలు, శ్రీ సూర్యనారాయణస్వామి కూడా కొలువైయున్నారు. ఈ క్షేత్రానికి పాలకుడు శ్రీ కాల భైరవమూర్తి వున్నారు. శివదర్శనానికిముందు ఆయనని దర్శించి అనుమతి తీసుకోవాలి. దర్శన అనంతరం శ్రీ కాలభైరవస్వామిని దర్శించి గుడి నుంచి వెళ్లడానికి అనుమతి కోరుకోవాలి.

అక్కడ్నుంచి ఆగ్నేయ మూలలో గణపతి, అక్కడే ఓ మూల ద్యూతికాదేవి వున్నారు. ఇరవై

ఎనిమిది త్రేతాయుగాలు ఇంతవరకూ జరిగాయి. అతి పురాతనమైన ఈ శివలింగముఏ త్రేతాయుగంలోనిదో చెప్పలేము. ఇరవై ఎనిమిదో కలియుగం ఇప్పుడు నడుస్తూ అయిదు వేల వంద సంవత్సరాలు గడిచాయి

ఈ గుడిలో ప్రత్యేక పూజ 'మృత్యుంజయ కల్పం' ఈ పూజ చాలా కఠినమయింది. ఎవరైనా కష్టాల్లో వున్నప్పుడు అంటే ప్రాణాపాయ స్థితిలో వున్నప్పుడు, కోర్టు వ్యవహారాల్లో, ఇంకా క్లిష్టతరమైన వ్యవహారాల్లో వున్నప్పుడు ఈ మృత్యుంజయ అభిషేకం చేసుకుంటామని మొక్కుకుంటే తప్పనిసరిగా ఆ కోరిక నేరవేరుతుంది. ఉరిశిక్ష పడ్డవాళ్ళకి ఇక్కడ మొక్కుకున్నాక అది రద్దు అవడం, ఏడు అంతస్థులపై నుంచి క్రింద పడికూడా బ్రతకడం ఈ 'మత్యుంజయ కల్పం' విశేషాలని అర్చక స్వాములు చెబుతున్నారు. ఆ పూజా విధానం అర్చకుల్ని అడిగి తెలుసుకోవాలి.

ఇక్కడ లింగ విశిష్టత ఏమంటే ఎన్ని నీళ్ళు పోసినా లింగం క్రిందకు వెళ్ళిపోతాయి. సోమసూత్రం లేదు. అష్ట బంధనం లేదు. త్రిపీఠాలు మూడు పెట్టినట్టు వుంటాయి. లింగం గజం ఎత్తులో వుంటుంది పాలరాతి లింగం.

దేవాలయ శిఖరం అంతా శ్రీ చక్ర మోడల్‌లో వుంటుంది. ఈ గుడి వెనుకభాగంలో కామాక్షి దేవి కొలువైవున్నారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం విశ్వబ్రాహ్మణులచే ప్రతిష్ఠించబడిన శ్రీ కామాక్షిదేవి కంచిలోని రూపుని ముమ్మూర్తులా పోలివుంటుంది. ఈనాటికి అవంశీకులే అర్చన సాగిస్తున్నారు. అమ్మవారు మహామహిమాన్వితురాలు. జుత్తిగలో చాలా మంది 'కామా' అనే పేరు కలిసివచ్చేట్లు పేరు పెట్టుకోవడం విశేషం. ఇటీవలే ఈ గుడిలో లక్ష్మి, సరస్వతి దేవిలను ప్రతిష్ఠించడంతో ఇది త్రిశక్తి పీఠంగా వెలుగొందుతోంది.

క్రీస్తు శకం 13వ సంవత్సరంలో శ్రీ విష్ణువర్ధన మహారాజు దుత్తిక వాసుకి రవి సోమేశ్వర దేవర ముందు శ్రీ విజయాదిత్య దేవర ఎత్తించిన కరవాల కుండపశాసనం ఒకటి ఆలయంలో వుంది.

కొన్ని శాసనాల్లో గోస్తనీనది 'గోధన్తని' అని వ్రాయబడి వుంది. గూధన్తని అని కూడా ఓ శాసనంలో వుంది. హిందువులే కాక మహమ్మదీయులు కూడా శ్రీ వాసుకి రవిసోమేశ్వరునకు దానమిచ్చినట్లు శాసనాలున్నాయి.

క్రీస్తు శకము 1583 సెప్టెంబరు 15న మహమ్మదు ఖుల్లి పాదుషా ఆజ్ఞ ప్రకారం శ్రీ వాసుకీ రవి సోమేశ్వరుని పునఃప్రతిష్ట జరిగింది. నత్తా రామేశ్వరంలోని నత్తరామలింగమును కూడా పునఃప్రతిష్ట చేసినట్లు ఈ శాసనంలో వుంది.

చాళుక్య వంశపురాజు శ్రీ వీరభద్రేశ్వరుడు కాకతీయ గణపతి దేవుని పుత్రిక రుద్రమదేవిని వివాహమాడాడు. శ్రీ వీరభద్రేశ్వరుని మంత్రి విష్ణ (?) జుత్తిగలోని సోమేశ్వర దేవాలయానికి అఖండ దీపమును దానమిచ్చినట్లు మంటపంలో మరో శాసనం వుంది.

ఇచ్చట వున్న శిలాశాసన సంపదల వలన ఈ క్షేత్రమును పూర్వం ఎందరో రాజులుదర్శించారని, అనేకులు దానాలిచ్చారని తెలుస్తోంది. విష్ణువర్ధనుడు, విజయాదిత్యుడు, శక్తివర్మ, కొలనిమహా మండలేశ్వరుడు వీరిలో కొంతమంది. 1920-23 సంవత్సరములలో ఈ ఆలయం జీర్ణోద్ధరణ జరిగింది.

మహాశివ రాత్రికి స్వామి వారి కళ్యాణం మహావైభవోపేతంగా జరుగుతుంది. యాత్రికుల వసతికి జుత్తిగలో స్వామివారి సత్రము వుంది.

## 46) శ్రీ మదన గోపాలస్వామి వారి ఆలయం - మల్లిపూడి

జుత్తిగకి కిలోమీటర్ దూరంలో వుంది ఈ మల్లిపూడి గ్రామం. పూర్వం ఈ గ్రామం అంతా మల్లెపూల తోట వుండేది. ఉమావాసుకీ రవి సోమేశ్వర స్వామి పూజకి కావలసిన పూవులన్నీ ఈ తోటనుంచే తీసుకొచ్చేవారు. అందువల్లనే ఈ గ్రామానికి మల్లిపూడి అని పేరొచ్చింది. జుత్తిగ వాస్తవ్యులు శ్రీ నత్తిరాజు సోమయ్య గారి సోదరి సూరంపూడి లచ్చమ్మగారు ఈ మల్లెతోటలో క్రీస్తు శకము 12వ శతాబ్దములో గోపీనాధుడు అను పేరుతో ఈ మదన గోపాలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయం కట్టించారు.

కొంత కాలానికి సూరంపూడి లచ్చమ్మ గారి కుటుంబం క్షీణించింది. దేవాలయం కూడా శిధిలమై స్వామి వారి విగ్రహం సైతం భూమిలో కప్పబడిపోయి అదృశ్యమైపోయింది.

మరి కొంతకాలానికి ఈ గ్రామానికి 'దుండు' వారు అనే క్షత్రియులు వచ్చారు. వారిలో ఓ భక్తునికి గోపీనాధుడు కలలో కన్పించి తాను వున్న ప్రదేశాన్ని చెప్పి తన విగ్రహాన్ని బయటకు తీసి ఆలయాన్ని నిర్మించి, నిత్యధూప దీప నైవేద్యాలను జరిపించమని ఆనతిచ్చాడు.

ఆ ప్రకారంగా ఆ భక్తుడు మల్లెతోట త్రవ్విస్తే శ్రీ గోపినాధ స్వామి వారి విగ్రహం బయటపడింది. ఈ విగ్రహానికి భక్తులు పూజలు చేసి మరలా ఆలయాన్ని పునరుద్ధరించారు. కాలక్రమేణా గోపీనాధుడు శ్రీ మదన గోపాలస్వామి అయ్యాడు.

నిత్యపుష్కరిణి, ఉత్తర వాహిని అయిన గోస్తనీ నది నత్తారామేశ్వరం, జుత్తిగల నంటి ప్రవహించి ఈ మదన గోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణాన్ని కూడా స్పృశిస్తుంది. ఈ మూడు గ్రామాలు పుణ్యస్థలాలు.

శ్రీ మదనగోపాలస్వామి వారికి పెద్ద రాజగోపురం కూడా వుంది. కొబ్బరితోట కూడా వుంది. ఆ తోటను అంటుతూ గోస్తనీ నది ప్రవహిస్తుంది. ఆలయ ధ్వజ స్తంభము వద్ద పూర్వము నుంచి వున్న శ్రీ ఆంజనేయస్వామి వారి చిన్న ఆలయం పునరుద్ధరించబడింది.

తులసి, పలురకముల పూల మొక్కలు వున్న శోభాయమానమైన ఓ తోట స్వామి వారికి వుంది. శుద్ధ ఏకాదశి మొదలు పౌర్ణమి వరకూ శ్రీ మదన గోపాలస్వామి వారి కళ్యాణం జరుగుతుంది.


పూర్వము ఈ గ్రామంలో రక-రకాల భయాలు వుండేవి. ఓ రాత్రి స్వామి ఓ భక్తుని కలలో కన్పించి వైశాఖ మాసమంతా తనకు పానకం నైవేద్యం చేయమని చెప్పాడు అలా చేయడం ప్రారంభించినప్పటి నుంచి గ్రామంలో భయాలు తొలగిపోయాయి.

తొలి ఏకాదశికి శ్రీ కృష్ణ జయంతి, వినాయక చవితి, దేవీ నవరాత్రులు, ధనుర్మాసము ఇక్కడ జరిగే పండుగలు !

## 47) శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం - నత్తా రామేశ్వరం

గోస్తనీ నది తీరములో వున్న పుణ్య క్షేత్రముల్లో నత్తా రామేశ్వరం అతి ప్రాచీనమైనది. నిడదవోలు - నరసాపురం రైలు మార్గంలో మంచిలి స్టేషన్‌కి మూడు కిలోమీటర్ల దూరంలో, పెనుమంట్ర మండలంలో వున్న నత్తా రామేశ్వరానికి బస్సు సౌకర్యం వుంది.

వ్యాసునిచే రచించబడిన అష్టా దశ పురాణములలో వాయు పురాణంలో పన్నెండు వేల శ్లోకాలున్నాయి. అందులో ప్రస్తుతం ఏడువేల శ్లోకాలు మాత్రమే అందుబాటులో వున్నాయి అందులో 51వ అధ్యాయంలో బ్రహ్మ నారదునితో గోస్తనీ నదీతీరంలోని శ్రీ రామేశ్వరస్వామి వారి ఆలయం గురించి వర్ణించాడు.



శ్రీ రామేశ్వరస్వామి వారి ఆలయ గోపురం, నత్తారామేశ్వరం

పూర్వం అంగుడను రాజు ధృవుని సంతానంగా పుట్టాడు. మహా దుర్మార్గుడని పేరు పొందిన వేనుడు ఆ అంగుని కుమారుడు. వేనుని రాజ్యపాలన లోక కంటకముగా వుండేది. వేనుడు యజ్ఞయాగాలను నిషేధించాడు. దైవభక్తికి బదులు రాజభక్తికే ప్రాధాన్యం ఇచ్చాడారాజు

వేద పఠనాలు, దానం, జపం అదీ ఇదీ అని ఏముంది ? అన్ని సదాచారాలను నిషేధించాడతను. అలా కొంతకాలంపాటు రాజ్యపాలన సాగింది. దేశంలో అన్ని చోట్ల దుర్భిక్షము ఏర్పడిపోయింది. వర్షాభావం చేత పంటలే లేవు. ఆహారము కూడా లేక ప్రజలు నానా బాధలు పడాల్సి వచ్చింది. గట్టుప్రజలు దేశాన్ని విడిచిపోవాల్సిన పరిస్థితి వచ్చింది.

మహర్షులు రాజు దగ్గరకెళ్ళి హితబోధ చేశారు. కాని వేనుడు వినలేదు సరికదా వచ్చిన వాళ్లందర్నీ చెరసాలలో పెట్టించాడు. భగవంతుడ్ని తిట్టాడు. చివరకు ఋషులు ఇచ్చిన శాపం కారణంగా వేనుడు నాశనం అయ్యాడు.

మృతి చెందిన వేనుని శరీరాన్ని మునులు మధించారు. అతని కుడిచేతిలోంచి పృధు అనే పురుషుడు, ఎడమచేతి నుంచి అర్చీ అనే స్త్రీ ఉదయించారు. భగవంతుని అంశతో జన్మించినవారు కావడంతో పృధువుని ఋషులంతా కలసి రాజుగా చేశారు.

పృధువు సక్రమంగా పాలించి దేశంలో తిరిగి ధర్మాన్ని ప్రతిష్ఠించాడు. పృధువు రాజ్యపాలన

చేపట్టే నాటికి భూమి సేద్యయోగంగా లేదు దేశమంతా అడవులు కొండలు, పొదలు, ఎడారులు, నీరు దొరకడం కష్టంగా వుంది. కరువు విజృంభించడంతో ప్రజలు తిండిలేక ఎన్నో కష్టాల పాలయ్యారు

పృధు చక్రవర్తి తన వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రజలకు పంచి ఇచ్చాడు. కానీ అవి మాత్రం ఎంత కాలం సరిపోతాయి? రాజు క్షామాన్ని అరికట్టలేకపోయాడు. ఆగ్రహంతో భూదేవి మీద బాణాన్ని సంధించాడు.

భూదేవి భయపడిపోయి గోవు రూపంలో పరిగెత్తింది. ఆమెనెవరూ రక్షించలేకపోయారు చివరకు రాజునే ఆమె శరణు వేడింది

"అధర్మం ప్రబలిపోయింది. యజ్ఞయాగాలు చేసేవారు లేరు. ఓషదులన్నీ నా గర్భంలో దాచుకున్నాను. ఒక ఉత్తమ పురుషుడ్ని దూడగా చేసి అతని చేత నా పాలు పితికించు. లోకము తిరిగి సుభిక్షంగా వుంటుంది." అని భూదేవి పృధువుతో చెప్పింది.

తన చేతిని పాత్రగా, మనువును ధూడగా చేసి పృధువు గోమాతను పితికాడు. ఆహార ధాన్యములు, ఔషధులు, అప్పుడు బయలుదేరాయి. పృధ్వి పాలను వర్షించింది ఆ క్షీరధారలు ప్రవాహములుగా మారి గోస్తనీ ఉద్భవించింది. సర్వమూ సస్యశ్యామలమయింది. పృధువు చక్రవర్తి అయ్యాడు.

జమదగ్ని మహాముని భార్య రేణుకాదేవి. ఆ జంటకు నూట ఎనమండుగురు కుమారులు. వారిలో పరశురాముడొకడు. ఒక రోజు రేణుకాదేవి భర్త ఆనతి మీద నీటి కోసం నదికి వెళ్ళింది. కార్తవీర్యార్జునుడు అనే రాజు తన విలాస క్రీడకోసం నదీ ప్రవాహానికి అంతరాయం కలిగించాడు.

రేణుకాదేవి కార్తవీర్యార్జునుడుని చూసి, అతని శక్తికి ఆశ్చర్యపోయింది. ఇంతలో ఆమె చేతిలోని కుండజారి క్రింద పడి పగిలిపోయింది. వేరొక కుండలో ఆమె నీటిని తీసుకుని ఆశ్రమానికొచ్చేసరికి బాగా ఆలస్యమయింది.

జమదగ్ని దివ్యదృష్టితో జరిగిందంతా గ్రహించి కుమారులను పిలిచి 'మీ తల్లి మహాపాపి ! ఆమెను చంపేయండి !" అని శాసించాడు. పరశురాముడు తప్ప మిగిలిన వారంతా తల్లిని చంపడానికి వెనుకాడారు.

తల్లిని చంపితే పాపం ! తండ్రి ఆజ్ఞని తిరస్కరించినా పాపమే అని ఆలోచించి పరశురాముడు తండ్రి చెప్పినట్లే తల్లి శిరస్సు ఖండించాడు. సోదరులను సహితం చంపేశాడు. అతని పితృవాక్య పరిపాలనకు జమదగ్ని సంతోషించి పరశురాముడ్ని ఏదైనా వరం కోరుకోమన్నాడు.


అతని కోరికపై రేణుకాదేవిని, కొడుకులను తిరిగి బ్రతికించాడు జమదగ్ని. కానీ పరశురామునికి తల్లి, సోదరులను చంపిన పాప ఫలితం అనుభవించక తప్పలేదు. దేహమంతా దహించుకుపోయి నల్లబడిపోయింది ఆ పాపం పోయే మార్గం తెలపమని తండ్రిని ప్రార్థించాడు.

'గోస్తనీ నదిలో స్నానం చేస్తే నీ పాపం హరించుకుపోతుంది. నువ్వానదికి పోయి ఎక్కడ మధ్యాహ్న సమయంలో ప్రణవనాధం విన్పిస్తుందో అక్కడ స్నానం చేసి ఆ తీరంలో ఓ ఈశ్వర లింగాన్ని ప్రతిష్టించి పూజించు" అని చెప్పాడు జమదగ్ని

పరశురాముడు తండ్రి చెప్పినట్లు చేసేసరికి ఆయన శరీరం యధాస్థితికి వచ్చేసింది భార్గవుడు ఇసుకతో ఒక లింగాన్ని చేసి గోస్తనీ నది మధ్యలో ప్రతిష్టించాడు ఆ విధముగా పరశురాముడుచే ప్రతిష్ట చేయబడిన నత్తారామేశ్వరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి గోస్తనీ నదీ జలములోనే వుంటాడు. వేసవిలో ఒక నెల మాత్రం ఆయనని దర్శించవచ్చు. (నీటిలో వున్న దేవాలయాన్ని వెనుక పేజీ టైటిల్‌లో క్రింద మధ్యలో చూడవచ్చు) దీన్ని సప్తకోటీశ్వర లింగమని కూడా అంటారు

## 48) శ్రీ రామేశ్వరస్వామి వారి ఆలయం - నత్తారామేశ్వరం

శివపూజాదురంధరుడయిన రావణుడ్ని సంహరించిన శ్రీరామునికి కొంత పాపం అంటింది. దాన్ని వదిలించుకోవడానికి బ్రహ్మ ఉపదేశించిన ప్రకారం దక్షిణ సముద్ర తీరములో వున్న రామేశ్వరం వద్ద శ్రీరాముడు ఈశ్వరుడ్ని ప్రతిష్టించాడు.



*శ్రీ రామేశ్వరస్వామి ఆలయం, నత్తారామేశ్వరం*

పరశురాముని చేత ప్రతిష్టించబడిన శ్రీరామ లింగేశ్వరునికి సమీపంలోనే శ్రీరాముడు వేరొక ఈశ్వర లింగమును సీతాదేవి కోరిక మీద ప్రతిష్టించదలిచాడు.

లంక నుంచి అయోధ్యకు సీతారామ లక్ష్మణులు తిరిగి వస్తుండగా ఈ ప్రదేశంలో ప్రతిష్ఠ చేయడానికి ఒక బాణమును తెమ్మని శ్రీరాముడు హనుమంతుడ్ని పంపాడు. అంజనేయుడు దాన్ని తేవడంలో కొంచెం ఆలస్యమయింది. నిర్ణయించబడిన ముహూర్తమునకే శివలింగ ప్రతిష్ఠ చేయాలని జానకీదేవి నత్తలను, ఇసుకను ప్రోగుచేసి లింగముగా తయారు చేసింది. సీతాదేవి కోరిక మేరకు ఆ లింగమునే ప్రతిష్ట చేశాడు శ్రీరాముడు.

అదే రామేశ్వరలింగము. నత్తలతో కూడి వుంది గనుక నత్తరామేశ్వర లింగమయి ఈ వూరి

పేరే నత్తా రామేశ్వరమయింది. శంభూక రామేశ్వరమని కూడా మరో పేరుంది గోస్తనీకి తూర్పు ఒడ్డున లక్ష్మణుడు ప్రతిష్ట చేసిన లక్ష్మణేశ్వర ఆలయం వుంది. నత్తా రామేశ్వర ఆలయ ప్రాంగణంలో వీరభద్ర, కాలభైరవ, సుబ్రమణ్య, ఆంజనేయస్వామి ఆలయాలు కూడా వున్నాయి.

పరశురాముడు ఇక్కడ గోస్తనీ తీరములో తొమ్మిది వేల సంవత్సరములు ఏకాగ్రచిత్తముతో తపస్సు చేసినట్లుగా పురాణాల్లో వుంది. శ్రీరామ లింగేశ్వరస్వామి, శ్రీరామేశ్వరస్వామి ఒకే ప్రాంగణంలో కొలువై వుండటం విశేషం.


ఈ దేవస్థానాన్ని క్రీస్తు శకం 1583 సెప్టెంబరు 15వ తేదీన ఖుల్లీపాదుషా అజ్ఞ ప్రకారం పునఃప్రతిష్ఠ చేసినట్లు జుత్తిగ శాసనాన్ని బట్టి తెలుస్తుంది. ఇక్కడ మహా శివరాత్రి పర్వదినం చాలా వైభవంగా జరుగుతుంది వేల సంఖ్యలో వచ్చే భక్తులకి ఉచిత అన్నదానాన్ని దేవస్థానం ఏర్పాటు చేస్తుంది.

## 49) శ్రీ మదనగోపాలస్వామి వారి ఆలయం - బల్లిపాడు

తణుకు - భీమవరం రైల్వే లైన్‌లో అత్తిలి స్టేషన్‌లో దిగితే, అక్కడ నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో వుంది బల్లిపాడు గ్రామం. అత్తిలి మండలంలోని ఈ గ్రామానికి మంచిలి రైల్వేస్టేషన్‌లో దిగి కూడా బల్లిపాడు పోవచ్చు.

దిన దిన ప్రవర్ధమానమవుతున్న శ్రీ మదనగోపాలస్వామి వారి దేవస్థానం ఈ గ్రామంలో వుంది. 1970 జూన్ నెలలో ఇది దివ్యక్షేత్రమయింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ద్వారకా తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుని తరువాత సిరిసంపదలకు బల్లిపాడులోని శ్రీ మదన గోపాలస్వామే అంటారు.

ఈ స్వామిలో శ్రీ వేంకటేశ్వరస్వామి అంశ వుందని ప్రతీతి ! శ్రీ మదనగోపాలస్వామి వారి



శ్రీ మదనగోపాలస్వామి వారి ఆలయం, బల్లిపాడు

ఆలయం క్రీస్తు శకము 1773లో బల్లిపాడు గ్రామకరణము శ్రీ పెమ్మరాజు కొనయ్యగారిచే నిర్మించబడింది.

క్రీస్తు శకము 19వ శతాబ్దం మొదటి భాగంలో ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ధర్మకర్తలకు, అర్చకులకు వివాదాలు వచ్చాయి. అప్పుడు కొంతకాలం ఆ స్వామికి నిత్యదూప దీప నైవేద్యాలకు అంతరాయం కలిగింది.

ఆ సమయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి అంశ ద్వారకాతిరుమల నుంచి బల్లిపాడు శ్రీ మదనగోపాలస్వామిలో ప్రవేశించిందని ప్రతీతి. ఆ కారణంవల్లనే నిత్యారాధనలో శ్రీ మదన గోపాలస్వామికి నమోవాకములు 'అలమేలు మంగా సమేతా శ్రీ వెంకటేశ్వరస్వామియే నమః' అని కూడా ఒక శతాబ్దం నుంచి చెల్లించడం ఆచారం.

ఈ స్వామి ప్రత్యక్ష దైవమని భక్తులనేకులు తమ స్వానుభవాలను వివరిస్తున్నారు. ఒకప్పుడు ఈ ఆలయంలో దొంగలు పడి స్వామి వారి వెండి వస్తువులను కొన్నింటిని అపహరించారు. ధర్మకర్తలకు స్వామి కలలో కన్పించి ఆ వస్తువులు వున్న చోట చూపించాడు. వెంటనే వెళితే ఆ వస్తువులన్నీ దొరికాయట !

ఓ రాత్రి ఆలయంలోని 'నందా దీపము ఆరిపోయిందట ! అర్చకుడు తన ఇంట్లో నిద్రిస్తుండగా అతనికి కలలో స్వామి కన్పించి ఈ విషయం చెప్పి హెచ్చరించాడు. అర్చకుడు మేలుకుని ఆలయానికి వెళ్ళి చూస్తే నందా దీపము వెలగడం లేదు.

మరోసారి స్వామికి నివేదించిన ప్రసాదం సరిగ్గా తయారుచేయబడలేదట. స్వామి ప్రసాదాన్ని స్వీకరించకుండా ఉపవాసముండిపోయినట్లుగా అర్చకుడికి కలలో కన్పించి చెప్పాడట. అర్చకుడు విచారించి ప్రసాదానికి వుపయోగించిన బియ్యంలో రాళ్ళున్నట్లు తెలుసుకున్నాడట.

ఇలాంటి ఘటనలు ఎన్నో భక్తులలో ప్రచారంలో వున్నాయి. శ్రీ కృష్ణాష్టమి, ధనుర్మాసము, వైకుంఠ ఏకాదశి కళ్యాణోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

## 50) శ్రీ కేశవస్వామి వారి ఆలయం - మండపాక

తణుకుకి సుమారు అయిదు కిలోమీటర్ల దూరంలో, తణుకు మండలంలో వుంది మండపాక గ్రామం. బస్సు సౌకర్యం వున్న ఈ గ్రామంలో వున్న పురాతన ఆలయాల్లో శ్రీ కేశవస్వామివారి ఆలయం ఒకటి !

పూర్వము మాండవ్య మహర్షి ఇక్కడ ఆశ్రమాన్ని నిర్మించుకుని తపస్సు చేశాడు. కనుక ఈ ప్రదేశానికి 'మాండవ్య క్షేత్రము' అని పేరొచ్చింది. అది క్రమేణా మండపాకగా మారింది. మాండవ్యుని ఆశ్రమము గోదావరి శాఖ ఒడ్డున వుండేది. ఆ గోదావరి నది శాఖే ప్రస్తుతం మడుగు అని పిలవబడుతుంది.

ఇప్పుడు ఈ గ్రామమున్న ప్రదేశమంతా పూర్వం ఒక బహిరంగ ప్రదేశము. ఇప్పుడున్న గ్రామానికి పడమరనగల పెదపాడు చినపాడు అన్న స్థలాల దగ్గర ఓ గ్రామం వుండేది. అప్పుడు ఈ ప్రాంతంలో పచ్చిబీళ్ళు, నీటి మడుగు వుండేవట ! అక్కడ గొల్లలు మందలు, మందలుగా గొర్రెలుని ఈ మడుగు తీర ప్రాంతంలో మేపేవారు.

ఒక రోజున ఈ తీర ప్రాంతంలో ఓ చోట భూమిలో నుండి మంగళవాద్యములు ఓంకారనాదం విన్పించాయి. ఈ నాదమును విని ప్రజలంతా ఆశ్చర్యంతో వచ్చి, పరిశీలించి చూసి, త్రవ్వారు. త్రవ్వగా శ్రీ కేశవస్వామి విగ్రహం దర్శనమిచ్చింది ఈ విషయం తెల్సుకుని శ్రీ ధర్మ అప్పారావు గారు శ్రీ స్వామి వారికి ఆలయం, మంటపము, గోపురం నిర్మించారు

పెదపాడు, చినపాడు వద్ద గల ప్రజలు ఈ దేవాలయ ప్రాంతానికి వచ్చారు మందలు - మందలుగా ఇక్కడ పశువులున్నందువల్ల ఈ గ్రామానికి 'మందపాక' అని పేరొచ్చిందని చెబుతారు ఆ మందపాక కాలక్రమంలో 'మండపాక' అయింది.,

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి విగ్రహము బహుసుందరమైనది సాల గ్రామశిల నుండి మలచ బడింది. ర్యాలిలోని శ్రీ జగన్మోహినీ కేశవస్వామి విగ్రహమే విగ్రహం. దాని తర్వాత మండపాక కేశవస్వామి విగ్రహమే విగ్రహము. ఈ కేశవుడు సుమారు ఆరడగుల ఎత్తుంటాడు. పూర్వ కాలంలో మాండవ్య మహర్షి ఈ విగ్రహాన్నే ప్రతిష్ట చేశారు.



శ్రీ కేశవస్వామి వారి ఆలయ గోపురం, మండపాక

కేశవస్వామి ఆలయం వున్న చోట పూర్వము ఒక చిన్న శిథిలమైన దేవాలయం వుండేదట ! ఒక రోజున గ్రామస్తులంతా ఒకానొక ఉత్సవ సందర్భంలో దేవాలయం దగ్గర వున్నారు. అప్పుడు ఆ శిథిల దేవాలయ మంటపం పడిపోయిందట. వెంటనే గ్రామస్థులు నూజివీడు జమీందారు శ్రీ ధర్మ అప్పారావు గార్ని ఆలయం కట్టించవలసిందిగా కోరారు

ఆ జమిందారు ఆలయ నిర్మాణ నిమిత్తం పుట్టలు త్రవ్వించాడు. పుట్టల నుంచి పెద్ద కేశవస్వామి (ఇప్పుడున్న) విగ్రహం బయటపడింది. ఆలయ పునాదులు కూడా కొన్ని కన్పించాయి. ఆలయం ఆ పురాతన ఆలయ పునాదుల మీదే తిరిగి నిర్మించబడింది. గోపురం కూడా కట్టించారు.

ఆలయ నిర్మాణం ఒక మూగ వానిచేత జరిగిందని చెపుతారు. క్రీస్తు శకం 12వ శతాబ్దములో కాకతీయ సామ్రాజ్యమునకు సర్వసేనానిగా వున్న శ్రీ మేకా బసవ దండనాధుని విగ్రహం ఆలయ మంటపంపై భాగములో శాసనంతో వుంది క్రీస్తు శకం 1785-1827 సంవత్సరముల మధ్యకాలములో దేవాలయ పునర్నిర్మాణం జరిగింది. ఆలయములో ఒక ఇత్తడి విగ్రహం మీద ఈ క్రింద శాసనం వుంది

"శ్రీ ప్రభవకాతి ఏక బంగు మండ్డపాక
ప్రతాపరాయంకు ఇవి గ్రహింక
ముల జంన్నయ సమప్ప కాణశ్రీ
శ్రీ శ్రీయ్యుంజయునూ...

శ్రీ స్వామి వారికి వైఖాను సాగమ శాస్త్రరీత్యా అర్చనాది కైంకర్యములు జరుగుతాయి. శ్రీ కేశవస్వామి ఈ పరిసరాల్లో వున్న పంచకేశవుల్లో ఒకరు మిగిలిన వారు ర్యాలి, తణుకు, దువ్వ, కొత్తాలపర్రుల్లో వున్నారు.

స్వామికి ఫాల్గుణ శుద్ధ దశమి మొదలు బహుళ పాడ్యమి వరకూ కళ్యాణ ఉత్సవాలు, ఉగాదికి, శ్రీ కృష్ణజయంతికి, విజయదశమికి, దీపావళికి, క్షీరాబ్ధి ద్వాదశికి, ముక్కోటి ఏకాదశికి, సంక్రాంతికి, కార్తీకమాసము, ధనుర్మాసములలో విశేషోత్సవాలు జరుగుతాయి.

పెదపాడు, చినపాడుల దగ్గర పూర్వం చిన్నది శ్రీ కేశవస్వామి విగ్రహం దొరికిందని, దాన్నే దువ్వ గ్రామానికి తీసుకెళ్ళి ప్రతిష్ఠించారని తెలుస్తోంది.

ఈ గ్రామంలోవున్న మరో కోవెల శ్రీ సోమేశ్వరస్వామి వారి ఆలయం. 1945లో శ్రీ సుబ్బమ్మ అనుభక్తురాలు ప్రతిష్టించింది స్వామివార్ని. అప్పటి నుంచి స్వామికి ప్రతీ సంవత్సరము మాఘ బహుళ ఏకాదశి మొదలు అమావాస్య వరకూ కళ్యాణమహోత్సవం జరుగుతుంది.

అష్టాదశ పీఠ మహాశక్తుల్లో ఏకవీరాదేవి ఒకరు. శ్రీనాధ మహాకవికృత క్రీడాభిరామంలో ఏకవీరా దేవి గురించి వర్ణించాడు. ఏకవీరాదేవి కాకతమ్మకి సైదోడుగా మండపాక, పునుబాక, మహురము, నాగవరము, పాలన, ఓరుగల్లు అనే గ్రామాల్లో నివసించినట్లు వ్రాయబడి వుంది. చరిత్ర పరిశోధకులు ఎల్లారమ్మ దేవాలయం సందర్శించి "కాక తమ్మకు సైదోడు ఏకవీరు" అన్న విషయంపై భారతి పత్రికలో వివరంగా చర్చించి, విస్తుర్పించారు.

ఈ దేవి ఆలయంలో శ్రీ ఎల్లారమ్మ సంపూర్ణ విగ్రహమే గాక, వేరుగా ఒక శిరస్సు, పాదములు కూడా వున్నాయి. శిరస్సు ఏకవీర అని, సంపూర్ణ విగ్రహం కాకతమ్మ అని పరిశోధకుల అభిప్రాయం.

బహుసుందరంగా సాలగ్రామశిలతో తయారు చెయ్యబడ్డ ఎల్లారమ్మ విగ్రహం, ముందు కుడిచేతిలో ఖడ్గము, వెనుక కుడిచేతిలో ఢమరుకము, ముందు ఎడమ చేతిలో పాన పాత్ర, వెనుక ఎడమ చేతిలో త్రిశూలం వున్నాయి. అమ్మవారి పాదాల దగ్గర ఓ జంతువు వుంది. గ్రామ దేవత అయినప్పటికీ అమ్మవారికి వెలనాటి బ్రాహ్మణులతో వేదోక్తముగా నిత్యార్చనలు, నిత్య మహర్ని వేదములు జరుగుతాయి.

ఈ ఆలయ ప్రాకారము వెలుపల ఓ శిధిలమైన నంది విగ్రహం వుంది. కోమటి అను విగ్రహం

వెనుకవైపున గల శాసనం క్రీస్తు శకం 14వ శతాబ్దం నాటిది. భక్తులు అమ్మవారికి సహస్రనామార్చన చేయించుకున్న తర్వాత అమ్మవారి కిరీటంపై పుష్పములు వుంచి దండకం చదువుతారు. భక్తుల కోర్కెలు సఫలమవుతుందని సూచిస్తే అమ్మవారి కిరీటం నుంచి పుష్పములు క్రిందపడతాయి.

ఆ పుష్పాలను ప్రసాదించినపుడు భక్తుల శరీరమంతా పులకరిస్తుంది. భక్తుల శ్రద్ధలోగానీ, మొక్కుబడిలలో గాని ఏదైనా లోపం వుంటే ఒక్క పుష్పమైనా క్రిందపడకుండా అలా వ్రేలాడుతూనే వుంటాయి. కొంతసేపటికి వారికే ఆ లోపాలను గుర్తు తెప్పించి దేవి పుష్పాన్ని ప్రసాదిస్తుంది. ఇలాంటి అనుభవాలెన్నో భక్తులకు కలిగినట్లు స్థానికులు చెబుతున్నారు. 1924లో మండపాక గ్రామస్థులచే ఓ ముఖమంటపము నిర్మించబడింది. ఆనాటి నుంచి శ్రీ అనిపెద్ది జగన్నాథశాస్త్రి గారు వ్రాసిన దండకాన్ని అమ్మవారి సన్నిధిలో చదువుతున్నారు. అంతకుముందు కాళిదాసకృత కాళీ దండకం చదివేవారు.

చైత్రశుద్ధ, పౌర్ణమికి ఎల్లారమ్మ తీర్థం జరుగుతుంది ఆ సాయంత్రం సిరిబండి ఉత్సవం జరుగుతుంది. రెండో రోజు అనగా చైత్రబహుళ పాడ్యమినాడు అమ్మవారి ఆలయంలో పళ్ళు, పానకం వుంచి తలుపు మూసి మూడు రోజుల వరకూ తలుపుతీయరు. ఈ ఆచారము చాలా కాలం నుంచి వస్తోంది. తలుపులు మూసిన తర్వాత విదియరోజున అమ్మవార్కి మహానివేదన చెయ్యరు.

సాధారణంగా ఈ మూడు రోజులు ఎవరూ గ్రామం వదలి వెళ్ళకూడదని నియమం వుంది. ఒకప్పుడు అమ్మవారి అర్చకులయిన శ్రీ కోటయ్య ఆలయంలో ఓ వెండి గిన్నె మరచిపోయి చైత్ర బహుళ పాడ్యమి రోజున ఆలయ తలుపులు వేసి ఇంటికి వెళ్ళాడట. తిరిగి గిన్నెకోసం ఆలయానికి వచ్చి దేవిని బయటనుంచి ప్రార్థిస్తే దేవి కవాటం ద్వారా గిన్నెను విసిరేసి ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని ఆజ్ఞాపించిందట.

తరువాత శ్రీ కోటయ్య అభ్యంగనం చేసేటప్పుడు భార్య దగ్గర వున్న ఆ గిన్నెను చూసి చిరునవ్వు నవ్వాడు. "ఎందుకు నవ్వుతున్నారు ?" అని భార్య అడిగితే రహస్యమంతా ఆమెకు చెప్పాడు కోటయ్య. వెంటనే అతని శిరస్సు పగిలి మరణించాడు. దేవి ఆనతిని జవదాటినందుకు ఫలితం అనుభవించాడు.

ఈ గ్రామానికి తరతరాలుగా మున్సబుగా వున్న 'పరిమి' ఇంటిపేరు గల కమ్మవారు ఎల్లారమ్మను తమ ఇంటి ఆడబడుచుగా భావిస్తారు. అలాగే మండపాక ఇంటిపేరు గల నియోగి బ్రాహ్మణులు కూడా అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచు అంటారు.

పూర్వం మండపాకకు కరణంగా వున్న శేషయ్యకు ఆరుగురు కుమార్తెలు ఆయనోరోజున గాజులశెట్టిని తన భార్యకు, ఆరుగురు కూతుళ్ళకు గాజులు వేయమని చెప్పి తన పనిచూసుకుంటున్నాడు. సాయంత్రం వరుసగా ఆర్గురు పిల్లలు, తల్లి గాజులు వేయించుకుని ఇంట్లోకి వెళ్ళారు.

అప్పుడు ఊదారంగు జాకెట్, ఊదారంగు పావడా ధరించిన ఒక బాలిక వచ్చి తనుకూడా గాజులు వేయించుకుని లోపలకు వెళ్ళింది. గాజుల శెట్టి మొత్తం ఎనిమిదిమందికి వేసిన గాజులకి డబ్బు అడిగాడు.

"నాకు ఆరుగురే ఆడపిల్లలు. ఏడవది ఎక్కడ నుంచి వచ్చింది ? నువ్వు ఆమెకు ఎలా గాజులు ఏలా వేశావ్ ?" అంటూ గద్దించి తన భార్యా పిల్లలకు వేసిన గాజులకి మాత్రమే సొమ్ము చెల్లించాడు కరణం.

ఆ రాత్రి నిద్రలో ఎల్లారమ్మ శేషయ్య వెన్నుతట్టిలేపి "నేను ఎల్లారమ్మను. నీ ఏడవ కుమార్తెను. నేనే గాజులు వేయించుకున్నాను. పరిమి వారి పసుపు తోటలో వెలుస్తాను. గాజుల వాడు నిర్దోషి. ఆ వీధిలో కమ్మవారి అరుగు మీద పడుకుని వున్నాడు. వుదయం వాడ్ని పిలిపించి నా గాజుల ఖరీదుకూడా ఇచ్చేయ్ !" అని చెప్పింది మర్నాడు ఉదయం గాజుల మలారం శెట్టిని పిలిచి కరణం గారు క్షమార్పణ చెప్పని డబ్బు ఇచ్చేశాడు.

శ్రీ పరిమి వెంకప్ప అనాడు గ్రామ మునసబు. ఆయన పసుపు తోట (ఇపుడు శ్రీ ఎల్లారమ్మ గుడి వున్న ప్రాంతం. పాలేరు దున్నుతుండగా నాగలి సాలు పట్టుపట్టింది అతను బలవంతంగా తోలగా ఎడ్లపాదములనుంచి రక్తం కారింది. అది చూసి పాలేరు రక్తంకక్కుకుని ఇంటికి వచ్చిన మరణించాడు. పరిమి వెంకప్పగారు ఆ ప్రాంతానికి వచ్చి మట్టి ని జాగ్రత్తగా తీసి చూస్తే ఎల్లారమ్మ వారి విగ్రహం, పాదములు, శిరస్సు బయటపడ్డాయి. ఆనాటి నూజివీడు జమిందారు శ్రీ ధర్మా అప్పారావు గారు శ్రీ అమ్మవారికి ఆలయాన్ని నిర్మించాడు.

శ్రీ ఎల్లారమ్మ కరణం గారి కుమార్తె అని స్వయంగా చెప్పినందువల్ల మండపాక వారు ఆమె తమ ఆడపడుచు అనీ, పరిమి వారి పసుపుతోటలో వెలిసినందు వల్ల తమ అడపడుచు అని వారు పరిగణిస్తారు.

పూర్వం మండపాక వారి ఇళ్ళలో పెళ్ళిళ్ళు జరపటానికి ముందు ఎల్లారమ్మ పెద్ద అడపడుచు కనుక ఆమెని పిలుచుకుని వచ్చేవారట ! ఆమెని పిలుచుకురావడం మరచిపోతే ఆ రోజు ఎసళ్ళుకాగేవి కాదట !


ఒకవేళ ఎవరయినా మరచి ఆమెని ఆహ్వానించకపోతే తరువాత తమ తప్పు తెలుసుకుని వెళ్ళి, 'ఎల్లారక్కయ్య ! ఇంటికి రా ! నేను పిలవలేదని ఇక్కడ కూర్చున్నావా ?' అని ఆమెని పిలుచుకు వచ్చే వరకూ ఎసర్లు కాగేవికాదట !

ఈ దేవికి వసంత నవరాత్రులు, శరత్‌నవరాత్రులు, చైత్రశుద్ధి చతుర్దశి నాటి రాత్రి గరగ వుత్సవం, పౌర్ణమి రోజు సాయంత్రం సిరిబండ ఉత్సవం, తీర్థం జరుగుతుంది.

## 51) శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయం - పాలంగి

తణుకుకి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉండ్రాజవరం మండలంలో వున్న గ్రామం పాలంగి. తణుకు నుంచి బస్సు సౌకర్యం వుంది. ఇక్కడ శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి కొలువైయున్నారు.

ఇక్కడ గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో స్మశానానికి సమీపంలో వున్న ఈ ఆలయాన్ని నిర్మించి సుమారు ఎనిమిది వందల సంవత్సరాలు దాటుతోంది. ఈ ఆలయానికి చెందిన స్థల పురాణాన్ని బట్టి ఈ స్వామివారు ఇక్కడ త్రేతాయుగంలో వెలిసినట్లు తెలుస్తోంది.



*శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, పాలంగి*


రావణ సంహానంతరం శ్రీరామచంద్రుడు అయోధ్యకు తరలి వెళుతూ ఈ గ్రామస్తుల కోరిక మీద ఇక్కడ మకాం చేశాడు. ఇక్కడి గ్రామస్థులు, భక్తులు తమ పూజార్థం ఇక్కడ ఒక దేవుడ్ని ప్రతిష్ఠించమని కోరుకున్నారు.

శ్రీరాముడికి ఇష్టమైన దైవం వరవేశ్వరుడు కావడంతో ఇక్కడి గ్రామస్థుల కోరికపై అగ్నిబాణాన్ని ప్రతిష్ఠించాడు. అది అగ్నిబాణం కావడంతో ఎల్లవేళలా అది నీటిలోపలే వుంటుంది.

సర్వసాధారణంగా భక్తులు నీటిలోపల వున్న శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించి తమ మొక్కులను




*నీటిలో శ్రీరామలింగేశ్వరస్వామి , పాలంగి*



గర్భగుడిలో బాలాత్రిపుర సుందరి, పాలంగి

తీర్చుకుంటారు దేవా లయం ప్రక్కనే పుష్కరిణి వుంది. అది గోస్తనీ నదిలోని నీరుతో నిండి వుంటుంది



శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం, పాలంగి

70,497



*గర్భగుడిలో శ్రీ కనకదుర్గమ్మ, పాలంగి*

ఇక్కడ మహా శివరాత్రి ఘనాతిఘనంగా జరుపుతారు. వేలాది మంది భక్తులు హాజరవుతారు. స్వామివారు మహిమ హిమాన్వితులు అనడానికి నిదర్శనాలుగా చాలా సంఘటనలు చెబుతారు స్థానికులు.

పాలించేవాడు ప్రతిష్టించిన వూరు గనుక 'పాలించి' అని ప్రారంభ మయి కాలక్రమేణా అది 'పాలంగి'గా మారింది. ఇక్కడ యాత్రికులకు వసతి సౌకర్యం లేదు.

గ్రామంలోని మెయిన్ రోడ్‌లో వున్న గుడిలో కొలువై వున్నారు శ్రీ కనకదుర్గమ్మ. ఆలయ నిర్మాణం జరిగి ఓ ఇరవై ఏళ్ళే అయినా అమ్మవారు భక్తుల ఇల వేల్పుగా పేరు పొందారు. తేజోవంతమయిన అమ్మ వారి విగ్రహం చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుంది. తప్పక దర్శించాల్సిన క్షేత్రం.

## 52) శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి వారి ఆలయం - ఉండ్రాజవరం



*శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయం, ఉండ్రాజవరం*

తణుకుకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న ఉండ్రాజవరం పురాతనమైన గ్రామమే కాక మండల కేంద్రం కూడా ఈ ప్రాంతాన్ని పూర్వం ఉరగరాజస్వామి పరిపాలిస్తూ, రాజరాజ నరేంద్రునికి సామంతుడుగా వుండేవాడు 'ఉరగం' అనగా సర్పం. సర్పరాజు పరిపాలించాడని, అందువల్లనే ఈ గ్రామాన్ని 'ఉరగరాజవరం' అని పిలిచేవారు. కాలక్రమేణా అది ఉండ్రాజవరం అయింది.

ఇక్కడ వున్న దేవాలయాల్లో శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీ కేశవస్వామివారి కోవెల ఒకటి. ఈ ఆలయ నిర్మాణం జరిగి సుమారు ఎనిమిది వందల సంవత్సరాలకు పైనే అవుతుంది స్వామివారు స్వయంభువు.

అయితే దక్షిణ ప్రాంతంలోని చాలా దేవాల యాలు తురుష్కుల ప్రభావా నికి గురి

అయ్యాయి. శ్రీ కేశవస్వామి కూడా మహమ్మ దీయుల ప్రభావానికి గురి కావడంతో స్వామి వారి ఉపఅంగములు కొన్ని భిన్నమై పోయాయి.




*గర్భగుడిలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి, ఉండ్రాజవరం*


సాధారణంగా ఛిద్ర మైన విగ్రహాలు పూజకు అర్హం కావు. అయితే ఉప అంగములు మాత్రమే ఛిద్రమయితే అవి పూజకు అర్హమైనవే అని ఆగమ శాస్త్రము తెలుపుతోంది. పంచఅంగములు భిన్న మయితే మాత్రం అవి పూజకు పనికిరావు. రాజరాజ నరేంద్రుని కాలంలో ఈ దేవాలయం మంచి ప్రాబల్యంలో వుంది. వైకుంఠ ఏకాదశి, ధనుర్మాసము, వైశాఖ మాసములో కళ్యాణాలు జరుగుతాయి.

ఈ ఆలయ అర్చకులు శ్రీ చక్రవర్తుల నారాయణాచార్యులు గారు. వైశాఖన పద్ధతిలో ఈ గుడిలో అర్చనలు జరుగుతున్నాయి.


ఈ గుడిని ఆనుకుని వున్నది శ్రీ గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయం. సుమారు ఇదికూడా ఎనిమిది వందల సంవత్సరముల క్రితమే నిర్మించారు. ఈ రెండు గుడుల్లోని అర్చకులు ఏడవతరం వారు కావడం విశేషం!



గర్భగుడిలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ కేశవస్వామి, ఉండ్రాజవరం



శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం, ఉండ్రాజవరం



*గర్భగుడిలో శ్రీ సుబ్రమణేశ్వర స్వామి, ఉంగ్రాజవరం*

దేవీ నవరాత్రులు, కార్తీకమాసము, మాఘమాసములో కళ్యాణం ముఖ్య ఉత్సవములు!

ఈ దేవాలయాలకి వెనుకవైపున రెండు ఫర్లాంగుల దూరంలో గోస్తనీ నది ఒడ్డున వుంది శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం! ఈ స్వామి వలనే ఈ ఊరికి 'ఉరగరాజవరం' అని పేరొచ్చిందంటారు.

ఈ గుడి సమీపంలో వున్న గోస్తనీ నదికి 'సుబ్బారాయుడి కాలువ' అని పేరుండటం విశేషం! ఈ దేవాలయాన్ని నిర్మించి సుమారు అయిదు వందల సంవత్సరములకు పైనే అవుతుంది.

ముఖ్య ఉత్సవం శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి చాలా వైభవంగా జరుగుతుంది. స్వామివారి మహిమ అనంతం! ఈనాటికీ ఈ గ్రామాన్ని, ఈ గ్రామ ప్రజల్ని సుబ్బారాయుడు అలాగే కాపాడుతుంటారని అర్చకుల, భక్తుల, గ్రామస్థుల విశ్వాసం!

ఈ గ్రామములోని మూడు దేవాలయాలను భక్తులు తప్పక దర్శించుకు తీరాలి. అయితే యాత్రికులకు వసతి సౌకర్యం లేకపోవడం విచారించాల్సిన విషయము

## 53) శ్రీ గోలింగేశ్వర స్వామివారి ఆలయం - నిడదవోలు

మద్రాసు - కలకత్తా రైల్వేస్టేషన్‌లో నిడదవోలు రైల్వే జంక్షన్. నరసాపురానికి ఇక్కడ నుంచి రైల్వే మార్గం వుంది. ఇది మండల కేంద్రం, పట్టణం కావడంతో అన్ని ప్రదేశాలకు బస్సు సౌకర్యం వుంది. ఇది ఈ జిల్లాలో ఓ ప్రధాన వ్యాపార కేంద్రము



*శ్రీ గోలింగేశ్వర స్వామి వారి దేవస్థానం. నిడదవోలు*

నిడదవోలుని పూర్వం 'నిరవద్యపురం' అని 'నిరవద్యప్రోలు' అని పిలిచేవారు. క్రీ.శ. 699-729 సంవత్సరాలలో 'నిరవద్య' అనే బిరుదు కలిగిన తూర్పు చాళుక్య భూపాలుడు రెండవ విజయాదిత్యుడు దీన్ని ముఖ్యపట్టణంగా పరిపాలించినందువల్ల 'నిరవద్యపురము, నిరవద్యప్రోలు' అని పేర్లొచ్చాయి. ఆంగ్లేయుల పాలనలో ఆ పేర్లు నిడదవోలుగా మారాయి.

నిడదవోలులో లభించిన అనేక శిలాశాసనాలని బట్టి పూర్వం ఇక్కడ ఎన్నో శివాలయాలు ఉండేవని, ఇది గొప్పశైవారాధనా కేంద్రంగా వుండేదని తెలుస్తోంది. పట్టణంలో పలుచోట్ల భూమిని త్రవ్వగా ఏ వినాయకుని విగ్రహమో, నంది విగ్రహమో దొరికేవి. పూర్వం ఇక్కడ వంద శివాలయాలు వుండేవని చరిత్రకారుల విశ్వాసం.

నిడదవోలులో పూర్వమున్న కోట రాజ మహేంద్రవరములోని కోటకు రక్షగా వుండేది. కోట దిబ్బకు అరమైలు దూరములో కోటశక్తి విగ్రహం వుంది. నిడదవోలులో ఎన్నో ప్రాచీన దేవాలయాలు వుండేవి. అవన్నీ క్రీ.శ. 16, 17వ శతాబ్దములలోని మహమ్మదీయుల దండయాత్రలలో నాశనమయ్యాయి. సుందర విగ్రహములు ఎన్నో ముక్కలు చెక్కలయ్యాయి.

దండయాత్రలకు భయపడి హిందువులు కొన్ని విగ్రహాలను భూమిలో దాచి, కొన్నింటిని బావుల్లో పారేశారు. అవి ఒక్కొక్కటే ఇప్పుడు బయటపడుతున్నాయి. పూర్వం ఇక్కడ శ్రీ మహదీశ్వరాలయము, శ్రీ అగస్త్యేశ్వరాలయము, కుమారస్వామి ఆలయం కూడా వుండేవని కొన్ని శాసనాల ద్వారా తెలుస్తోంది.

ఓ మసీదులో ఓ శాసన స్తంభము దొరికింది. అది శక సంవత్సరం 1227 నాటిది. మహదీశ్వర ఆలయంలో స్థాపించడానికి దాన్ని తయారు చేశారు. దేవాలయంలో ఉండాల్సిన శిలాస్తంభాలు మసీదులోకి ఎలా చేరాయో దేవుడికే తెలియాలి.

నిడదవోలుకి సమీపంలో వున్న మల్లిపూడి గ్రామములో దొరికిన శిలాశాసనంలో నిడదవోలు శ్రీ అగస్త్యేశ్వర ఆలయం గురించి వ్రాయబడి వుంది. క్రీ.శ. 1943 సంవత్సరములో నిడదవోలులో కోట దిబ్బను త్రవ్వుతుంటే ఓ పెద్ద శివలింగము, పానపట్టము దొరికాయి. శివలింగాన్ని నిడదవోలు మడుగు దగ్గర ప్రతిష్ఠించారు.

1959లో నిడదవోలు ఉన్నత పాఠశాల ఆవరణలో మట్టి త్రవ్వుతుంటే ఓ సుందర నందీశ్వర విగ్రహం కన్పించింది. సాలగ్రామశిలతో అద్భుత శిల్పంగా చెక్కబడిన విగ్రహం ఇది. మదన గోపాలస్వామి ఆలయ ఆవరణలో శాలివాహనశకం 1199 నాటి శాసనం దొరికింది. దీనిలో మహదీశ్వర కుమారస్వామి ఆలయాలకివ్వబడిన దానాల గురించి పేర్కొన్నారు. 12, 13 శక శతాబ్దములలో మహదేవేశ్వర ఆలయానికి చేసిన దానాల విషయాలు నిడదవోలు మసీదులో దొరికిన శిలాస్తంభం మీద వున్నాయి


శక సంవత్సరం 1227, 1228లో కొన్ని దానములు ఈ గ్రామంలో వున్న చెన్నమల్ల దేవస్వామికి ఇవ్వబడినట్లు, గుర్రాలగుంటలోని చెన్న మల్లీశ్వరస్వామికి, గట్టిందేటి మల్లీశ్వరునకు దానాలిచ్చినట్లు తెలుస్తోంది.

నిడదవోలు పట్టణ మధ్య బజారులో శ్రీ గోలింగేశ్వర ఆలయం వుంది. లోగడ ఈ ప్రాంతమంతా పొదలు, పచ్చిక బయళ్ళుగా ఉండేవి. ఎన్నో పుట్టలతో వున్న ఈ ప్రాంతానికి పశువుల కాపరులు మేతకు పశువుల్ని తోలుకెళ్ళేవారు.

ఓ గోవు మేతకొచ్చి ఓ పుట్టమీద పడుకునే వుండేది. ఆ పుట్టలో ఓ అద్భుత శివలింగము! తనపైన పుట్టపై విశ్రాంతి తీసుకుని పడుకున్న గోవుపాలను పుట్టలో నుంచి పరమశివుడు గోవత్సరూపంలో బయటకు వచ్చి త్రాగిపోవు చుండేవాడు. గోవు ఇంటికి సాయంత్రము తిరిగి వచ్చిన తర్వాత పితకబోతే పాలువచ్చేవి కావు.

ప్రతీరోజూ ఇలాగే కావడంతో యజమాని అనుమానించి ఏ విషయం తెలునుకోగోరి ఓ రోజున అతను కూడా పశువులు మేతమేసి విశ్రాంతి తీసుకున్నచోటకి వచ్చాడు. పొదలచాటున దాక్కుని జరిగిందంతా చూశాడు. అతను పొదలోంచి బయటకొచ్చేసరికి పరమేశ్వరుడు అదృశ్యమైపోయాడు.

యజమాని ఆశ్చర్యంతో పుట్టను త్రవ్వించాడు. లోపల ఈశ్వర లింగం వుంది. త్రవ్వుతుండగా లింగమునకు కొంచెం దెబ్బ కూడా తగిలింది. ఆ దెబ్బతో ఈశ్వరలింగము నుంచి రక్తం కారింది. ఆ దృశ్యం చూసి యజమాని మరణించాడు.



శ్రీ గోలింగేశ్వర స్వామి వారి ఆలయం, నిడదవోలు

గ్రామస్థులు లింగాన్ని పుట్టలోంచి తీసి వేరొకచోట ప్రతిష్ఠ చేయబోతే స్వామి అంగీకరించలేదు. స్వప్నంలో పెద్దలకు కనబడి 'నేనక్కడే ఉంటాను నన్ను ఇక్కడ నుంచి కదిలించద్దు!' అని చెప్పాడు. ఆయన ఆనతి ప్రకారం లింగమును కదిలించకుండా అక్కడే ఆలయాన్ని కట్టించారు.

అదే ఇప్పుడున్న శ్రీ గోలింగేశ్వరాలయం! శ్రీ గోలింగేశ్వరస్వామి మహిమాన్వితుడు. మాఘబహుళ చతుర్థశికి స్వామివారి కళ్యాణం జరుగుతుంది.

ఈ గుడి వున్న రోడ్డు లోనే వుంది శ్రీ నాంగల్యాదేవి ఆలయం. నంగాలమ్మ వంగా వారి ఆడపడుచు. చామర్తివారి కోడలు. ఒకానొకప్పుడు ఈ వరినర ప్రదేశము శత్రురాజుల పాలబడింది. ప్రజలు భయపడి దేశము వదిలి పారిపోయారు. వారిలో కొందరు నిడదవోలుకు వచ్చారు. వారిలో నంగాలమ్మ, ఆమె భర్త కూడా వున్నారు.

శత్రువుల ఆగడంలో ప్రజలు ఆస్తినంతా కోల్పోవడంతో తిండి కూడా లేకపోయింది. ఒకరోజు నంగాలమ్మ తన చేతి బంగారుగాజుని ఒకదాన్ని భర్తకిచ్చి దాన్ని అమ్మి తినుబండారాలు తెమ్మంది. ఆయన వర్తకులకు అమ్ముతుండగా రాజభటులు చూసి "అది మా రాణిగారిది! నువ్వు దొంగిలించి తెచ్చావు!" అన్నారు.

అకారణంగా నిందవేశారు. ఆ రాణిగారిది అటువంటి ఆభరణమే ఒకటి అప్పుడే పోయిందట! నంగాలమ్మను, ఆమె భర్తను విచారణ లేకుండా దోషులని రాజు తీర్పు చెప్పడంతో ఆ ఇరువురూ శిక్షించబడ్డారు. ఈ అవమానాన్ని భరించలేక నంగాలమ్మ కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె శాప ఫలితంగా అక్కడ కొంతకాలం వృక్షములు ఫలించలేదు. నిష్కారణంగా నిందవేసినవారు మరణించారు. ఆమెయే నాంగల్యాదేవి!

అయిదు, ఆరు సంవత్సరాలకోసారి నంగాలమ్మ జాతర జరుగుతుంది. ఇంకా నిడదవోలులో శ్రీ సత్యనారాయణస్వామి, శ్రీ సోమేశ్వరస్వామి, శ్రీ రాజశేఖరస్వామి, శ్రీ మదనగోపాలస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ శివాలయం, శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, శ్రీ సాయిబాబా మందిరం కూడా వున్నాయి.

## 54) శ్రీ వరదగోపాలస్వామి వారి ఆలయం - కొవ్వూరు

మద్రాసు-కలకత్తారైలు మార్గములో గోదావరి స్టేషన్‌కి ముందు స్టేషన్ కొవ్వూరు. విజయవాడకు నూటయాభై ఏడు కిలోమీటర్ల దూరంలో వున్న ఈ కొవ్వూరు మండల కేంద్రమే కాదు, అతిపురాతనమైనది కూడా గోదావరి నదికి కుడివైపున కొవ్వూరు, ఎడమవైపున రాజమండ్రి వున్నాయి.

పూర్వము గౌతమ మహర్షి ఇక్కడ వరదగోపాలస్వామిని ప్రతిష్టించి ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయానికి నాలుగు వైపులా గ్రామం ఏర్పడింది. ఆ గ్రామానికి పూర్వపు పేరు గోవూరు. కాలక్రమేణా అది కొవ్వూరు అయింది.

గౌతమ మహర్షి మహా తపస్సంపన్నుడు. ఒక సమయంలో దేశంలో పన్నెండు సంవత్సరాలు క్షామం వచ్చింది. తిండి లేక జనం మల మల మాడిపోతున్నారు. అప్పుడు తన తపోశక్తితో గౌతమ మహర్షి ఆహారధాన్యాలు పండించి ప్రజలకు పంచిపెట్టేవాడు. ఈశ్వరుడు ఓ గోవు రూపము ధరించి, విఘ్నేశ్వరుడు అవుదూడగా వచ్చి మహర్షి యొక్క పొలం మీద పడి పంటలను నాశనం చేస్తున్నారు.

అది చూసి గౌతమ మహర్షి ఓ దర్భను ఆ గోవుపై విసిరాడు. మాయా రూపంలో వున్న ఆ ఆవు పరుగెత్తుకుపోయి ఆ ప్రాంతంలో ఒక చోట చనిపోయింది. ఆవు మరణించిన చోటు ప్రస్తుతం 'పసివేదల' అని పిలువబడే గ్రామం. గౌతమ మహర్షికి గోహత్యా మహాపాపం చుట్టుకొంది. ఆ పాపం పోగొట్టుకోవడానికి ఓ పవిత్ర స్థలంలో దేవాలయాన్ని నిర్మించాలని సంకల్పిం చాడు.

ఏ దేవుడ్ని ప్రతిష్ఠ చేయాలా అని ఆలోచిస్తు ండగా ఒకనాడు వేణుగోపాల స్వామి, రుక్మిణి సత్యభామ లతో అయన ఎదుట సాక్షాత్కరించి, లోకోద్ధరణకై తాను భూమి మీద అవతరి స్తానని, తనను ఏడు పత్రము లపై తీసుకుని పోయి అవి ఎక్కడ చెడిపోతాయో అక్కడ ఆలయాన్ని నిర్మించమని ఆనతిచ్చాడు.

మర్నాటి ఉదయం మహర్షి గోదావరి నదిలో సూర్యునికి అర్ఘ్యం ఇస్తుండగా అయన చేతిలో గోపాలస్వామి విగ్రహం అవతరించింది. ఈ విషయం ఇతర ఋషులకు తెలిసింది. వారంతా గౌతమ మహర్షి కోరికపై గోపాలస్వామి విగ్రహాన్ని ఆ స్వామి అజ్ఞననుసరించి ప్రతిష్ఠ చేశారు గౌతమ మహర్షి, అహల్య ఈ ప్రతిష్ఠ జరిపారు.

గోపాలస్వామి తలపై నెమలి పింఛం, చేతుల్లో వేణువు, ఎడమకాలిపై కుడికాలు వేసి నిలబడి వున్నాడు. గోపాలస్వామిని భక్తితో సేవించిన వారందరూ స్వామి కృపకు పాత్రులవుతారు. అందువల్ల గోపాలస్వామి వరద గోపాలస్వామి అయ్యాడు

కొవ్వూరు వద్ద గోదావరి పరమపవిత్రమైంది. అఖండ గౌతమి అది! శివుని జటాజూటము నుంచి భూలోకానికి గౌతమ మహర్షి తపశ్శక్తితో అవతరించిన గోదావరి కొవ్వూరు, రాజమండ్రిల మధ్య నుంచి అఖండ గోదావరిగా ప్రవహించి తర్వాత అది ఏడుపాయలుగా చీలింది. కన్యప (తుల్యబాగ), అత్రి (కోరంగి) గౌతమి, భారద్వాజ, కౌశిక లేక విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ అన్నవి ఏడుపాయలు. భారద్వాజ, విశ్వమిత్ర, జమదగ్ని పాయలు ఇప్పుడు లేవు.

మాఘశుద్ధ ఏకాదశికి స్వామివారి కళ్యాణము, వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఉత్సవం జరుగుతాయి. పూర్వం చోళరాజులచే ప్రతిష్టించ బడిన ఈశ్వరుడు శ్రీ చోడేశ్వ రుడు. చోళ భూపతులు ఈ స్వామికి భూమి కూడా దానం ఇచ్చారు. ఇవిగాక శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి, శ్రీ గౌతమేశ్వరస్వామి, శ్రీ బాలాత్రిపురసుందరేశ్వరస్వామి, శ్రీ చైతన్య రాధాకృష్ణ, ఆంజనేయస్వామి, గ్రామదేవత కొవ్వూరమ్మ ఇతర ఆలయాలు.


## 55) శ్రీ అనంత భోగేశ్వరస్వామి వారి ఆలయం - కుమారదేవం

కొవ్వూరుకి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో గోదావరి ఒడ్డునే ప్రయాణిస్తే తగులుతుంది ఈ కుమార దేవం గ్రామం. కొవ్వూరు మండలంలోని ఈ గ్రామానికి బస్సు సౌకర్యం వుంది. ఇక్కడ బస చేయడానికి ఎలాంటి వసతి సౌకర్యాలు లేవు.


శ్రీ అనంత భోగేశ్వర స్వామి వారి ఆలయం, కుమారదేవం

ఇక్కడరెండు పురాతన దేవాలయములున్నాయి. వాటిలో శ్రీ అనంత భోగేశ్వర స్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైయున్నారు.

పూర్వము ఒకప్పుడు అనగా వెయ్యేళ్ళ క్రితం శ్రీ అనంత భోగేశ్వర ఆలయం వేరొకచోట గోదావరి నదికి తూర్పు ఒడ్డున అనగా తూర్పుగోదావరిలో వుండేది. ఒకసారి తీవ్రాతి తీవ్రంగా వచ్చిన గోదావరి వరదలో ఆ ఆలయం, శివలింగము




శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కుమారదేవం

కూడా కొట్టుకొనిపోయి గోదావరికి పడమర వైపుకి లింగము చేరింది.

అప్పుడు ఆ గ్రామ పెద్దలలో ఒకరికి ఈశ్వరుడు కలలో కన్పించి గోదావరిలో తన లింగము వున్నదనీ, దానిని తెచ్చి ప్రతిష్ఠ చేయమని, గోదావరిలో ఎక్కడయితే తూనీగ తిరుగుతుందో అక్కడే తను వున్నట్లు గుర్తు అని చెప్పి అదృశ్యమయ్యాడు.

అప్పుడు గ్రామస్థు లంతా పడవల్లో గోదావరి లోకెళ్ళి గాలించారు. తూనీగ తిరుగుతున్న చోట గెడకర్రతో పొడవగా, అది శివలింగమునకు తగిలి, శివలింగము పగిలి నెత్తురు పొంగుకొచ్చింది.



గర్భగుడిలో అమ్మవారు, కుమారదేవం

ఆ లింగమును తీసుకొచ్చి ఒడ్డుకు చేరుకున్నారు. అంతకుముందే గూటాలరాణి గారి సహాయంతో అక్కడ ఆలయాన్ని నిర్మించడం జరిగింది. లింగ ప్రతిష్ఠాపన కోసం ఆలోచిస్తుండగా స్వామివారు స్వప్నంలో చెప్పడంతో తెచ్చిన ఆ లింగమునే ప్రతిష్టించారు.


పూర్వం స్వయంభువుగా వెలిసిన స్వామివారి ఆలయాన్ని దేవరపల్లి రెడ్డిరాజులు నిర్మించారు. ఇప్పుడున్న దేవాలయాలకు ఎన్నో దానములు ఇచ్చినట్లుగా అనేక శిలాశాసనాలు దొరికాయి.

1882వ సంవత్సరములో, ఇదే ఆవరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా నిర్మించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కళ్యాణ మంటపంలో కొన్ని శాసనాలు వున్నాయి.

వైశాఖ శుద్ధ పౌర్ణమికి కళ్యాణం ఘనంగా జరుగుతుంది.

## 56) శ్రీ మదనగోపాలస్వామి వారి ఆలయం - తాళ్ళపూడి

కొవ్వూరు నుంచి గోదావరి ఒడ్డునే వున్న రోడ్డు మీద ఎగువకు ఇరవై నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే, ఒడ్డునే తగులుతుంది తాళ్ళపూడి గ్రామం. ఇది మండల కేంద్రం కూడా. అయినా బస చేయడానికి ఎలాంటి వసతి సౌకర్యాలు లేవు.



శ్రీ మదనగోపాలస్వామి ఆలయం, తాళ్ళపూడి

ఇక్కడ కొలువై వున్నది శ్రీ మదనగోపాలస్వామివారు. ఈ స్వామివారి ఆలయాన్ని నిర్మించి సుమారు వంద సంవత్సరాలు అయి వుంటుంది. అంతకు ముందున్న ఆలయం శిథిలం కావడంతో తిరిగి ఆలయాన్ని నిర్మించడం జరిగిందని తెలుస్తోంది.

స్వామివారు మహామహిమాన్వితులని, ఆయన ఎన్నో మహిమలను తన భక్తులకు చూపినట్లుగా స్థానిక భక్తులు చెబుతున్నారు ఇక్కడ వున్న శ్రీ మదనగోపాలస్వామి ఆలయం చాలా విశాలమయిన ఆవరణలో వున్నది

యాత్రికుల వసతికి వున్న సత్రము వినియోగంలో వున్న సూచనలు ఎక్కడా కానరాలేదు. మాఘశుద్ధ ఏకాదశి నాడు స్వామివారి కళ్యాణం బహువేడుకగా జరుగుతుంది

చుట్టుప్రక్కల గ్రామాల నుంచి కూడా వేలాది సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవానికి హాజరవుతారు. ఈ ఆలయ నిర్వాహకులు గుడి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలుస్తోంది.

## 57) శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయం - గూటాల

కొవ్వూరు నుంచి గోదావరి ఒడ్డునే వున్న రోడ్డు మీదే ప్రయాణిస్తే కొవ్వూరుకి ఇరవై ఏడు కిలోమీటర్ల దూరం అనంతరం తగులుతుంది గూటాల గ్రామం. పోలవరం మండలంలోని గూటాల ఒకప్పుడు జమీందారుల ఇలాకాలో వుండేది.

ఇక్కడ వున్న అతిప్రాచీనమైన గుడి శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామివారి ఆలయం. ఎన్నో వందల ఏళ్ళ చరిత్ర గల ఈ పురాతన ఆలయం ఏటిగట్టు దిగువన వుండటం వలన గోదావరి ఆటుపోట్లకి గురి అయ్యి శిథిలమయిపోయినట్లుగా తెలుస్తోంది.




శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి వారి ఆలయం, గూటాల

గ్రామస్తులంతా కలసి గోదావరి ఏటిగట్టున నూతనంగా శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి ఆలయాన్ని నిర్మించారు. ఇదిగాక ఇక్కడ శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దేవాలయం వున్నది. ఈ దివ్యస్థలంలో ఏడు శ్రీరామాలయాలు, గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయములు కూడా వున్నాయి.

## 58) శ్రీ భద్రకాళీ సహిత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయం - పట్టిసీమ

గోదావరి నదీ మధ్య లో పవిత్ర పట్టి సాచల క్షేత్రం వుంది. కొవ్వూరు నుంచి ముప్పయి కిలోమీటర్ల దూరంలో గోదావరి ఒడ్డునే వున్న రోడ్డు మీద ప్రయాణిస్తే పాత పట్టి సీమగ్రామము ఎదురవుతుంది ఏటొగట్టు మీద నిలబడి చూస్తే గోదావరి మధ్యలో కన్పిస్తుందో కొండ.... దాని మీద శ్రీ భద్రకాళీ సహిత శ్రీ వీరేశ్వరస్వామి వారి ఆలయం. అక్కడకు చేరుకోవడానికి పడవలు ఎప్పుడూ సిద్ధంగా వుంటాయి

పోలవరానికి మూడు కిలోమీటర్ల దూరం, రాజమండ్రికి ముప్పయి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న ఈ పట్టిసాచల క్షేత్రం అతి దివ్యమయింది. భారత దేశంలో పంచకాశీ క్షేత్రములలో ఇదొకటి।




*భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయం, పట్టిసం*

పూర్వం రాజ మహేం ద్రవరానికి పంచగిరి దుర్గ మని పేరు. ఆ పంచ దుర్గములలో ఇది ఒకటి భద్రగిరి. వీరభద్రేశ్వరుని కొండ. పట్టిస క్షేత్రము నకు అరున్నర కిలో మీటర్ల దూరంలో మహా నందీశ్వరుని ఆలయం వుంది పట్టిస వీరభద్రే శ్వరుని వాహనమగు నందీశ్వరుడు ఇక్కడ వున్నాడు.

స్కాంద పురాణంలో పట్టిసాచల క్షేత్రము గురించి ఇలా వుంది.

పూర్వకాలములో పర్వతములకు రెక్కలుండేవి. అవి ఆకాశంలో ఎగురుతూ సంచారం చేస్తుండేవి. వాటికి అలసట కల్గినప్పుడు భూమ్మీద దిగుతుండేవి. అలా భూమి మీద దిగడంతో భూమిపై గల జీవరాసులకి ప్రాణాపాయం కలిగేది. భవిష్యత్‌లో అలాంటి ప్రమాదం కలగకుండా ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాలకున్న రెక్కల్ని ఖండించేశాడు. నాటి నుంచి పర్వతాలకు సంచారము లేక ఎక్కడివక్కడే వుండిపోయాయి.

దక్ష ప్రజాపతి తన కుమార్తె సతీదేవిని శివుడుకిచ్చి వివాహం జరిపించాడు. వారి వివాహం చూడటానికి దేవతలందరితోనూ, పర్వతములు కూడా వాటి స్థానముల నుంచి తరలి కైలాసమునకు గగనములో ప్రయాణం సాగించాయి. వివాహం అతి వైభవంగా జరిగింది. పరమేశ్వరుడు సతీ సమేతుడై తన శిరస్సు మీద స్థిరనివాసం వుండటంతో తనతో ఎవరూ సమానం కాదన్న గర్వంతో దేవకూట పర్వతాన్ని సభలో కైలాసపర్వతం అవమానించింది.




భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వర స్వామి ఆలయం, పట్టిసం

దేవకూట పర్వతము కైలాస పర్వతంపై కోపగించి కైలాసం నుంచి పుష్ప గిరికి బయలు దేరింది. మధ్యలో నైమిశారణ్యములో పుష్పగిరికి ఉత్తరదిశగా పది క్రోసుల దూరంలో వుండగా ఇంద్రుడు వజ్రాయుధంతో రెక్కలు ఖండించడంతో ఏడుస్తుం డగా, నారదుడు దేవ కూటాన్ని ఓదార్చి శివ పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు.

దేవకూటం ఎన్నో సంవత్సరాలు ఘోర తపస్సు చేసి పరమేశ్వరుని సతీసమేతంగా తన శిరముపై స్థిరనివాసము వుండమని కోరాడు. త్వరలో నీ అభీష్టము నెరవేరుతుందన్నాడు పరమేశ్వరుడు. శాపవశాన ఏనుగు, మొసలిగా పుట్టిన ఇంద్రద్యుమ్న గంధర్వులకు శాపవిముక్తి కలిగించాడు శ్రీహరి.

పూర్వం జాంబవంతుడు శ్రీహరితో యుద్ధం చేయాలని, దేవకూటాద్రి మీద శ్రీహరి కోసం ఎన్నో సంవత్సరాలు తపస్సు చేస్తే హరి ప్రత్యక్షమయి ద్వాపరయుగములో శ్రీకృష్ణునిగా అవతరించి నీ కోరిక తీరుస్తానన్నాడు. అప్పుడు జాంబవంతుడు త్వరలో పరమేశ్వరుడు వీరభద్రుని అవతారములో భద్రకాళీ సమేతుడై దేవకూటాద్రిపై వెలుస్తారు. నువ్వు కూడా ఇక్కడ వెలసి ఈ కొండను అనుగ్రహించమన్నాడు. ఆ విధముగా శ్రీ భూనీలాసమేతుడై భావనారాయణస్వామిగా



గర్భగుడిలో శ్రీ భద్రకాళీ అమ్మవారు, పట్టిసం

దేవకూటాద్రిపై పట్టి సాచలమునకు క్షేత్ర పాలకుడై జాంబవంతునితో ప్రతిష్ఠించబడి వెలిశాడు జాంబవంతుడు స్వామి వార్ని సేవించడము స్వామి హస్తముల్లో చక్రాయుధములు తారుమారుగా వుండటం విగ్రహంలో ఇప్పుడు కూడా చూడచ్చు.


ఈ కొండకు సమీపంలో శ్రీహరి గజేంద్ర మోక్షం కలిగించిన ప్రదేశంలో కరి, మకరములు శిలలుగా మారినట్లు నేటికీ కన్పిస్తాయి. ఏనుగుశిలగా మారినందున ఆ కొండని ఏనుగు కొండ అని పిలుస్తారు.

దక్షుడు తన అల్లుడైన శివుని అవమానించడానికి 'బృహస్పతి సభ'యని పేర్న 'నిరీశ్వరయాగం' తలపెట్టి అల్లుడిని తప్ప మిగిలిన వారందర్నీ పిలిచాడు. అందరూ వెళ్ళడం చూసి సతీదేవి మనం కూడా వెళదామని భర్త నడిగింది. భర్త వారించినా వినకుండా ప్రమధిగణాలను తోడు తీసుకుని సతీదేవి పుట్టింటికెళ్ళింది.

దక్షుడు యజ్ఞవాటికలో వున్న తన కుమార్తెని పలుకరించకుండా అల్లుడ్ని తిడుతున్నాడు. సతీదేవి ఆ దూషణలను భరించలేక, భర్త దగ్గరకు తిరిగి వెళ్ళడం ఇష్టంలేక, యోగాగ్నిని సృష్టించి అందులో దూకి దగ్ధమయింది. అది గమనించిన శివుడు ఉగ్రుడై ప్రళయ తాండవం చేస్తూ, తన జడలలోంచి ఓ జడను తీసి నేలకేసి కొట్టాడు. అందులోంచి వీరభద్రుడు ఉద్భవించి "ఏమి సెలవు తండ్రి!" అన్నాడు.

పరమేశ్వరుడు వీరభద్రునకు పట్టసాయుధం ఇచ్చి "నీ తల్లి యోగాగ్నిలో దగ్ధమౌతోంది. నువ్వు తక్షణమే వెళ్ళి దక్షుని యాగాన్ని ధ్వంసం చేసి శిరస్సు ఖండించ"మన్నాడు.

వీరభద్రుడు ప్రళయకాలరుద్రుడై ద్రాక్షారామానికొచ్చి దక్షయాగాన్ని ధ్వంసం చేసి అర్ఘం



శ్రీ భావనారాయణ స్వామి ఆలయం, పట్టిసం

వచ్చిన వాసుదేవుని చక్రాన్ని నమిలి, సూర్యుడి పళ్ళూడగొట్టి పట్టసాయుధంతో దక్షుని తలనరికి తిరిగి వచ్చేసరికి దేవతలంతా శంకరుని ప్రార్థించారు. దక్షుని భార్య తన సౌభాగ్యం నిలుపమని కోరడంతో దక్షుని మొండానికి గొర్రె తలను అతికించి బ్రతికించాడు

దక్షుని శిరస్సుని ఖం డించిన పట్ట సాయు ధము పాతాళం లోకి పోయి, అక్కడ నుంచి పైకి వచ్చి దేవ కూటాద్రి మీద ఆగింది ఆ పట్ట సాయుధం వెనుకనే పాతాళం నుంచి భాగవతీ జలం కూడా దేవకూటాద్రి కొచ్చి అక్కడున్న భద్రగుండ, చక్ర గుండం లలో కలిసింది

యజ్ఞవాటికలో దగ్ధ మవుతున్న సతీ శరీరాన్ని శంకరుడు తన భుజం మీద వేసుకుని ప్రళయ తాండవం చేస్తుంటే అన్ని లోకాలు భయపడు తుంటే శ్రీహరి తన చక్రా యుధంతో సతీదేవిని పద్దెనిమిది ముక్కలుగా చేస్తే, అవి పద్దెనిమిది ప్రదేశాల్లో పడ్డాయి. అవే అష్టాదశ పీఠాలు!

దేవకూటాద్రిపై వీరభద్రుడు ప్రళయతాండవం చేస్తుంటే భూమి అదురుతుంటే అంతా అగస్త్యుడ్ని ప్రార్థించారు. అగస్త్యుడు వీరభద్రుడ్ని ప్రార్థించి దేవకూటంపై స్థిరనివాసం ఏర్పరచుకోమని వీరభద్రుడ్ని ఆలింగనం చేసుకుని గట్టిగా పట్టుకున్నాడు. వీరభద్రుడు లింగాకారమై స్వయంభువుగా వెలిశాడు. లింగం చుట్టూ అగస్త్యుని చేతుల గుర్తులు ఇప్పటికీ వున్నాయి. లింగాగ్రములో అగస్త్యుడు వీరభద్రుని జడలు ముడివేసిన శిఖముడి కూడా కన్పిస్తుంది.

కాలాంతరంలో గౌతముడు గోదావరిని తీసుకురావడం, గోహత్యా దోషాన్ని తొలగించడం వల్ల గోదావరి అని పేరు రావడం జరిగింది.

ఇక్కడి ఆలయాలను చోళచక్రవర్తులు నిర్మించినట్లు, మధ్యకాలంలో ప్రతాపరుద్రుని చేత



గర్భగుడిలో శ్రీ భావనారాయణ స్వామి, పట్టిసం

పునరుద్ధరింపబడి, తిరిగి నిర్మించ బడినట్లు తెలుస్తోంది క్రీస్తుశకం 1408-1415 ప్రాంతములో అన్న దేవచోడుని ఆస్థానంలో నిశ్శంక కొమ్మకవి వుండేవాడు. ఈయన ఈ ఆలయానికి స్థానాపతిగా వుండేవాడని శాసనం వల్ల తెలుస్తోంది.

పూర్వం ఈ ప్రాంతాన్ని ఏలినరెడ్డి రాజుల్లో మంగభూపతిదేవు, లక్ష్మి నారాయణ దేవు అనురెడ్డి ప్రభువు సోదరులు ఈ దేవాల యాల నిర్వహణ కోసం కొన్ని దానాలిచ్చినట్లు తెలుస్తోంది.

మధ్యకాలంలోరెడ్డి ప్రభువులకు, బ్రిటీషు వాళ్ళకి వచ్చిన తగాదాల కారణంగా పోలవరం. గూటాల ఎస్టేట్లు వేలం వేయబడి జమీందారు లకు సంక్రమించింది. తరువాత పోలవరం జమీందార్లు శ్రీ కొచ్చెర్ల కోట జగ్గయ్య గారు, గూటాల జమీందారు శ్రీ మణ్యం కనకయ్య గారు శివకేశవు లిద్దరికి అగ్రహారాలు సమర్పించి శ్రీ స్వామివార్లకు వంశపారంపర్య ధర్మకర్తలుగా ఆలయ నిర్వాహణ సాగిస్తున్నారు. ఇక్కడ వున్న శ్రీ సీతారామస్వామి వారి ఆలయం 1912లో గూటాల జమీందారిణి శ్రీమతి మణ్యం మహాలక్ష్మిగారు కట్టించినట్లు శాసనం వుంది.

ఈ దివ్యక్షేత్రములో ప్రతీ సంవత్సరం మహాశివరాత్రికి గొప్పమేలా జరుగుతుంది. లక్షలాది భక్తులు దేశం నలుమూలల నుంచి వచ్చి గోదావరి స్నానం చేసి స్వామిని దర్శించి అభిషేకాలు జరుపుతారు. గోదావరి నదిని దాటడానికి పడవలు, లాంచీలు వుపయోగిస్తారు.

మామూలు దినాల్లో ఉదయం ఆరు నుంచి సాయంకాలం ఆరుగంటల వరకూ అక్కడ అర్చకులు వుంటారు. చీకటిపడితే అక్కడ దేవస్థాన సిబ్బందిగానీ, అర్చకులుగానీ ఎవరూ వుండరు. పాతపట్టి సీమలోకి వచ్చేస్తారు.

ఇక్కడకొచ్చిన భక్తులు శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని ఆరాధించి, శ్రీ భూనీలా సమేత భావనారాయణ స్వామిని అర్చించి, శ్రీ ఆంజనేయ సేవితుడైన శ్రీ సీతారాములను పూజిస్తారు.

ఇక్కడవున్న శ్రీ అనిస్త్రీ, పునిస్త్రీ అమ్మవార్లను దర్శిస్తే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని ఎన్నో తరాలుగా ఓ నమ్మకం. స్వయంభువంగానీ, పౌరుషేయంగాని ఐతే ఊరులోని లింగముకన్నా ఊరి వెలువల వున్న లింగము ఎక్కువ ఫలాన్నిస్తుంది. అలాగే బహిర్లింగము కన్నా అరణ్యములో వున్న లింగము నూరురెట్ల అధిక ఫలమిస్తుంది. దానికంటే తపో వనములో వున్న లింగము పదివేల రెట్లు అధిక ఫలాన్నిస్తుందని పురాణాల్లో తెలియజేయబడివుంది.



*గర్భగుడిలో శ్రీ సీతారామస్వామి, పట్టినం*

తపస్సుకి రేవాతీరము, మరణమునకు గంగాతీరము, దానమునకు కురుక్షేత్రము, గౌతమీ తీర్థం ఈ మూడింటికి శ్రేష్ఠమయినదిగా చెప్పబడింది.

పుణ్య ఫల ప్రాప్తిరస్తు

It's Brilliant Book No.2

AC 70497

# పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రసిద్ధ దేవాలయాలు

## ఎన్.ఎస్. నాగిరెడ్డి



బ్రిల్లియంట్ బుక్స్
విజయవాడ-3